


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 79 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 30 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 79 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 30 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## ముగిసిన అజిత్ పవార్ అంత్యక్రియలు..

## హాజరైన అమిత్ షా, నితిన్ గడ్కరీ

- విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన అజిత్ పవార్
- బారామతిలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- పెద్ద ఎత్తున హాజరైన ఎన్సీపీ కార్యకర్తలు
- అజిత్ పవార్ అంత్యక్రియల్లో నారా లోకేశ్..

విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి చెందిన సంగతి తెలిసిందే. బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ఆయన అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే తదితరులు హాజరయ్యారు. అంత్యక్రియలకు పెద్ద ఎత్తున ఎన్సీపీ కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

- మిగతా 2లో...






## మేమంతా ఒకే మాటపై ఉన్నాం

- ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ అనంతరం కీలక ప్రకటన చేసిన శశి థరూర్
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీతో శశి థరూర్ భేటీ
- పార్టీ నాయకత్వంతో అసంతృప్తిగా ఉన్నారన్న ఊహాగానాలకు తెర
- కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని స్పష్టీకరణ
- చర్చలు స్నేహపూర్వకంగా, ఫలప్రదంగా జరిగాయని థరూర్ ట్వీట్

- మిగతా 2లో...

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు సిట్ నోటీసులు

- నంది నగర్ లోని నివాసంలో నోటీసులు అందించిన సిట్
- విచారణకు పీఎస్ కు రావాల్సిన అవసరం లేదన్న సిట్ అధికారులు
- ప్లేస్ చెబితే తామే అక్కడకు వస్తామని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు అందాయి. హైదరాబాద్ లోని నందినగర్ లో ఉన్న కేసీఆర్ నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు నోటీసులు అందించారు. రేపు మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. కేసీఆర్ వయసు దృష్ట్యా విచారణ కోసం పోలీస్ స్టేషన్ కు

### నేడు విచారణకు రాలేను సిట్‌కు కేసీఆర్ రిప్లయ్

- నోటీసుల నేపథ్యంలో సిట్‌కు ప్రత్యుత్తరం రాసిన కేసీఆర్
- నేడు మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు చివరి రోజు అన్న కేసీఆర్
- ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానని వెల్లడి

- మిగతా 2లో...



## మేడారం జాతరలో మహాఘట్టం..

# గద్దెపైకి సమ్మక్కతల్లి

- మేడారంలో మొక్కులు చెల్లించుకున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం
- మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను సందర్శించిన కేంద్ర మంత్రులు
- గద్దెలపై నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న ఓరం, కిషన్ రెడ్డి
- గిరిజనుల మహా కుంభమేళా ఈ జాతర అని అభివర్ణించిన జువల్ ఓరం
- రూ.890 కోట్లతో సమ్మక్క-సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు
- గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి కేంద్రం పూర్తి మద్దతు ఇస్తుందని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:మేడారం జాతరలో మహాఘట్టం ఆవిష్కృతం అయ్యింది. జనవరి 29న వనదేవత సమ్మక్క తల్లి మేడారం గద్దెపైకి చేరింది. కుంకుమ భరణి సమ్మక్క ప్రతి రూపాన్ని పూజారులు గద్దెలపైకి తీసుకుని వచ్చారు. దారిపొడవునా అడుగడుగునా





## బాధ్యులకు శిక్ష పడాల్సిందే

- కేసీఆర్ కు సిట్ నోటీసులపై మహేశ్ గౌడ్ స్పందన..
- కేసీఆర్ పై తమకు గౌరవం ఉందన్న మహేశ్ గౌడ్
- విచారణ పారదర్శకంగా జరుగుతోందని వ్యాఖ్య
- పూర్తి స్థాయిలో విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న మహేశ్

- మిగతా 2లో...





## పాకిస్థాన్‌కు వెళ్లొద్దు...

### తమ పౌరులకు అమెరికా అలర్ట్!

- పాకిస్థాన్‌కు వెళ్లాలనుకునే ప్రయాణికులకు అమెరికా ప్రభుత్వం హెచ్చరిక
- ఉగ్రవాదం, కిడ్నాపులు, నేరాల ముప్పు ఎక్కువగా ఉందంటూ లెవెల్ 3 అడ్వైజరీ
- బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులకు వెళ్లొద్దని లెవెల్ 4 హెచ్చరిక జారీ

- మిగతా 2లో...

## హైదరాబాద్‌లో హైడ్రా కొరడా: జూబ్లీహిల్స్ 'నీరూస్'కు తాళాలు

- అగ్నిమాపక నిబంధనలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా
- జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ నీరూస్ షోరూంను సీజ్ చేసిన అధికారులు
- నాంపల్లిలో మరో ఫర్నిచర్ షోరూంకు కూడా తాళం
- నాంపల్లి దుర్ఘటన తర్వాత తనిఖీలు ముమ్మరం
- ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి

- మిగతా 2లో...





దేశంలోని అత్యంత ప్రమాదకరస్థితిలోని

## మూడు డ్యామ్‌లలో మేడిగడ్డ

- డ్యామ్‌ల భద్రతపై పార్లమెంటులో టీడీపీ ఎంపీల ప్రశ్న
- అత్యంత ప్రమాదకరస్థితిలో మేడిగడ్డ, లోయర్ ఖజురి, బొకారో డ్యామ్‌లు
- వెల్లడించిన కేంద్ర జల్‌శక్తి శాఖ

- మిగతా 2లో...

## ఇది విచారణ కాదు... ప్రతీకారం

### కేసీఆర్‌కు సిట్ నోటీసులపై కేటీఆర్ ఫైర్



- కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం కక్ష సాధింపేనన్న కేటీఆర్
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ చర్యలని ఆరోపణ
- చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించారని వ్యాఖ్య
- బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరపలేరని హెచ్చరిక
- కాంగ్రెస్ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తామని ప్రకటన

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### దావోస్ వేదికపై తెలంగాణ రైజింగ్

2026 దావోస్ సదస్సులో తెలంగాణ ప్రత్యేక ఆకర్షణగా నిలవడం రాష్ట్రం అనుసరిస్తున్న అభివృద్ధి మార్గంపై పెట్టుబడిదారుల విశ్వాసం మరింత బలపడుతున్నదనడానికి స్పష్టమైన సంకేతంగా నిలుస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన 2025 గ్లోబల్ సమ్మిట్, దావోస్‌లో జరిగిన 2026 వరల్డ్ ఎకనామిక్ ఫోరం.. ఈ రెండు వేదికలు తెలంగాణకు పెట్టుబడుల సోపానాలుగా మారాయి. భారతదేశ స్వాతంత్ర్యం శతాబ్ది దశకు చేరువవుతున్న నేపథ్యంలో, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ప్రకటించింది. ఈ లక్ష్యానికి అనుగుణంగా ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశంగా పెట్టుకుంది. 2025 గ్లోబల్ సమ్మిట్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు సాధించడం ఈ దిశలో కీలక ముందడుగు. 2026 జనవరి 20 నుంచి 22 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధుల బృందం, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సస్టెయినబిలిటీ, స్కిల్లింగ్ వంటి ఆధునిక రంగాల్లో పలు అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం రాష్ట్ర భవిష్యత్ దిశను స్పష్టంగా చూపిస్తోంది. దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం సాధించిన పెట్టుబడి ప్రతిపాదనలు గణనీయమైనవే.. రూ.12,500 కోట్లతో రష్మి గ్రూప్ స్టీల్ ప్లాంట్, రూ.6,000 కోట్లతో న్యూక్లియర్ సంస్థ విద్యుత్ ప్లాంట్, రూ.3,500 కోట్లతో లోరియల్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్, రూ.5,000 కోట్లతో యూపీసీ వోల్ట్ డేటా సెంటర్, రూ.1,000 కోట్లతో విమానాల మరమ్మతు యూనిట్, రూ.623 కోట్లతో స్నైడర్ సంస్థ విస్తరణ, రూ.150 కోట్లతో గోద్రేజ్ డెయిరీ ప్లాంట్ విస్తరణ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక భవిష్యత్తుకు కొత్త ఊపునిస్తున్నాయి. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రెన్యూవబుల్స్ సంస్థ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ పెట్టుబడులతో పాటు ఉద్యోగావకాశాలు కూడా గణ నీయంగా పెరగనున్నాయి. రష్మి స్టీల్ ప్లాంట్ ద్వారా సుమారు 12 వేల మందికి, యూపీసీ వోల్ట్ డేటా సెంటర్ ద్వారా 4 వేల మందికి, యూపీసీ రెన్యూవబుల్స్ ప్రాజెక్ట్ ద్వారా నిర్మాణ దశలోనే 3 వేల మందికి ఉపాధి లభించనుంది. లోరియల్ సంస్థ హైదరాబాద్‌ను తన గ్లోబల్ టెక్ హబ్‌గా ఎంపిక చేయడంతో 2 వేలకుపైగా టెక్, ఏఐ ఉద్యోగాలు సృష్టించబడే అవకాశముంది. ప్రతి ఏటా దావోస్ సదస్సు అనంతరం గ్రేటర్ హైదరాబాద్‌లో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు.. ఇది పెట్టుబడి ఒప్పందాల అమలును వేగవంతం చేసే అవకాశం కల్పిస్తుంది.

గ్రేటర్ హైదరాబాద్ ఇప్పటికే ఐటీ రాజధానిగా పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం 1500కు పైగా ఐటీ కంపెనీలు, 10 లక్షలకుపైగా ఉద్యోగులు ఈ రంగంలో ఉన్నారు. ఫార్మా, వైద్య రంగాల్లోనూ హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలతో ఫ్యూచర్ సిటీలో పరిశోధన ఆధారిత పరిశ్రమలకే ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ దూరదృష్టిని చాటుతోంది. దావోస్ వేదికగా కురిసిన పెట్టుబడుల వర్షం కార్యరూపం దాల్చితే తెలంగాణ ప్రపంచ యవనికపై రైజింగ్ స్టేట్ గా కనిపించడం ఖాయమనే ధీమా వ్యక్తమవుతోంది.

### పాకిస్థాన్‌కు వెళ్లొద్దు...

పాకిస్థాన్‌లో నెలకొన్న భద్రతా పరిస్థితుల దృష్ట్యా, ఆ దేశానికి ప్రయాణాలు పెట్టుకోవద్దని అమెరికా తమ పౌరులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఉగ్రవాదం, నేరాలు, అంతర్యుద్ధం, కిడ్నాపుల వంటి ప్రమాదాలు పొంచి ఉన్నందున పాకిస్థాన్ ప్రయాణ ప్రణాళికలను పునఃసమీక్షించుకోవాలని అమెరికా విదేశాంగ శాఖ సూచించింది. ఈ మేరకు గురువారం కొత్త ట్రావెల్ అడ్వైజరీని విడుదల చేసింది. పాకిస్థాన్‌కు 'లెవెల్ 3' కేటగిరీ హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించింది. లెవెల్ 3 అంటే అధిక ప్రమాదం ఉన్న ప్రాంతమని, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని అర్థం.ప్రధాన రవాణా కేంద్రాలు, మార్కెట్లు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, సైనిక స్థావరాలు, విమానాశ్రయాలు, రైళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనా స్థలాలు, పర్యాటక ప్రాంతాలు, ప్రభుత్వ భవనాలే లక్ష్యంగా దాడులు జరగవచ్చని అమెరికా విదేశాంగ శాఖ తన అడ్వైజరీలో వివరించింది. ముఖ్యంగా బలూచిస్థాన్ ప్రావిన్స్, ఖైబర్ పఖ్తుంఖ్వా (కేపీ) ప్రావిన్స్, గతంలో కేంద్ర పాలిత గిరిజన ప్రాంతాలుగా (ఫీుూూ) ఉన్న ప్రదేశాలకు 'లెవెల్ 4' హెచ్చరిక జారీ చేసింది. ఈ ప్రాంతాలకు ఎలాంటి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని స్పష్టం చేసింది. ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, సాధారణ పౌరులే లక్ష్యంగా హత్యాయత్నాలు, కిడ్నాపులు సర్వసాధారణమని పేర్కొంది. పాకిస్థాన్ మూలాలున్న అమెరికన్ పౌరులకు కూడా ఈ హెచ్చరిక వర్తిస్తుందని స్పష్టం చేసింది.బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వాలలో ఉగ్రవాదులు తరచూ దాడులకు పాల్పడుతున్నారని, కరాచీ, ఇస్లామాబాద్ వంటి ప్రధాన నగరాల్లోనూ దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయని అడ్వైజరీలో పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో అనుమతి లేకుండా నిరసనలు చేయడం చట్టవిరుద్ధమని, నిరసనలకు సమీపంలో ఉన్నా భద్రతా దళాల నిఘాకు గురయ్యే ప్రమాదం ఉందని అమెరికా హెచ్చరించింది. గతంలో నిరసనల్లో పాల్గొన్న అమెరికన్ పౌరులను నిర్బంధించినట్లు గుర్తు చేసింది. అంతేకాకుండా, పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం లేదా అధికారులను విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా నిర్బంధించే అవకాశం ఉందని తెలిపింది.ఇదిలా ఉండగా, జనవరి 21 నుంచి 75 దేశాలకు చెందిన వలస వీసాల ప్రాసెసింగ్‌ను ట్రంప్ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ జాబితాలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ కూడా ఉన్నాయి. అమెరికా వీసా ఆంక్షలపై స్పందించిన పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం, ఈ నిలిపివేత తాత్కాలికమేనని ఆశిస్తున్నట్లు, త్వరలోనే సాధారణ ప్రాసెసింగ్ తిరిగి ప్రారంభమవుతుందని భావిస్తున్నట్లు పేర్కొంది.

# మేడారం జాతరలో మహాఘట్టం..

# గద్దెపైకి సమ్మక్క తల్లి

- మొదటి పేజీ తరువాయి

భక్తులు అమ్మవారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. వన దేవతలను గద్దెలపై ప్రతిష్ఠించే సమయంలో భక్తులు పూనకంతో ఊగిపోయారు. లక్షలాది మందితో మేడారం జనసంద్రోహం అయ్యింది. చిలుకల గుట్ట నుంచి కుంకుమ భరణి ప్రతి సమ్మక్క ప్రతి రూపాన్ని తీసుకొచ్చేముందు..ములుగు జిల్లా ఎస్పీ ఏకే 47 తో మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్కకు అధికారికంగా స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, , జిల్లా కలెక్టర్ దివాకర్ స్వాగతం పలికారు. గద్దెపైకి చేరే వరకు పోలీసులు నాలుగు అంచెల భద్రతను ఏర్పాటు చేశారు.జనవరి 28న పగిడిద్దె రాజు, గోవిందరాజు, సారలమ్మ గద్దెపైకి చేరగా..ఇవాళ సమ్మక్క తల్లి గద్దెపైకి చేరింది. రేపు జనవరి 30న అమ్మవార్లు సమ్మక్క, సారక్క ఇద్దరూ గద్దెలపై కొలువుతీరి భక్తులకు దర్శనమిస్తారు. జనవరి 31న సాయంత్రం వారికి ఆవాహన పలికి తిరిగి వనప్రవేశం చేస్తారు.

ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారక్క జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈ సారి అన్ని ఏర్పాట్లు చేసింది ప్రభుత్వం. కోట్లాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు వస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మేడారం జాతరకు 4వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

**జాతర విశిష్టత**

వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ తల్లి-కూతుర్లు... తెలంగాణ ప్రాంతాన్ని కాకతీయ రాజులు సుమారు 700 సంవత్సరాలు పరిపాలించారు. సమ్మక్క సారలమ్మలు జగిత్యాల జిల్లా ప్రాంతానికి చెందిన గిరిజన జాతికి చెందినవారు. గిరిజనుల దొర మేడరాజు అడవిలో వేటాడుతుండగా.. ఒక పుట్టపై పులులు, సింహాలు కాపలాగా ఉన్న పసిపాప సమ్మక్కను చూసి.. ఆ పాపను తీసుకెళ్లి పెంచుకున్నాడని చరిత్ర ద్వారా తెలుస్తుంది.

అప్పటి వరకు కరువు.. కాటకాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు... సమ్మక్క రాకతో సమస్యలు తగ్గిపోయాయి. అంతేకాదు.. ఎలాంటి జబ్బునైనా ఆమె చేతి పసరుతో రోగాలు నయమయ్యాయని చెబుతుంటారు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత సమ్మక్కను మేడారం పాలకుడు.... గిరిజన దొర... తన మేనల్లుడు అయిన పగిడిద్ద రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరి దాంపత్య జీవనంలో సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు కలిగారు. మేడరాజు పొలవాస ప్రాంతానికి కోయ రాజు కాగా... పగిడిద్ద రాజు మేడారాన్ని పాలించాడని చరిత్ర ఉంది.

**కాకతీయులతో యుద్ధం, త్యాగాలు**

కాకతీయ సామ్రాజ్యం విస్తరణలో భాగంగా, కాకతీయ మొదటి ప్రభువు మేడరాజు పాలించిన ప్రాంతాన్ని ఆక్రమించేందుకు దండెత్తాడు. ఈ దాడిని తట్టుకోలేక మేడరాజు తన కుమార్తె సమ్మక్క దగ్గర మేడారంలో ఆశ్రయం పొందుతాడు. పగిడిద్ద రాజు కాకతీయుల సామంతుడిగా ఉంటూ, వారికి ప్రతి నెలా కప్పం కట్టేవాడు. మూడు సంవత్సరాలుగా ఏర్పడిన కరువుల వల్ల కప్పం కట్టలేకపోవడం... మేడరాజుకు ఆశ్రయం ఇవ్వడం వంటి కారణాలతో కాకతీయులు ఆగ్రహించి మేడారంపై దండెత్తారు. కాకతీయ సైన్యాన్ని ఎదుర్కొనేంత బలం లేకపోయినా.. పగిడిద్ద రాజు, సమ్మక్క, సారక్క, వారి పిల్లలు సారలమ్మ, నాగులమ్మ, జంపన్నతో సహా కోయ ప్రజలంతా యుద్ధానికి సిద్ధమయ్యారు.

బలమైన ఆయుధాలు, గుర్రాలు, ఏనుగులతో వచ్చిన కాకతీయ సైన్యంతో వందల సంఖ్యలో ఉన్న కోయ ప్రజలు బాణాలు, మొండి కత్తులతో భీకరంగా పోరాడారు. ఈ యుద్ధంలో పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ వీరమరణం పొందారు. కుటుంబ సభ్యుల మరణాలను చూసిన జంపన్న.. అవమానాన్ని భరించలేక పక్కనే ఉన్న సంపెంగ వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆ వాగును జంపన్న వాగుగా పిలుస్తున్నారు.

తన కుటుంబ సభ్యులందరూ మరణించారని తెలిసిన సమ్మక్క, ఏమాత్రం వెనుకాడకుండా కాళీమాతలా విజృంభించి శత్రువులను ఎదుర్కొంది. అయితే, వెనుక నుంచి ఒక సైనికుడు దొంగచాటున పొడిచి సమ్మక్కను తీవ్రంగా గాయపరిచాడు. రక్తం కారుతుండగానే ఆమె చిలుకల గుట్ట వైపు వెళ్లి, నెమలినార చెట్టు కింద ఉన్న పుట్ట దగ్గర కుంకుమ భరిణెగా మారి అదృశ్యమైందని చెబుతుంటారు.

**మేడారంలో మొక్కులు చెల్లించుకున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను కేంద్ర మంత్రులు గురువారం సందర్శించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద వారికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాదర స్వాగతం పలికారు.గిరిజన డప్పు వాయిద్యాల మధ్య ఆలయంలోకి ప్రవేశించిన కేంద్ర మంత్రులు, గద్దెలపై 'నిలువెత్తు బంగారం' సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం జువల్ ఓరం మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్క - సారలమ్మ జాతర గిరిజనుల మహా కుంభమేళా అని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు, 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని, పీఎం జన్‌మన్ పథకం కింద రూ. 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య పాఠశాలలు కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, జాతర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి రూ. 80 కోట్లు, రామప్ప ఆలయానికి రూ. 40 కోట్లు, జాతర ఏర్పాట్లకు ఈ ఏడాది రూ. 3.70 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మేడారంలో సమ్మక్క - సారలమ్మ పేరుతో రూ. 890 కోట్ల వ్యయంతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. త్వరలోనే ప్రధాని ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు సిట్ నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

రావాల్సిన అవసరం లేదని సిట్ తెలిపింది. హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం వివరాలను తెలిపితే... అక్కడకే వచ్చి విచారణ జరుపుతామని పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ కుమార్ లను సిట్ విచారించింది. మళ్లీ అవసరమైతే విచారణకు పిలుస్తామని వారికి తెలియజేసింది. ఇప్పుడు గులాబీ బాస్ ను విచారణకు పిలవడంతో ఆ పార్టీలో ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో అనే ఆసక్తి సర్వత్ర నెలకొంది.

**నేడు విచారణకు రాలేను సిట్‌కు కేసీఆర్ రిప్లయ్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు విచారణకు రావాలని తనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఈ మేరకు సిట్‌కు ఆయన సమాధానం ఇచ్చారు. తాను రేపు విచారణకు రాలేనని, శుక్రవారమే మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ అని అందులో ప్రస్తావించారు. అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉందని తెలిపారు. విచారణకు

మరో రోజు కేటాయించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా తాను విచారణకు సహకరిస్తానని పేర్కొన్నారు.అలాగే తనను ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లోనే విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. 160 సీఆర్పీసీ కింద విచారణను ఒకే ప్రాంతంలో చేయాలనే నిబంధనలు ఏమీలేవని గుర్తు చేశారు. భవిష్యత్తులో నోటీసులను ఎర్రవల్లికే పంపించాలని ఆ లేఖలో కోరారు.

## ఇది విచారణ కాదు... ప్రతీకారం

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విచారణ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న రాజకీయ ప్రతీకార చర్య అని ఆయన అభివర్ణించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్, పాలనా లోపాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఇది కేవలం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని, రాజకీయ దురుద్దేశంతోనే ఈ నోటీసులు ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. "చావు నోట్లో తలపెట్టి, సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని దీక్షతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహానాయకుడు కేసీఆర్. తన పదేళ్ల పాలనలో మిషన్ భగీరథ, రైతుబంధు, దళితబంధు వంటి పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారు. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. అలాంటి నాయకుడిపై అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు విచారణల పేరుతో వేధించడం దుర్మార్గం" అని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే బీఆర్ఎస్ అధినేతపై కాంగ్రెస్ కక్ష కట్టిందని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ

ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, కేవలం నోటీసులు ఇచ్చి, బెదిరింపులకు పాల్పడి తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఆయన కీర్తిని చెరిపేయలేరని హెచ్చరించారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించేది లేదని, ప్రజలే సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఈ కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ అన్యాయ పాలనపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కేటీఆర్ ఉద్ఘాటించారు. చరిత్రను విచారణలతో కాదని, ప్రజల తీర్పుతోనే రాస్తారని ఆయన వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌లో హైడ్రా కొరడా: జూబ్లీహిల్స్ 'నీరూస్'కు తాళాలు

హైదరాబాద్ నగరంలో అగ్నిమాపక భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఉక్కుపాదం మోపింది. ఇటీవల నాంపల్లిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు.. గురువారం జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ వస్త్ర దుకాణం 'నీరూస్' తో పాటు నాంపల్లిలోని మరో ఫర్నిచర్ షోరూంను సీజ్ చేశారు.హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని నీరూస్ షోరూంలో తనిఖీ చేయగా తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులతో పాటు, అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రూఫ్ షెడ్‌లో కూడా భారీగా వస్త్రాలను నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ లేకపోవడం, మంటలను ఆర్పే పరికరాలు సరిగా లేకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం పై అంతస్తులను గోదాముగా, వస్త్రాల తయారీ కేంద్రంగా మార్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెంటనే షోరూంను సీజ్ చేయాలని ఆదేశించారు.

అనంతరం అధికారులు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నిచర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇటీవల ఐదుగురి మృతికి కారణమైన ప్రమాదం జరిగిన రోడ్డులోనే ఉన్నప్పటికీ ఈ షోరూంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. ఆరు అంతస్తుల భవనంలో మెట్ల మార్గాన్ని కూడా మూసివేసి ఫర్నిచర్ నిల్వ ఉంచడం, కనీసం ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కూడా లేకపోవడంతో ఈ షోరూంను కూడా సీజ్ చేయాలని ఆదేశించారు.ఈ రెండు షోరూంల వద్ద 'ఫైర్ అన్ సేఫ్' బోర్డులను ఏర్పాటు చేసి, హైడ్రా ఫెన్సింగ్ వేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నగరంలో ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలను కోరారు. హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 9000113667 లేదా తన వాట్సాప్ నంబర్ 7207923085కు ఫోటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

## బాధ్యులకు శిక్ష పడాల్సిందే

తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు నంది నగర్ లోని ఆయన నివాసంలో సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. కేసీఆర్ వయసును దృష్టిలో ఉంచుకొని ఆయన కోరిన ప్రదేశంలోనే విచారిస్తామని సిట్ అధికారులు తమ నోటీసుల్లో పేర్కొన్నారు.

మరోవైపు, కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వ్యవహారంలో పారదర్శకంగా సిట్ విచారణ జరుగుతోందని ఆయన అన్నారు. కేసీఆర్ పై తమకు ఎంతో గౌరవం ఉందని... అయితే, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరెవరి భాగస్వామ్యం ఉందో నిగ్గుతేలాల్సి ఉందని చెప్పారు.అప్పటి సీఎం, మంత్రుల ఆదేశాలు లేకుండా ఇంతటి భారీ స్థాయి ఉల్లంఘనలు జరిగే అవకాశమే లేదని ఆయన అన్నారు. పూర్తి స్థాయిలో సిట్ దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఎవరికైనా నోటీసులు ఇచ్చే అధికారం సిట్ కు ఉందని... కేసీఆర్‌కు నోటీసుల విషయంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని చెప్పారు. బాధ్యులు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

## దేశంలోని అత్యంత ప్రమాదకరస్థితిలోని మూడు డ్యామ్‌లలో మేడిగడ్డ

తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డ డ్యామ్ అత్యంత ప్రమాదకరస్థితిలో ఉందని కేంద్ర జల్‌శక్తి శాఖ వెల్లడించింది. డ్యామ్‌ల భద్రతపై టీడీపీ ఎంపీలు లక్ష్మీనారాయణ, శబరి పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఈ క్రమంలో మేడిగడ్డతో పాటు దేశంలోని వివిధ ప్రాజెక్టులపై కీలక సమాధానం ఇచ్చింది. దేశంలో 50 ఏళ్లకు పైబడిన డ్యామ్‌లు 1,681 ఉన్నాయని జల్‌శక్తి శాఖ తెలిపింది. గత సంవత్సరం వర్షాకాలం కంటే ముందు 6,524 డ్యామ్‌లు తనిఖీ చేశామని కేంద్రం వెల్లడించింది. వర్షాకాలం అనంతరం మరో 6,553 డ్యామ్‌లు తనిఖీ చేసినట్లు తెలిపింది. ఈ తనిఖీలలో మూడు డ్యామ్‌లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్లు వెల్లడైందని పేర్కొంది. వాటిలో తెలంగాణలోని మేడిగడ్డ, ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజురి, ఝార్ఖండ్‌లోని బొకారో డ్యామ్‌లు ఉన్నట్లు వెల్లడించింది. మేడిగడ్డ డ్యామ్‌కు సంబంధించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు జల్‌శక్తి శాఖ తెలిపింది.

## మేమంతా ఒకే మాటపై ఉన్నాం

సీనియర్ కాంగ్రెస్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్.. పార్టీ నాయకత్వంతో తనకున్న విభేదాలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. గురువారం నాడు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశమైన అనంతరం, తామంతా ఒకే మాటపై ఉన్నామని స్పష్టం చేశారు. ఈ భేటీతో పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల చర్చకు ముగింపు పలికే ప్రయత్నం చేశారు. పార్లమెంట్ భవనంలోని ఖర్గే ఛాంబర్‌లో దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఉదయం 11:15 గంటలకు ప్రారంభమైన ఈ భేటీలో మొదట కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. అయితే, చర్చలు ప్రారంభమైన కొద్దిసేపటికే ఆయన బయటకు వెళ్లిపోవడంతో ఖర్గే, రాహుల్, థరూర్ మధ్య ప్రైవేట్‌గా సంభాషణ కొనసాగింది. మధ్యాహ్నం 1:15 గంటలకు సమావేశం నుంచి బయటకు వచ్చిన థరూర్ ప్రశాంతంగా కనిపించారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, "మా మధ్య సమావేశం జరిగింది. చెప్పాలనుకున్నవన్నీ చెప్పాం. ఇప్పుడు మేమంతా ఒకే మాటపై ఉన్నాం" అని అన్నారు. అనంతరం సోషల్ మీడియాలో స్పందించిన ఆయన, ఈ చర్చలు స్నేహపూర్వకంగా, ఫలప్రదంగా జరిగాయని పేర్కొన్నారు. భారత ప్రజలకు సేవ చేసే క్రమంలో పార్టీ ముందుకు సాగుతున్నప్పుడు నాయకత్వం అంతా ఒకే తాటిపై ఉందని స్పష్టం చేశారు. పార్టీ పనితీరుపై థరూర్ అసంతృప్తితో ఉన్నారంటూ ఇటీవల వెలువడిన వార్తల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటారా అని మీడియా ప్రశ్నించగా, థరూర్ సానుకూలంగా స్పందించారు. తన నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్రంలో పార్టీకి కట్టుబడి ఉన్నానని పునరుద్ఘాటించారు. భేటీ తర్వాత, సోషల్ మీడియా పోస్ట్ ద్వారా థరూర్ రెండుసార్లు ఐక్యత సందేశాన్ని వినిపిం చడంతో.. పార్టీలో నెలకొన్న ఊహాగానాలకు ప్రస్తుతానికి తెరపడినట్లేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## ముగిసిన అజిత్ పవార్ అంత్యక్రియలు.. హాజరైన అమిత్ షా, నితిన్ గడ్కరీ

- మొదటి పేజీ తరువాయి

నిన్న ఉదయం విమాన ప్రమాదం జరిగింది. రన్ వే పైకి దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్ తో పాటు మరో నలుగురు దుర్మరణం చెందారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం బారామతికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

# మున్సిపల్ ఎన్నికలు: కేటీఆర్ వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అమల్లో ఉన్న ఎలెక్షన్ కోడ్
- సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ వాహనం తనిఖీ
- ఎన్నికల నిబంధనలకు కట్టుబడి ఉంటామన్న కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో మరోసారి రాజకీయాలు వేడెక్కాయి. అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో రాజకీయ పార్టీలు బిజీగా ఉన్నాయి. మరోవైపు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాహనాన్ని ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. సిరిసిల్ల పర్యటన సందర్భంగా పట్టణంలోని మానేరు వంతెన చెక్ పోస్టు వద్ద వాహనంలో

- మిగతా 4లో...

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# రూ.200 కోట్ల విలువైన పార్క్ పరిరక్షణకు... ఏడి సర్వే నిర్వహించాలి...!

## అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి, ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు..


మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి ఆకుల సతీష్ ఫిర్యాదు..

ఈనెల 20వ తేదీన పార్కుస్థలం కబ్జాను కూల్చేస్తున్న హైడ్రా అధికారులు..




-4లో

- ఓ మాజీ మంత్రి, కలెక్టర్, ఆర్డీఓ హుకుం..! 'తప్పుడు ఏడీ సర్వే' అంటూ ఆరోపణలు..!
- 2018 లోనే గ్రామపంచాయతీ, నిజాంపేట్ కార్పొరేషన్ కోట్లు ఖర్చుచేసి పార్క్ అభివృద్ధి.
- 2023 సెప్టెంబర్‌లో స్పీడు విద్యుత్ ప్రైవేట్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఫెన్సింగ్ వేసి కబ్జా..
- ఆకుల సతీష్ ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా, పార్క్‌ను కాపాడి ఫెన్సింగ్..
- హైకోర్టు ఆదేశాలున్నా విఎన్ఆర్ కాలేజ్ యాజమాన్యం ఏడీ సర్వేకు గైర్హాజరు..
- ఏడి సర్వే చేపట్టి, కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని సతీష్ విజ్ఞప్తి..

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్‌లో సర్వే నెంబర్లు 142, 143, 144లో ఉన్న రూ.200 కోట్ల విలువైన మూడు ఎకరాల విఎన్ఆర్ పార్క్ భూమిని కాపాడేందుకు తక్షణమే ఏడీ సర్వే నిర్వహించాలంటూ ఆకుల సతీష్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు.. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఓ మాజీ మంత్రి తోపాటు, అప్పటి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, ఆర్డీఓ మల్లయ్య, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ ఏడీ సర్వేయర్ శ్రీనివాస్ పేర్లతో తప్పుడు నివేదికలు రూపొందించి పార్క్‌ను ప్రైవేట్ భూమిగా చూపించారని ఆరోపిస్తూ సతీష్ ఫిర్యాదు చేశారు..దీంతో సంబంధిత స్థలంపై వెంటనే సర్వే నిర్వహించాలని, ఏడీ సర్వేయర్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 29:

# ఆ నిర్ణయం భేష్: పోలీసులపై జగ్గారెడ్డి ప్రశంస



- ప్రత్యేక నేరాల్లో బాధితుల ఇంటి వద్దకే వెళ్లి కేసు నమోదు చేయాలని నిర్ణయించడం హర్షణీయమన్న జగ్గారెడ్డి
- కొంతమంది మహిళలను ట్రాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆగ్రహం
- గతంలో రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయన్న జగ్గారెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితుల ఇంటి వద్దకే వెళ్లి కేసు నమోదు చేయాలని పోలీసులు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశంసించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, కొన్ని కేసుల్లో ఫిర్యాదు లేకుండానే బాధితుల ఇళ్లకు వెళ్లి కేసు నమోదు చేయాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. బాధితుల ఇంటి వద్ద ఎఫ్ఐఆర్ వంటి నిర్ణయాలు మంచిదే అన్నారు.కొంతమంది సైకోగాళ్లు మహిళలను ట్రాప్ చేసి ఆ తర్వాత బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతులను, మహిళలను వేధించే వారికి, బ్లాక్‌మెయిల్

-4లో

### బంగారం ధర పెరగడంతో స్నాచింగ్‌లు ఎక్కువయ్యాయా?..

# క్లారిటీ ఇచ్చిన సజ్జనార్




- హైదరాబాదులో చైన్ స్నాచింగ్‌లు పెరిగిపోయాయని ప్రచారం జరుగుతోందన్న సజ్జనార్
- ఆ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టీకరణ
- సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:**బంగారం ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో చైన్ స్నాచింగ్‌లు విపరీతంగా పెరిగిపోయాయని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పందించారు. బంగారం ధరలు పెరిగినందున రాష్ట్రంలో అంతర్రాష్ట్ర ముఠాలు హైదరాబాద్ నగరంలో మకాం వేశాయని, చైన్ స్నాచింగ్‌లు ఎక్కువయ్యాయని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.దయచేసి సోషల్ మీడియాలో వచ్చే ధృవీకరించని వార్తలను నమ్మవద్దని, భయపెట్టే పోస్టులను ఫార్వార్డ్ చేయవద్దని సూచించారు. భయాందోళనలు సృష్టించేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.హైదరాబాద్ నగరం పూర్తిగా సురక్షితమని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. "నిశ్చింతగా ఉండండి. మీ భద్రత మా బాధ్యత" అని పేర్కొన్నారు.

### కేసీఆర్ కు సిట్ నోటీసులు..

# కేసు విచారణ సీరియస్ గా జరగడం లేదు

## కేసీఆర్ ను విచారించనున్న సిట్ అధికారులు

## ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారన్న కవిత

## కసును త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం ఇరు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. మధ్యాహ్నం 3 గంటలకు విచారణ ఉంటుందని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. రేపు కేసీఆర్ విచారణ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. సిట్ నోటీసుల నేపథ్యంలో కేసీఆర్ కూతురు, జాగృతి అధ్యక్షురాలు కవిత స్పందిస్తూ... కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. సిట్ విచారణ నాన్-సీరియస్ గా జరుగుతోందని, ఎన్నికల నేపథ్యంలోనే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని అన్నారు. కేసును సీరియస్ గా తీసుకుని త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని... అయితే, కేసును ముగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా? లేదా? అనేది ఎవరికీ అర్థం కాని పరిస్థితి ఉందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ జరగడం నిజంగానే చాలా బాధాకరమని... కానీ, దానికి తగినటువంటి పర్యవసానాలను నేరస్తులు ఎదుర్కొంటారా? లేదా? అనేది వేచిచూడాలని అన్నారు.

# మేడారంలో ఆకాశాన్నంటుతున్న కోళ్లు, మేకలు, గొర్రెల ధరలు



- భక్తులతో కిటకిటలాడుతున్న మేడారం
- అమ్మవార్లకు భారీగా బలులు ఇస్తున్న భక్తులు
- దీన్ని ఆసరాగా చేసుకుని ధరలను పెంచేసిన వ్యాపారులు

**హైదరాబాద్ పెన్ పవర్:**మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం)తోపాటు కోళ్లు, మేకలు, గొర్రెలను బలి ఇవ్వడం మేడారం జాతరలో ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయతీ. దీంతో, మేడారంలో కోళ్లు, మేలు, గొర్రెల అమ్మకాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. లక్షల సంఖ్యలో కోళ్లు, వేల సంఖ్యలో మేకలు, గొర్రెల విక్రయాలు జరుగుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు వీటి ధరలను అమాంతం పెంచేశారు. సాధారణంగా కిలో రూ. 200 నుంచి రూ. 250 ఉండే కోడి ధర, జాతరలో రూ. 350 నుంచి రూ. 400 వరకు పలుకుతోంది.

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రూ.200 కోట్ల విలువైన పార్క్ పరిరక్షణకు...

# ఏడి సర్వే నిర్వహించాలి...!

## అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి, ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు..

ఈనెల 20వ తేదీన పార్కుస్థలం కబ్జాను కూల్చేస్తున్న హైడ్రా అధికారులు..






మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి ఆకుల సతీష్ ఫిర్యాదు..

**నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్‌లో సర్వే నెంబర్లు 142, 143, 144లో ఉన్న రూ.200 కోట్ల విలువైన మూడు ఎకరాల విఎన్ఆర్ పార్క్ భూమిని కాపాడేందుకు తక్షణమే ఏడీ సర్వే నిర్వహించాలంటూ ఆకుల సతీష్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు.. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఓ మాజీ మంత్రి తోపాటు, అప్పటి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, ఆర్డీఓ మల్లయ్య, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ ఏడీ సర్వేయర్ శ్రీనివాస్ పేర్లతో తప్పుడు నివేదికలు రూపొందించి పార్క్‌ను ప్రైవేట్ భూమిగా చూపించారని ఆరోపిస్తూ సతీష్ ఫిర్యాదు చేశారు..దీంతో సంబంధిత స్థలంపై వెంటనే సర్వే నిర్వహించాలని, ఏడీ సర్వేయర్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 29:**




విఎన్ఆర్ పార్కు లోపల దృశ్యాలు..

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్‌లోని రూ.200 కోట్లు విలువైన విఎన్ఆర్ పార్క్ భూమి కబ్జా వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.. సర్వే నెంబర్లు 142, 143, 144లో ఉన్న ఈ ప్రభుత్వ భూమిని, ప్రజా అవసరాల కోసం అభివృద్ధి చేసిన పార్క్‌గా ఆకుల సతీష్ స్పష్టం చేశారు. 2018 నుంచి గ్రామపంచాయతీ స్థాయిలో నిధులు కేటాయించి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన తరువాత కూడా రూ. కోట్లు ఖర్చుచేసి మొక్కలు నాటి, వాకింగ్ ట్రాక్‌లు, మౌలిక సదుపాయాలతో విఎన్ఆర్ పార్క్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అయితే టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓ మాజీ మంత్రితో పాటు, అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, ఆర్డీఓ మల్లయ్య, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ ఏడీ సర్వేయర్ శ్రీనివాస్ కలిసి, పార్క్ స్థలం ప్రభుత్వ యూఎల్‌సీ కాదని, ప్రైవేట్ భూమిగా తప్పుడు ఈడీ సర్వే రిపోర్టు ఇచ్చారన్న ఆరోపణలను ఆకుల సతీష్ ప్రస్తావించారు.. ఈ తప్పుడు నివేదిక ఆధారంగానే 2023 సెప్టెంబర్‌లో "స్పీడు విద్యుత్ ప్రైవేట్ కన్‌స్ట్రక్షన్ సంస్థ" విఎన్ఆర్ పార్క్ స్థలాన్ని కబ్జా చేసి ఫెన్సింగ్ వేసినట్లు సతీష్ ఆరోపించారు.. దీనిపై పూర్తి ఆధారాలతో పలుమార్లు కలెక్టర్‌కు, హైడ్రాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.. దీనికి తోడు స్థానికుల ఒత్తిడి నేపథ్యంలో 2026 జనవరి 20న హైడ్రా అధికారులు రంగంలోకి దిగి విఎన్ఆర్ పార్క్ కబ్జాను తొలగించి, మళ్లీ హైడ్రా ఫెన్సింగ్ వేయడం హర్షించదగిన పరిణామంగా ఆకుల సతీష్ పేర్కొన్నారు..

- ఓ మాజీ మంత్రి, కలెక్టర్, ఆర్డీఓ హుకుం..! 'తప్పుడు ఏడీ సర్వే' అంటూ ఆరోపణలు..!
- 2018 లోనే గ్రామపంచాయతీ, నిజాంపేట్ కార్పొరేషన్ కోట్లు ఖర్చుచేసి పార్క్ అభివృద్ధి.
- 2023 సెప్టెంబర్‌లో స్పీడు విద్యుత్ ప్రైవేట్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఫెన్సింగ్ వేసి కబ్జా..
- ఆకుల సతీష్ ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా, పార్క్‌ను కాపాడి ఫెన్సింగ్..
- హైకోర్టు ఆదేశాలున్నా విఎన్ఆర్ కాలేజ్ యాజమాన్యం ఏడీ సర్వేకు గైర్హాజరు..
- ఏడి సర్వే చేపట్టి, కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని సతీష్ విజ్ఞప్తి..




### ఏడీ సర్వేకు హైకోర్టు ఆదేశాలు.. సహకరించని విఎన్ఆర్ కాలేజ్..

హైడ్రా ఫెన్సింగ్ వేసినప్పటికీ, పార్కు కబ్జా సమస్య ఇక్కడితో ముగియలేదని ఆకుల సతీష్ ఆరోపించారు.. విఎన్ఆర్ కాలేజ్, స్కూల్ పరిధిలో సీలింగ్ భూమి మాత్రమే కాకుండా, సర్వే నెంబర్ 186లో ప్రభుత్వ భూమి కూడా ఉందని, తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల మేరకు గత 27వ తేదీన ఏడీ సర్వే ఆదేశించినా..! విఎన్ఆర్ కళాశాల యాజమాన్యం సహకరించలేదని, ఈ కారణంగా సర్వే నిలిచి పోయిందని ఆరోపించారు.. దీంతో గురువారం అడిషనల్ కలెక్టర్‌ను కలిసిని ఆకుల సతీష్, విఎన్ఆర్ కాలేజ్ పరిధిలో ప్రభుత్వ భూమి మరియు సీలింగ్ భూముల ఆక్రమణపై పూర్తిస్థాయి ఏడీ సర్వే నిర్వహించాలని, ఆ సర్వే ఆధారంగా విఎన్ఆర్ పార్క్ భూమిని శాశ్వతంగా కాపాడే అవకాశం ఉందని, అడిషనల్ కలెక్టర్ డి.విజయేదర్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.. అదేవిధంగా బాచుపల్లి ప్రాంతంలోని సర్వే నెంబర్లు 78, 80, 82, 83, 90, 95 లోని ప్రభుత్వ భూములను మైరాన్, క్యాండీర్ సంస్థలు నిర్మాణాల పేరుతో ఆక్రమించుకున్నారనే ఆరోపణలపై కూడా తక్షణమే సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని మరో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రభుత్వ భూముల రక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.




పార్కుస్థలం కాపాడిన హైడ్రాకు స్థానికుల కృతజ్ఞతలు..

కాపాడిన పార్కు స్థలానికి హైడ్రా ఫెన్సింగ్ దృశ్యం..




## మున్సిపల్ ఎన్నికలు: కేటీఆర్ వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

-3 పేజి తరువాయి

సోదా చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ఎన్నికల నిబంధనలకు పూర్తిగా కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.

ఇప్పటికే 18 మంది అభ్యర్థులను బీఆర్ఎస్ సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ తుల ఉమా ప్రకటించారు. మిగిలిన 21 వార్డుల అభ్యర్థులను కేటీఆర్ ప్రకటించనున్నట్లు సమాచారం.

## మేడారంలో ఆకాశాన్నంటుతున్న కోళ్లు, మేకలు, గొర్రెల ధరలు

-3 పేజి తరువాయి

ఇక మేకలు, గొర్రెల పరిస్థితిలో కూడా తేడా లేదు. సాధారణ రోజుల్లో రూ. 7 వేల నుంచి రూ. 8 వేల వరకు పలికే మేక పోతులను ప్రస్తుతం రూ. 12 వేల నుంచి రూ. 15 వేల వరకు విక్రయిస్తున్నారు. ధరలు ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ, మొక్కుబడి తీర్చుకోవాలనే ఉద్దేశంతో భక్తులు భరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వీటిని కొనుగోలు చేస్తున్నారు.

జాతర ముగిసే వరకు ఈ ధరలు ఇలాగే ఉండే అవకాశం ఉంది.

## ఆ నిర్ణయం భేష్

-3 పేజి తరువాయి


చేసే వారికి సజ్జనార్ వంటి అధికారులే సరైనవారు అన్నారు. ఇలాంటి అంశాల్లో సమాజంలో ఎన్‌కౌంటర్ వంటి భయాలు కూడా ఉండాలని వ్యాఖ్యానించారు. అమ్మాయిలను వేధించినందుకు గతంలో కాంగ్రెస్ హయాంలో ఒకటి, బీఆర్ఎస్ హయాంలో మరో ఎన్‌కౌంటర్ జరిగిందని గుర్తు చేశారు. రాజ్యాంగ పరంగా ఎన్‌కౌంటర్లను సమర్థించలేమని, కానీ ఆడబిడ్డల తండ్రిగా, కుటుంబాలు కలిగిన వారిగా సమర్థిస్తామని అన్నారు. బాధిత మహిళలకు భరోసా ఇచ్చేలా పోలీసుల చర్యలు ఉండాలని వ్యాఖ్యానించారు.కొంతమంది ఆడపిల్లల ఫొటోలు తీసుకుని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాంటి వారు ఇచ్చే ఫిర్యాదులను బహిర్గతం చేయకపోవడమే మంచిదని జగ్గారెడ్డి అన్నారు. సున్నితమైన అంశాల్లో మీడియా, సోషల్ మీడియా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. అధికారుల వ్యక్తిగత సంబంధాల వార్తలు ప్రచురించడం సరికాదని అన్నారు. ఒకరి వ్యక్తిగత అంశాల్లో జోక్యం చేసుకోవద్దని హితవు పలికారు.

# రేవంత్ శాఖ నే టార్గెట్ చేసిన కోమటిరెడ్డి

**నల్గొండ, జనవరి 29, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలలో సంచలనాలు అంతకంతకు చోటు చేసుకుంటున్నా యి. ఎప్పుడు ఎటువంటి పరిణామం జరుగుతుందో అర్థం కావడం లేదు. మంత్రుల నుంచి మొదలు పెడితే ప్రతిపక్ష నాయకుల వరకు ప్రతిఒక్కరు ఏదో ఒక విధమైన కామెంట్లు చేస్తున్నారు. అవి కాస్త సోషల్ మీడియా నుంచి ప్రధాన మీడియా వరకు విపరీతంగా చర్చల్లో ఉంటున్నాయి.ఇటీవల కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై ఓ న్యూస్ ఛానల్ కథనాన్ని ప్రసారంచేసింది. ఈ కథనం తెలంగాణ రాజకీయాలనే కాదు ఏకంగా ఏపీ రాజకీయాలను కూడా ప్రభావితం చేసింది. ఈ వ్యవహారంలోకి కొంతమంది మీడియా ప్రతినిధులు ప్రవేశించడంతో మరింత వివాదంగా మారింది. దీనిపై ఏకంగా ముఖ్యమంత్రి స్పందించడం.. ఉప ముఖ్యమంత్రి కలగజేసుకోవడం.. ఆ తర్వాత బొగ్గు టెండర్లను రద్దు చేయడం వంటి పరిణామాలు జరిగాయిఈ పరిణామాల కంటే ముందు కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు.విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కీలక వ్యాఖ్యలు చేశారు. తన మీద కక్ష తీరకపోతే.. ఇంత విషం పెట్టి చంపాలని ఆవేదనతో మాట్లాడారు. ఆయన మాట్లాడిన మాటలు ఒకరకంగా తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టించాయి. ఇప్పుడు వాటిని మర్చిపోకముందే కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు.కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్లో కీలకమైన మంత్రిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన తెలంగాణ విద్యా వ్యవస్థకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. " నేనే విద్యాశాఖ మంత్రిని అయితే కార్పొరేట్ పాఠశాలలను మూసి వేస్తాను. నారాయణ కాలేజీలో డిగ్రీ చేసిన వారు ఉంటే ప్రభుత్వ కాలేజీలలో పీహెచ్డీ చేసిన వారు ఉంటారు. ఏ ఉద్యోగం రాకుండా లక్షల ఉద్యోగం చేస్తున్నారు. బట్టి పట్టిస్తే వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలోనేచదువుకోవాలి. విద్య అనేది వ్యాపారం కాదు. విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదని" కోమటిరెడ్డి అన్నారు. మంగళవారం నల్గొండలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ రాష్ట్రంలోవిద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్న శాఖను ఉద్దేశించి కోమటిరెడ్డి ఆ వ్యాఖ్యలు చేయడంతో సహజంగానే రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది. కోమటిరెడ్డి మాట్లాడినమాటలను గులాబీ మీడియా విపరీతమైన నెగిటివ్ ప్రచారం చేస్తోంది..



అయితే తాను చేసిన వ్యాఖ్యలను వేరే కోణంలో చూడవద్దని ఇప్పటికే కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పడం గమనార్హం.




## మేడారం వెళ్లే భక్తులు ములుగు గట్టమ్మకు మొక్కులు చెల్లిస్తున్నారు

**పరకాల, జనవరి 29 పెన్ పవర్:** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు, సాంప్రదాయం ప్రకారం ముందుగా ములుగు గట్టమ్మకు పసుపు, కుంకుమ, చీర, కొబ్బరికాయ సమర్పించి, తమ ప్రయాణం, దర్శనం చల్లగా జరగాలని మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం సమ్మక్క తల్లి వచ్చే రోజు సందర్భంగా భక్తులు గట్టమ్మ వద్ద మొక్కులు చెల్లించుకుంటున్నారు. మేడారం పుణ్యక్షేత్రం భక్తజన సముద్రంతో నిండిపోయింది.



## విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా అమ్మోజు సురేష్ నియాకం

**నర్సంపేట, జనవరి 29 పెన్ పవర్:** హనుమకొండ జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం అధ్యక్షులు శృంగారపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో, అమ్మోజు సురేష్ ను జిల్లా యూత్ అధ్యక్షులుగా నియమించారు. గత కొన్నేళ్లుగా సంఘంలో చురుగ్గా సేవలందిస్తున్న సురేష్ సేవలను గుర్తించి ఈ నియాకం జరిగినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సంఘటన ఉమ్మడి వరంగల్ జిల్లా, పరకాలలో చోటుచేసుకుంది. ఈ నియాకం ద్వారా యువత సంఘటితమై మరింత చురుగ్గా పనిచేస్తుందని ఆశిస్తున్నారు.

## ఫుడ్ పాయిజన్ విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే, కఠిన చర్యలకు ఆదేశం

**నారాయణఖేడ్, జనవరి 29 పెన్ పవర్: :** సంగారెడ్డి జిల్లా, నారాయణ్ ఖేడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి నారాయణ ఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఫుడ్ పాయిజన్ తో బాధపడుతున్న విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఫుడ్ పాయిజన్ కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధిత విద్యార్థుల కుటుంబ సభ్యులతో కూడా ఎమ్మెల్యే మాట్లాడారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అస్వస్థత

**సంగారెడ్డి, జనవరి 29 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 23 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్ పాయిజన్ లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థులను చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన పాఠశాల యాజమాన్యంపై ఆందోళన వ్యక్తం చేస్తోంది.



## సంగారెడ్డి మున్సిపల్ నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు

**జహీరాబాద్, జనవరి 29 పెన్ పవర్:** సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల ఏర్పాట్లను గురువారం పరిశీలించిన డీఎస్పీ సత్తయ్య గౌడ్, మున్సిపల్ నామినేషన్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీ నామినేషన్లు ముగిసే వరకు సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ కార్యాలయాల వద్ద పటిష్టమైన బందోబస్తు కొనసాగుతుందని ఆయన చెప్పారు.

## ఉజ్వల పథకం కింద గ్యాస్ పంపిణీ

**ఆందోల్, జనవరి 29 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మొగ్లప్ప, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా పేదలకు వంటగ్యాస్ అందుబాటులోకి వస్తుందని, వారి జీవితాల్లో వెలుగు నింపుతుందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకోవాలి

**పటాన్‌చెరు, జనవరి 29 పెన్ పవర్:** సదాశివపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సదాశివపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ కూడా పాల్గొన్నారు.

# మొక్కు తీర్చుకునేందుకు ఎడ్లబండ్లే...

**వరంగల్, జనవరి 29, పెన్ పవర్:** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభంగా జరుగుతోంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకూ మాత్రమేకాదు, తెలుగు రాష్ట్రాలు, దూరప్రాంతాల నుంచి రోజూ లక్షలాదిగా భక్తులు మేడారం జతరకు తరలివెళుతున్నారు.మేడారం సమ్మక్కా ,సారలమ్మ జాతర దర్శించుకోవడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చేవారు. ఆ తరువాత కాలంలో ఎడ్ల బండ్లపై రావడం ఆనవాయితీగా మారింది. వ్యవసాయ ఆధారిత గ్రామాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి ఎడ్లబండ్లపై అమ్మవారి జాతరకు ఓ నాలుగు రోజుల ముందే కుటుంబ సమేతంగా బయలుదేరేవారు. ముఖ్యంగా తెలంగాణలో ప్రతీ గ్రామం నుంచి బండెనక బండి కట్టి, పదహారు బళ్లు కట్టి అన్నట్లుగా ఒక్కో ఊరు నుంచి వందల బళ్లు మేడారం జాతరకు కదిలేవి. ఈ ఏడాది కూడా ఎడ్ల బండి సెంటిమెంట్ విషయంలో ఎక్కడా తగ్గేదే లేదంటున్నారు మేడారం భక్తులు. ఏఐ యుగంలోకి ప్రవేశించినా ఎడ్ల బండ్లంటేనే అమ్మవారికి మహా ఇష్టమంటున్నారు. ఈ ఏడాది మేడారం జాతరకు తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా అద్భుతంగా ఏర్పాట్లు చేసింది. మేడారం ప్రాంగణాన్ని వందల కోట్లతో కన్నుల పండుగగా అభివృద్ధి చేయడమేకాదు, దూర ప్రాంతాల నుండి మేడారం వెళ్లే భక్తుల కోసం వేలాదిగా ఆర్టీసి బస్సు సర్వీసులు నడపడమేకాదు, ఏకంగా తొలిసారి రెండు హెలికాప్టర్ల ను ఏర్పాటు చేసి గంటన్నరలో మేడారం దర్శనం చేసి తీసుకొచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది. హనుమకొండలో మీరు అలా హెలికాప్టర్ ఎక్కితే కేవలం 35 నిమిషాల్లో మేడారం , 30నిమిషాల్లోపు మేడారం దర్శనం, మరో 35 నిమిషాల్లో తిరిగి హనుమకొండకు చేర్చేలా హెలికాప్ట్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో వ్యక్తికి 36వేలు టికెట్ ఖర్చుతో మొత్తం మేడారం దర్శనం అనుభూతి కల్పిస్తున్నారు.కేవలం గంటన్నరలోనే దర్శనం పూర్తి చేసుకునే అవకాశంతోపాటు అందుబాటులో ఆర్టీసి బస్సులు, ప్రవేటు వాహనాలు ఇలా అనేక మార్గాల ద్వారా మేడారం చేరుకునే సదుపాయాలు ఉన్నా, నేటికీ తెలంగాణలోని అనేక గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై భక్తులు భారీగా తరలిరావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మాకు మగ బిడ్డ పుడితే ఎడ్ల బండిపై మేడారం వస్తామని మొక్కుకున్నాం. అమ్మ అనుగ్రహించింది ,మగ బిడ్డ పుట్టాడు. అందుకే ప్రతీ ఏడాది ఎడ్ల బండిపైనే మేడారంగద్దెలను దర్శించుకుంటున్నామని జాతరకు వస్తున్న కొందరు భక్తులు చెబుతున్నారు. ఇలా కొందరు సంతానం కోసం, మరికొందరు అనుకున్నది సాధించడం కోసం.. ఇలా మొక్కులు తీరడంతో ఎడ్ల బండ్లపైనే ప్రతీ జాతరకు సుదూర ప్రాంతాల నుండి సైతం తరలివస్తున్నారు.ఒక్కో ఎడ్ల బండిపై ఒక్కో కుటుంబం , వారితోపాటు అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి మేకపోతు,నాటు కోడి, నాలుగు రోజులకు అవసరమైన మద్యం,
ఎడ్లకు ఓ ఐదు రోజులకు సరిపడా ఎండుగడ్డి, ఎడ్ల బండ్లు మధ్యలో ఆపి సేదతీరేందుకు , పొలామధ్యలో దారాలు వేసి రాత్రి సమయంలో నిద్రించేందుకు పరదాలు, వంటకు అవసరమైన రైస్, కూరగాయలు, ఉప్పు, పప్పు, కట్టెలు, ఇలా అన్నీ ఎడ్ల బండిపైన సర్దుకుని మేడారం జాతరకు కుటుంబ సమేతంగా బయలుదేరడం తరతరాలుగా లక్షలాది మంది భక్తులకు ఓ సెంటిమెంట్ గా వస్తోంది. తెల్లవారుజామున లేచి, ఆరోజుకు సరిపడా మూడుపూటల భోజనం సిద్ధం చేసుకుని ఇంటి వద్ద మొదలైన మేడారం ప్రయాణం, ప్రతీ పది లేదా పదిహేను కిలోమీటర్లకోసారి ఎడ్లను ఆపి, కాసేపు అందమైన పంటచేల మధ్యలో , ఆహ్లాదరకమైన అడవి మార్గంలో సేద తీరుతీరుతుంటారు. వాగులకు సమీపంలో భోజనం చేయడం, రాత్రి సమయంలో అక్కడే దేరాలు వేసుకుని నిద్రించడం, తిరిగి తెల్లవారుజామున మళ్లీ ప్రయాణం మొదలుపెట్టడం.. ఇలా మేడారం చేరుచుకునే మార్గమధ్యలో ఎడ్లబండి ప్రయాణం అంటే మాట్లల్లో చెప్పలేని సరికొత్త అనుభూతి అనడంలో ఏ మాత్రం సందేహంలేదు.అన్నదమ్ములు, ఆడపడుచులు, అక్క చెల్లెళ్లు , అత్త కోడళ్లు.. ఇలా అంతా తమ ఎడ్లబండ్లపై మేడారం సమీపంలో ఒకేచోటకు చేరుకుంటారు. అక్కడే ఎడ్లబండ్లకు దేరాలు కట్టి గుడారాలుగా మార్చుకుంటారు. అలా నాలుగు రోజులపాటు మేడారం పరిసర ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు ఒక్కటై మేడారం గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటారు. మందు ,ముక్క లేకుండా జాతర పూర్తవ్వదనే విషయం తెలిసిందే.. అలా సరదాగా గడపడం కోసం రెండేళ్ల కోసారి తెలంగాణలో రైతుల కుటుంబాలేకాదు, రైతులను నమ్ముకున్న ఎద్దులు సైతం ఎదురుస్తుంటాయట, ఓ ఏడాది జాతరకు వెళ్లిన ఎద్దులు, అదే మార్గం గుర్తుపెట్టుకుని రైతు చెప్పకుండానే మేడారం జాతర వద్దకు తీసుకెళ్లడం మరో విశేషంగా చెప్పవచ్చు.

# యూటర్న్ లో దానం...?

**హైదరాబాద్, జనవరి 29, పెన్ పవర్:** తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలలో ఏడుగురికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విషయం తేల్చాల్సి ఉంది. ఫిరాయింపులపై ఇదే లాస్ట్ ఛాన్స్ అని సుప్రీం కోర్టు ఇప్పటికే డెడ్‌లైన్ విధించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఈ ముగ్గురి లెక్క తేల్చే పనిలో పడ్డారు స్పీకర్.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ ఈసారి కఠినమైన నోటీసుల జారీ చేశారు. ఏది ఏమైనా ఈనెల 30లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. పార్టీ ఫిరాయింపులపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. లేదంటే పార్టీ ఫిరాయించినట్లుగానే పరిగణించాల్సి ఉంటుందని పరోక్షంగా చెప్పారు. తాజా నోటీసులు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.స్పీకర్ తీర్మానం ప్రకారం, దానం నాగేందర్‌ను ఈ నెల 30 తేదీన విచారణకు కట్టుబడి హాజరు కావాలి. లేదంటే ఇది సభా నియమాల ఉల్లంఘనలకు సంబంధించిన చర్యగా కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే దానం నాగేందర్‌కు నోటీసులు పంపినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పైచేయి సాధించింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ సాధిస్తామన్న ధీమాతో ఉంది. ఆ నమ్మకంతోనే దానంతో రాజీనామా చేయించే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తరహాలో దానంతో కాంగ్రెస్ టికెట్‌పై మళ్లీ పోటీ చేయించాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచాం.ఇక దానం విచారణకు వస్తే అడ్డంగా దొరికిపోతారు. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం.. లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేకుండానే కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఒక పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ మరో పార్టీ టికెట్‌పై పోటీ చేదయడం పార్టీ ఫిరాయింపు కిందకే వస్తుంది. దీంతో విచారణలో తాను బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పి తప్పించుకునే అవకాశం లేదు.సుప్రీం కోర్టు డెడ్‌లైన్ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్,



తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని ఆయన వాదిస్తున్నారు. పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు కూడా ఎలాంటి సమాచారం లేదని చెప్పడం ద్వారా, బంతిని మళ్ళీ బీఆర్ఎస్, స్పీకర్ కోర్టులోకి నెట్టారు. అయితే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న దృశ్యాలు, కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుండి లోక్‌సభకు పోటీ చేసిన రికార్డులు కళ్లముందే ఉన్నాయని బీఆర్ఎస్ నేతలంటున్నారు.

కాంగ్రెస్ అధిష్టానం అన్నింటికి సిద్దపడ్డట్లు తెలుస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీని వీడలేదని వాదించడం ద్వారా అనర్హత వేటు పడకుండా చట్టపరమైన లొసుగులను వెతుక్కున్నట్లుగా కనిపిస్తోంది. దానం నాగేందర్ తన వివరణలో వినిపించిన అత్యంత కీలకమైన వాదన ఆయన వ్యక్తిగత హోదా . 2024 మార్చిలో తాను కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరైన మాట వాస్తవమేనని అంగీకరిస్తూనే, అది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, దానిని పార్టీ మార్పిడిగా పరిగణించలేమని ఆయన సమర్థించుకున్నారు. మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావించడం సరికాదని, చట్టపరంగా రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడం అనే నిబంధన దానంకు స్పష్టంగా వర్తిస్తుందని, ఎంపీగా కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడమే దానికి అతిపెద్ద నిదర్శనమని బీఆర్ఎస్ వాదిస్తోంది. ఈ పరిస్థితుల్లో దానం చేసిన వ్యక్తిగత హోదా వాదన కేవలం కాలయాపన చేసేందుకు ఆడుతున్న నాటకమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మొదట దానంపై అనర్హత వేటు వేయకుండానే రాజీనామా చేయించే ఆలోచనలో ఉంది. స్పీకర్ నోటీసుల నేపథ్యంలో దానం రేపో మాపో రాజీనామా చేసే అవకాశం ఉంది. దీంతో మరో ఆరు నెలల్లో ఖైరతాబాద్‌కు ఉప ఎన్నికలు రానున్నాయి. ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్టానం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# బంజారాహిల్స్ ఉదయ్నగర్ ప్రభుత్వ పాఠశాల దయనీయ పరిస్థితులు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఉదయ్నగర్ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల లేమితో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చదువుకునేందుకు సరైన క్లాస్రూములు లేకపోవడంతో విద్యార్థులు బహిరంగ ప్రదేశాల్లోనే చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలలో కూర్చోవడానికి బెంచీలు లేవు, తాగునీటి సదుపాయం లేదు, అలాగే మరుగుదొడ్లు కూడా అధ్వాన స్థితిలో ఉన్నాయి. దీంతో చిన్నారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 8 ఏళ్లుగా ఈ పాఠశాల కమ్యూనిటీ హాల్లోనే కొనసాగుతోంది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు అన్ని తరగతులు ఒకే హాల్లో నడుస్తుండటంతో తీవ్ర గందరగోళం నెలకొంది. పాఠాలు సరిగా అర్థం కాక విద్యార్థులు, చదువు చెప్పలేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొంతమంది విద్యార్థులు బయటే చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండకు, వానకు, చలికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బంజారాహిల్స్ వంటి ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి దారుణ పరిస్థితులు ఉండటంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సీరియస్ అయ్యారు. ఈ విషయంపై అధికారులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడిన దానం నాగేందర్, త్వరలో స్కూల్ భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే, తన స్వంత నిధులతోనే స్కూల్ భవనం కట్టిస్తానని దానం నాగేందర్ స్పష్టం చేశారు.

# 'సింహం' గుర్తుపై జాగృతి అభ్యర్థుల పోటీ

**హైదరాబాద్, జనవరి 29 పెన్ పవర్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ జాగృతి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కలిసి పోటీ చేయనున్నాయి. జాగృతి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ 'సింహం' గుర్తుపై పోటీ చేయనున్నారు. ఇక తొలిరోజు 902 నామినేషన్లు దాఖలు కాగా.. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయాలు హీటెక్కాయి. ప్రధాన పార్టీలతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతుదారులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి పోటీ చేసేందుకు రెడీ అయ్యారు.ఈ మేరకు జాగృతి అధ్యక్షురాలు కవిత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకత్వం మధ్య జరిగిన కీలక చర్చలు ఫలించాయి. రానున్న పురపాలక ఎన్నికల్లో తెలంగాణ జాగృతికి చెందిన ఔత్సాహిక అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన 'సింహం' గుర్తుపై పోటీ చేయాలని నిర్ణయించారు. కేవలం ఈ ఎన్నికలకే పరిమితం కాకుండా.. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడాలని ఇరు పక్షాలు అంగీకారానికి వచ్చాయి. హైదరాబాద్‌లోని ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం, కొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలికింది.ఇక బుధవారం నామినేషన్ల స్వీకరణ మొదటి రోజే అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తం 2,996 వార్డులకు గాను తొలిరోజే 902 నామినేషన్లు దాఖలయ్యాయి. 890 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా.. కొందరు అభ్యర్థులు రెండేసి సెట్ల నామపత్రాలను సమర్పించారు. క్షేత్రస్థాయిలో తమ పట్టు నిరూపించుకునేందుకు అభ్యర్థులు ఉత్సాహం చూపుతున్నారు. మొదటి రోజు నామినేషన్ల పర్వంలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 382 నామినేషన్లతో అగ్రస్థానంలో నిలిచింది.

బీఆర్ఎస్ 258 నామినేషన్లతో రెండవ స్థానంలో ఉండగా, బీజేపీ నుంచి 169 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.నామినేషన్ల స్వీకరణకు శుక్రవారమే ఆఖరి గడువు కావడంతో.. నేడు, రేపు అభ్యర్థుల తాకిడి భారీగా పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అదనపు సిబ్బందితో ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. కాగా.. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది.ఈ పరిణామం ముఖ్యమైంది ఎందుకంటే తెలంగాణ జాగృతి సాధారణంగా సాంస్కృతిక, సామాజిక సంస్థగా పిలుస్తున్నా, ఇప్పుడు నేరుగా ఎన్నికల బరిలోకి దిగడం ద్వారా తన రాజకీయ బలాన్ని ప్రదర్శించాలనిచూస్తోంది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన "సింహం" చిహ్నం ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు పరిచయమైందని, జాగృతి కార్మికుల చేరిక దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందని కవిత భావిస్తున్నారు. ఈఒప్పందం తెలంగాణ స్థానిక రాజకీయాల్లో కొత్త ఎత్తుగడకు కారణమవుతుందని అంటున్నారు. ఈ మధ్య కవిత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీ ఏర్పాటు, విధి విధాలు, ప్రచారవ్యూహాలపై లోతుగా చర్చించారు. ఆ పనులు ఒకవైపు సాగుతుండగానే మరోవైపు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి అసలైన బలాన్ని అంచనా వేసుకోవాలని కవిత భావిస్తున్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

# గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఈడీ ఛార్జిషీట్..

**హైదరాబాద్, జనవరి 29, పెన్ పవర్:** గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఈడీ దూకుడు పెంచింది. రూ. 11.30 కోట్ల విలువైన 35 ఆస్తులు.. నయీం అక్రమంగా సంపాదించినట్లు ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ ఆస్తులను అతడి కుటుంబ సభ్యులు,సన్నిహితులు ఇతర బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా నయీం అక్రమాస్తుల విషయంలో పోలీసు, రాజకీయ సంబంధాలపై కూడా ఈడీ ఆరా తీస్తోంది. 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లోనయీం హతం అయ్యాడు. గ్యాంగ్‌స్టర్ నయీం 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. అతడికి సంబంధించిన అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేగం పెంచింది.నయీంపై జరిగిన మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు జరిపింది. తాజాగా నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిశీలించిన కోర్టు విచారణకు అంగీకరించింది. కాగా,గ్యాంగ్‌స్టర్ నయీం.. తన గ్యాంగ్ సభ్యులతో కలిసి దాదాపు రూ. 11. 30 కోట్ల విలువైన 35 ఆస్తులను అక్రమంగా సంపాదించినట్లు ఈడీ ఛార్జిషీటులో పేర్కొంది.కాగా, నయీంకు సంబంధించిన అక్రమాస్తులపై ఈడీ 10 మందిపై అభియోగాలు మోపింది. ఛార్జిషీట్ ప్రకారం.. నయీం యాదాద్రి భువనగిరి జిల్లాలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. ఈఆస్తులన్నీ నయీం తన కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇతర బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లుగా ఈడీ అధికారులు గుర్తించారు. కాగా, నయీం అక్రమాస్తుల కేసులో అతడి భార్య హసీనా బేగంతో పాటు పలువురుకుటుంబ సభ్యుల పేర్లను ఈడీ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. అయితే ఈడీ ఆరోపిస్తున్న అక్రమాస్తులకు సంబంధిచి కొన్నిసార్లు నోటీసులు జారీ చేసినా..




స్పందించకపోవడం, ఐటీఆర్ పత్రాలు చూపించకపోవడంతో కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది.మరోవైపు, నయీంకు ఉన్న పోలీసులు, పొలిటికల్ సంబంధాలపై కూడా ఈడీ కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. అక్రమంగా సంపాదించిన సొమ్ము ఎక్కడికి వెళ్లింది..ఇందులో అధికారులు, రాజకీయ నాయకుల హస్తం ఏమైనా ఉందా అనే కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ కేసులో త్వరలో నిందితులకు కోర్టు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.తెలుగురాష్ట్రాల్లో అండర్ వరల్డ్ డాన్‌గా పేరున్న నయీం 2016 ఆగస్టు 8న ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. భూ సెటిల్‌మెంట్లు, చేస్తూ తనకంటూ ఓ గ్యాంగ్ ను మెయింటెన్ చేస్తూ ప్రభుత్వాలను ముచ్చెమటలు పట్టించాడు.దీంతో ఇతడి అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో నందిగామ గ్రామంలోని మిలీనియం టౌన్ షిప్ లోని ఓ వ్యక్తి ఇంట్లో ఉంటూ స్థానిక భూదందాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.అనంతరం వారున్న స్థలానికి వెళ్లగా.. పోలీసులకు నయీం అనుచరులు కాల్పులు జరిపారు. ఆ తర్వాత పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో నయీం మృతి చెందాడు.ఐపీఎస్ వ్యాస్, మావోయిస్టు సాంబశివుడి వంటివారి హత్య కేసులో నయీం ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. కాగా, నయీం మృతితో బాధితులంతా బయటకు వచ్చి ఫిర్యాదులు చేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేసు విచారణకు సిట్ ఏర్పాటు చేసింది. నయీంపైదాదాపు 250 కేసులు నమోదు చేయగా మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ రంగంలో దిగి దర్యాప్తు చేపట్టింది.

# మేడారంలో భగ్గుంటున్న ధరలు

**వరంగల్, జనవరి 29, పెన్ పవర్:** మేడారం జాతర ప్రారంభమైంది. వనదేవతల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, జాతర నేపథ్యంలో కొబ్బరికాయల నుంచి కోళ్లు, మేకల ధరలు, ఇళ్ల అద్దెల వరకు అన్నీ ఆకాశాన్నంటుతున్నాయి.స్థానికులు ఇళ్లలో కనీస వసతులు లేకున్నా అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేయడం గమనార్హం. ఈ మూడు రోజులు ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. పెరిగిన ధరలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ప్రారంభమైంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న వనదేవతల జాతరకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పక్క రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణ జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ 4 వేల బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.దిలా ఉంటే జాతర నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొబ్బరికాయ మొదలు అమ్మలకు సమర్పించే బంగారం (బెల్లం), కోళ్లు, మేకల ధరలతో పాటు, ఇళ్లు, ప్రత్యేక గదుల అద్దెలను భారీగా పెంచి భక్తులను దోచుకుంటున్నారు. ఆఖరికి చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేస్తున్నారంటే జాతరలో దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు.మేడారం జాతరలో భాగంగా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి బంగారం (బెల్లం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పిస్తారు. ఇదే అదునుగా మేడారం జాతర వద్ద కోళ్లు, మేకల ధరలను భారీగా పెంచారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వెంటతీసుకురాలేక, జాతరకు వచ్చాక అక్కడే కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు ధరలను రెట్టింపు చేశారు.మేకపోతు లైవ్ కిలో రూ. 420 ఉండగా, మేడారంలో మాత్రం రూ. 900 నుంచి రూ. 1000 వరకుఅమ్ముతున్నారు.



మటన్ ధర రూ. 1500 వరకు పలుకుతోంది. బయట రూ. 170-180 కి దొరికే కిలో కోడిని జాతర దగ్గర రూ. 300-350 వరకు అమ్ముతున్నారు. మొన్నటి వరకు కూడా కిలో రూ. 350-400 ఉన్ననాటుకోడిని ఇప్పుడు రూ. 700లకు అమ్ముతున్నారు. జాతర చివరి మూడు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఇళ్ల అద్దెలు కూడా భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. కనీస వసతి సౌకర్యాలు లేకపోయినా సరే అద్దెలు ఆకాశాన్నంటాయి. ఆఖరికి చెట్ల నీడలో సేదతీరడానికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఉండటానికి ఇళ్లు వెతుకుతుండటంతో స్థానికులు భారీమొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒక్క ఫ్యాన్ తప్ప మరే ఇతర సౌకర్యాలు లేని గదులకు కూడా రోజుకు రూ. 6 వేల వరకు వసూలు చేస్తున్నారు.గదులు దొరకని వారు చెట్ల నీడలో సేదతీరడానికిప్రయత్నిస్తుండగా, తోట యజమానులు వాటికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. జాతరకు దగ్గరలో తోటలున్న స్థానికులు భక్తులకు చెట్లను అద్దెకు ఇస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడానికి ఒక్కో చెట్టుకు రూ. 1000 చొప్పున వసూలు చేస్తున్నారు.

# సదాశివపేట మున్సిపాలిటీ లో పోటీ

**సంగారెడ్డి: పెన్ పవర్:** సదాశివపేట మున్సిపాలిటీకి సంబంధించి కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల జాబితాను ఖరారు చేసింది. మొత్తం 26 వార్డులకు గాను, 25 వ వార్డులకు పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను అధికారికంగా వెల్లడించారు. పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు , టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి ,సదాశివ పేట పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు.

వార్డుల వారీగా అభ్యర్థులు :

వార్డు 1: పిల్లోడి విశ్వనాథం, వార్డు 2: ఎరుకల నర్సింహులు, వార్డు 3: రేణుక, వార్డు 4: ఎండీ. మోయిజ్, వార్డు 5: ఖుతేజా ఫాతిమా, వార్డు 7: పాతదొడ్డి అనిత, వార్డు 8: సిహెచ్. రేణుక, వార్డు 9: బి. అరుణ్ కుమార్,

వార్డు 10: కండి నర్సింహులు గౌడ్, వార్డు 11: గోపి ప్రియాంక, వార్డు 12: పులిమామిడి మమత, వార్డు 13: పిల్లోడి భవాని, వార్డు 14: రాయపాడు స్వరూప, వార్డు 15: గౌసియా బేగం, వార్డు 16: కొత్తగొల్ల చంద్రశేఖర్, వార్డు 17: ఎండీ. షాజీ, వార్డు 18: ఆకుల నిఖిత, వార్డు 19: పట్లూరి రోజా, వార్డు 20: మునిపల్లి అంజమ్మ, వార్డు 21: ఎండీ. వాజీద్, వార్డు 22: పతనం విజయ లక్ష్మి, వార్డు 23: వానగంటి లక్ష్మి ప్రియ (ముగిటి లక్ష్మి ప్రియ), వార్డు 24: ఎండీ. కలీమ్, వార్డు 25: కే. శంకర్ గౌడ్, వార్డు 26: కావులే హారిక.6వ వార్డు అభ్యర్థి ఎవరనేది పెండింగ్లో ఉంది. అభ్యర్థులందరూ తమ తమ వార్డులలో ప్రచారాన్ని వేగవంతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. స్థానిక సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధిని ప్రధాన అజెండాగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల బరిలోకి దిగుతోందని నిర్మల అన్నారు.

## పల్లె దవాఖాన ఆవరణలో పిచ్చి మొక్కల తొలగింపు

**సిర్పూర్, జనవరి 29 పెన్ పవర్:** ఆసిఫాబాద్ నియోజకవర్గం, కెరమెరి మండలంలోని సాంగ్వి గ్రామపంచాయతీ సర్పంచ్ విమలబాయి, గ్రామపంచాయతీ వర్కర్స్ మండోర్ సాగర్, కార్పెత దేవు, బామనే మెంగజీల సహాయంతో గ్రామంలోని పల్లె దవాఖాన చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను, పెద్ద చెట్ల పొదలను తొలగించారు. ఈ చర్యతో దవాఖాన పరిసరాలు శుభ్రపడ్డాయి.

## జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్ నామినేషన్ సెంటర్ పరిశీలన

**జగిత్యాల, జనవరి 29 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జగిత్యాల మున్సిపాలిటీలోని నామినేషన్ సెంటర్ ను సందర్శించి, అక్కడి పరిస్థితులను, సౌకర్యాలను, నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా చూడటమే ఈ తనిఖీ ముఖ్య ఉద్దేశ్యం.




## ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తులాభారం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు

**జగిత్యాల, జనవరి 29 పెన్ పవర్:** జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రాయికల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2023లో జగిత్యాల ఎమ్మెల్యేగా గెలుపొందాలని మహేంద్ర బాబు మొక్కుకోగా, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ నిలువెత్తు బెల్లంతో తులాభారం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

**ధర్మపురి, జనవరి 29 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని మోహన్రావుపేట గ్రామంలో మెట్ పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. నిబంధనల ప్రకారం సరుకుల పంపిణీ, ప్రతి విద్యార్థి ఎదుగుదల నమోదు చేయాలని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని, కిశోర బాలికలకు అవసరమైన సూచనలు చేస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి నరేష్, సీడీపీఓ కె. మణెమ్మ, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సంపత్ రెడ్డి

**పెద్దపల్లి, జనవరి 29 పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తేలుకుంట గ్రామ ఉపసర్పంచ్ దావు సంపత్ రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల మహేశ్ తెలిపారు. ఈ నియామకం ఐదేళ్లపాటు కొనసాగుతుందని, సంఘ బలోపేతానికి, ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన మహేశ్ కు సంపత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

**కొత్తగూడెం, జనవరి 29 పెన్ పవర్:** సత్తుపల్లి: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్తుపల్లి పట్టణం రింగ్ సెంటర్లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన పొదిలి నారాయణ (60) టు వీలర్ పై ఇంటింటికి గ్రామ గ్రామాన తిరుగుతూ ఫ్యాన్సీ వస్తువులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండగా గురువారం సత్తుపల్లి పట్టణంలో రింగ్ సెంటర్లో లారీ ఢీకొనడంతో వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పొదిలి లక్ష్మి, కుమారుడు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అశ్వారావుపేటలో నామినేషన్ల సందడి

**అశ్వారావుపేట, జనవరి 29 పెన్ పవర్:** అశ్వారావుపేటలో ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్ల స్వీకరణలో భాగంగా గురువారం రెండో రోజు కేంద్రాల వద్ద అభ్యర్థులు తమ అనుచరులతో తరలివస్తున్నారు. మొదటి రోజు కేవలం మూడు నామినేషన్లు దాఖలు కాగా, రెండో రోజు వివిధ పార్టీల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. హెల్ప్ డెస్క్ వద్ద అభ్యర్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి క్యూ కడుతున్నారు.

## రామయ్య సన్నిధిలో హుండీ లెక్కింపు మొదలు

**భద్రాచలం, జనవరి 29 పెన్ పవర్:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి సన్నిధిలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఆలయ ఈఓ దామోదర్ రావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, భక్తులు కలిసి వివిధ హుండీలలోని కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపు ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. లెక్కించిన నగదు, బంగారం, వెండి వంటి కానుకల పూర్తి వివరాలు సాయంత్రానికి వెల్లడిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్తగూడెం నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్

**ఇల్లందు, జనవరి 29 పెన్ పవర్:** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో, గురువారం మున్సిపల్ కమిషనర్ సుజాత నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. రిటర్నింగ్ అధికారుల పనితీరు, అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులను తనిఖీ చేసి, నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు.

## వనం నుంచి జనంలోకి రానున్న సమ్మక్క

**ములుగు, జనవరి 29 పెన్ పవర్:** మేడారంలో నేడు భక్త కోటి నీరాజనాలు అందుకునేందుకు ఇలవేల్పయిన సమ్మక్క తల్లి తన గద్దెపై అట్టహాసంగా కొలువుదీరనున్నది. మేడారంలోని అడవిలో 4 రోజుల పాటు జరిగే ఈ మహాజాతరతో అభయారణ్యం జనారణ్యమవుతుంది. ఆదివాసి ఆరాధ్య దేవత నెలవైన చిలుకలగుట్ట నుంచి గద్దెకు సమ్మక్క తరలివెళ్లే శుభ ఘడియను తిలకించేందుకు భక్తులు ఎదురుచూస్తున్నారు. ఈ మహా క్రతువు కోసం మంత్రి సీతక్క యంత్రాంగంతో సాయంత్రం వేళ గుట్ట పరిసరాలకు చేరుతారు.

# ఎసిబికి చిక్కిన నార్నూర్ ఎ.ఇ. శ్రీకాంత్ డిస్మిస్

## అవినీతికి పాల్పడితే కటకటాలే...బ్లాక్ లిస్టులో వివరాలు

## హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి. వి. పి. గౌతం

**హైదరాబాద్ , జనవరి 28: పెన్ పవర్:** విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడి, లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల అవుట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గం శ్రీకాంత్ ను ఉద్యోగంలో నుంచి తొలగించామని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. ఇతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు, భవిష్యత్తులో ఎక్కడా ఉద్యోగం రాకుండా వివరాలను బ్లాక్ లిస్టులో పెడుతున్నట్లు ప్రకటించారు. శ్రీకాంత్ గత ఏడాది మే నెల నుంచి విధులను నిర్వహిస్తూ మంగళవారం నాడు నార్నూర్ లో ఇందిరమ్మ లబ్ధిదారుల నుంచి లంచం డిమాండ్ చేసి, రెడ్ హ్యాండెడ్ గా దొరికారు.

# మేడారంలో... విరజిమ్ముతున్న విద్యుత్ వెలుగులు

**ములుగు: పెన్ పవర్:** విద్యుత్ పరంగా మేడారంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సత్వర చర్యలు తీసుకుంటూ మిరుమిట్లు గొలిపేలా వెలుగుల మేడారంగా ఎన్పీడీసీఎల్ తీర్చిదిద్దింది. వెలుగుల జిగేల్ మనేలా తీరిచిద్దిన మేడారంకు అధికారులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది నిత్యం రౌండ్ ది క్లాక్ విధులు నిర్వహిస్తున్నారు , ఇద్దరు డైరెక్టర్లు టి.మధుసూదన్, వి.మోహన్ రావు. చీఫ్ ఇంజనీర్లు కె. రాజు చౌహన్, అశోక్ పర్యవేక్షణలో నలుగురు సూపరింటెంట్ ఇంజనీర్లు, ఏడుగురు డివిజన్ ఇంజనీర్లు, 30 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు 150 నుంది. 500 మంది ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు మూడు బ్యాచ్ లుగా 30 మంది చొప్పున విధులు నిర్వహిస్తున్నారు.

# మారుతీకి చుక్కలు చూపిస్తున్న ప్రభాస్ ఫ్యాన్స్

**హైదరాబాద్, జనవరి 29 పెన్ పవర్:** సినీ సెలబ్రిటీలు పబ్లిక్ ఈవెంట్స్ లో మాట్లాడేటప్పుడు, ఆచి తూచి మాట్లాడాలి. సవాళ్లు విసరడం, అభిమానులకు లేని పోనీ ప్రమాణాలు చేయడం వంటివి మంచిది కాదు. గత ఏడాది 'వార్ 2' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ నాగవంశీ లేని పోనీ ప్రమాణాలు చేసి, యాటిట్యూడ్ తో మాట్లాడిన మాటలకు అతను ఎదురుకున్న పరిణామాలు ఎలాంటివో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రతీ ఒక్కరు చూసారు. దెబ్బకు ఇకపై నేను మైక్ అందుకోను అని చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు 'రాజా సాబ్' డైరెక్టర్ మారుతీ పరిస్థితి కూడా అంతే. ప్రభాస్ ఫ్యాన్స్ రోజుకి ఒక కొత్త ఐడియా తో మారుతీ చేత నరకం స్పెల్లింగ్ రాయిస్తున్నారు. 'రాజా సాబ్' చిత్రం ప్రభాస్ ని ఇష్టపడే ప్రతీ ఒక్కరికి నచ్చుతుంది. ఒకవేళ నచ్చకపోతే నా అడ్రస్ ఇస్తున్నాను, అంటూ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో అడ్రస్ చెప్పుకొచ్చాడు డైరెక్టర్ మారుతీ.ఇంత గట్టిగా చెప్పాడంటే సినిమా ఔట్పుట్ వేరే లెవెల్ లో వచ్చిందేమో అని అంతా అనుకున్నారు. కానీ తీరా చూస్తే ప్రీమియర్ షోస్ కి వెళ్లిన అభిమానులు తీవ్రమైన నిరాశతో ఇంటికి తిరిగొచ్చారు. డైరెక్టర్ మారుతీ పని తీరు పై కారాలు మిరియాలు నూరుతూ సోషల్ మీడియా లో మొదటి రోజు నుండి అతన్ని ట్యాగ్ చేస్తూ బూతులు తిడుతున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. అంతే కాదు, అడ్రస్ కూడా ఇచ్చాడు కాబట్టి, అతని ఇంటికి నిన్న మొన్నటి వరకు లెటర్స్ గుట్టలు గుట్టలుగా పంపించారు. అక్కడితో ఆగకుండా వందల సంఖ్యలో స్విగ్గీ, జొమాటో వంటి యాప్స్ ద్వారా క్యాష్ ఆన్ డెలివరీ ఫుడ్ ఆర్డర్లు పెట్టారు. ఒక్కసారిగా ఇన్ని ఆర్డర్లు రావడం తో మారుతీ సిబ్బంది కంగుతిన్నారు. ఈ విషయాన్నీ మారుతీ కి తెలియజేయగా, నేను ఎలాంటి ఫుడ్ ఆర్డర్స్ పెట్టలేదని, వచ్చిన వాళ్ళను వెనక్కి పంపేయాలని చెప్పాడట.ప్రతీ రోజు ఈ ఫుడ్ ఆర్డర్ల వ్యవహారం మారుతీ సిబ్బంది కి పెద్ద తలనొప్పిగా మారిందట. ఇలా రోజుకి ఒక యాంగిల్ లో డైరెక్టర్ మారుతీ ని చిత్రహింసలకు గురి చేస్తున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. ఇక్కడ అభిమానులు ఒక్కటి అర్థం చేసుకోవాలి, ఏ డైరెక్టర్ కూడా ఒక సినిమాని ఫ్లాప్ అవ్వాలని తియ్యరు, కచ్చితంగా సూపర్ హిట్ సినిమాని తియ్యాలి అనే ఆశతో , కసితో కష్టపడి పని చేస్తుంటారు. డైరెక్టర్ మారుతీ ఆరోజు ఆ రేంజ్ లో ఈ సినిమా గురించి చెప్పాడంటే, అతను తీసిన ఔట్పుట్ పై సంతృప్తి గా ఉన్నాడు. అది ఆయన నమ్మకం, అందుకే అంత గట్టిగా చెప్పాడు. కానీ ఆడియన్స్ కి ఆ చిత్రం నచ్చలేదు. ఒక్కోసారి ఇలా అవుతుంటాయి, అభిమానులు సీరియస్ గా తీసుకొని ఇలా చేయడం కరెక్ట్ కాదంటూ సోషల్ మీడియా లో విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు.

# ప్రజల కోసం ఉద్యోగానికి రాజీనామా చేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రావణి గౌడ్



**బెల్లంపల్లి, జనవరి 29 పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్గా పనిచేసిన గుర్రం శ్రావణి గౌడ్, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించడానికి తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశారు. తెల్లకోటును వదిలి ప్రజల కోసం పోరాడేందుకు సిద్ధమవుతున్నట్లు ఆమె బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో తెలిపారు. ప్రజల జీవితాలను దగ్గరగా చూసిన అనుభవమే తనను ప్రజా జీవితంలోకి తీసుకువచ్చిందని ఆమె పేర్కొన్నారు.

# ఆర్థిక అవగాహన సదస్సు:

# బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**మంచిర్యాల, జనవరి 29 పెన్ పవర్:** జన్నారం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, నాబార్డ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అవగాహన సదస్సు జరిగింది. సర్పంచ్ దినేష్ నాయక్, ఉపసర్పంచ్ సుకదేవి, బ్యాంక్ మేనేజర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పంట రుణాలు, ఇన్సూరెన్స్, డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరుపై బ్యాంక్ మేనేజర్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దినేష్ నాయక్ కోరారు. ఈ సదస్సులో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుడు రమేష్ కాంగ్రెస్‌లో చేరిక

**చెన్నూరు, జనవరి 29 పెన్ పవర్:** గురువారం మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సమక్షంలో దండేపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, రైతు సమన్వయ సమితి డైరెక్టర్ ఇప్ప రమేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రజల అభివృద్ధికి సేవా భావంతో కాంగ్రెస్ లో చేరానని, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేందుకు కృషి చేస్తానని ఇప్ప రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిట్ల శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బంబారాలో ఎన్ఎస్ఎస్ శిబిరం:

# గ్రామాభివృద్ధికి విద్యార్థుల సేవ

**ఆసిఫాబాద్, జనవరి 29 పెన్ పవర్:** ఆసిఫాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వాంకిడి మండలంలోని బంబారా గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం గురువారం రెండవ రోజు ఘనంగా కొనసాగింది. ప్రిన్సిపాల్ కనకయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ దేవేందర్, సర్పంచ్ బెండరే కృష్ణాజీ, ఉపసర్పంచ్ జాడే సంతోష్ పాల్గొన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు పరిశుభ్రత, సామాజిక అవగాహన, సేవా కార్యక్రమాల ద్వారా గ్రామాభివృద్ధికి కృషి చేయనున్నారు.

# సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పంపిణి

**కోరుట్ల, జనవరి 29 పెన్ పవర్:** మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామానికి చెందిన సుద్దు దేవరాజు లక్ష్మీకి కాంగ్రెస్ నాయకులు గురువారం కల్టివేటర్ ను అందజేశారు. ఈ కల్టివేటర్ రైతాంగానికి వ్యవసాయ పనుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వానికి, దీనికి సహకరించిన జువ్వాడి నర్సింగరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదం గంగాధర్, ఎదులాపురం రమేష్, నత్తి రాము, ఆకుల ఎర్రన్న, జంబరత్ ప్రశాంత్ పాల్గొన్నారు.

# పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ క్యాంప్



**పినపాక, జనవరి 29 పెన్ పవర్:** పినపాక మండలం టి. కొత్తగూడెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో పశువులకు నట్టల మందు పంపిణీతో పాటు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వెటర్నరీ డాక్టర్ ఉజ్వల పశువులను పరిశీలించి, గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆనందం కాదు, ఆలోచనే పని

**హైదరాబాద్ , జనవరి 28: పెన్ పవర్:** మెదడన్నది మనకున్నది?అన్నాడు మహాకవి. మనసు గతి ఇంతే అని పాడాడు ఇంకో కవి. మెదడూ మనసూ ఒకటేనని వివరిస్తారు డాక్లర్లు. ఆ చర్చ అలా వుంచితే నాకేమీ సంతోషంగా లేదు. బాలేదు, దిగులుగా వుంది, బరువుగా వుందని వాపోతుంటారు చాలా మంది. ఈ విషయంలోనూ వైద్యశాస్త్రం క్లియర్‌గానే చెబుతున్నది. ముప్పై మూడేళ్ల పాటు న్యూరో సర్జన్‌గా అంటే మెదడు డాక్టర్‌గా పనిచేసిన డా.ప్రశాంత కట్కోలా ఈ విషయమై మాట్లాడుతూ అసలు మెదడు పనే అది కదా అంటున్నారు. మీ మెదడనేది చాలా సంక్లిష్టమైన అవయవం. అది మీ జ్ఞాపకాలనూ ఆవేశాలనూ స్పర్శనూ చలనాలనూ శ్వాసనూ నియంత్రిస్తుంటుంది. ఆకలి, కోరికలూ ఏవైనా సరే దాని ద్వారానే జరుగుతాయి గనక నిస్సందేహంగా అదే మన శరీరంలో అతి ముఖ్యమైన భాగం. అయితే మెదడు కీలక బాధ్యత మిమ్మల్ను ఆనందంగా వుంచడమేం కాదు. మీ మనుగడను కాపాడ్డమే దాని పని. కనుక మనసో మెదడో దిగులుగా వుందని దిగులు పడకుండా వుండాలంటే మీరు మూడు సూత్రాలు అర్థం చేసుకోవాలంటాడాయన. మొదటిది-పొరబాట్లు నేర్చుకోవడంలో భాగంగా జరుగుతుంటాయి తప్ప వాటిని వైఫల్యాలుగా భావించకూడదు. మీరు అభివృద్ధి చెందుతున్నారనే అర్థం చేసుకోవాలి. రెండు-అసంపూర్ణత అనేది శాశ్వతంగా వుంటుంది. మీరు ఒకటి పొందాలంటే ఒకటి కోల్పోతుంటారు. ఈ రాకపోకలలోనే సమతుల్యత వస్తుంది, మూడు-ఏదీ ఎప్పుడూ ఒకేలా వుండదు. మీరు నేర్చుకుంటూ మార్చుకుంటూ వుంటారు. ఇందులో ఏదీ లోపం కాదని గ్రహించాలంటాడు. అసలు అన్ని రకాల అభద్రతలనూ అధిగమించడమెలాగన్నదే మెదడు చెప్పే సందేశం, దాంతో ఆనందం కూడా వస్తుందని సారాంశం.

భావం సరైందైతే చాలదు, భాషలో వ్యక్తీకరణ కూడా సక్రమంగా వుండాలి. ఒక మంచి మాట చెప్పడానికి మరో పొరబాటు భావం చేరవేయకూడదు.ఈ మధ్య మెగాస్టార్ చిరంజీవి అలాంటి సమస్యలోనే చిక్కుకుపోయారు. తను వెంకటేష్‌తో కలసి నటించిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్' విజయోత్సాహంలో మునిగి తేలుతున్నాడాయన. ఈ వేడుకలోనే ఆయన మాట్లాడుతూ అమ్మాయిలు చిత్ర పరిశ్రమలోకి నిస్సంకోచంగా రావాలని, ధైర్యంగా నిలబడాలని ఆహ్వానించారు. ఈ చిత్రానికి ఒక నిర్మాత ఆయన పెద్ద కుమార్తె గనక ఈ ప్రస్తావన వచ్చిందన్నమాట. మంచిదే. గతంలో హీరో కృష్ణ కూతురు లేదా మరో హీరో చెల్లెలు సినిమాల్లోకి వస్తామంటే వారి అభిమానులనే పేరిట గగ్గోలు పెట్టి ఆపేశారు. వచ్చిన వారిపై ఎలాంటి మాటలంటున్నారో మొన్ననే డ్రస్సింగ్ డిబేట్‌లో చూశాం. అలా గాకుండా అగ్ర హీరో అమ్మాయిలను ఆహ్వానించడం ఓకే, అంతటితో ఆగని చిరంజీవి సినిమా రంగంలో క్యాస్టింగ్ కౌచ్ వుంటుందనేది నిజం కాదని కొట్టిపారేశారు. ప్రభుత్వాలు నియమించిన కమిషన్లే నిర్ధారించిన నిజం కదా క్యాస్టింగ్ కౌచ్? కోర్టులు కూడా కొన్నిసార్లు ఆదేశాలు జారీచేశాయి. మీ టూ వంటి ఉద్యమాలు, నినాదాలు పుట్టాయి. ఇవన్నీ చిరంజీవికి తెలియవా? గతంలోనూ ఆయన తన ఇంట్లో ఆడపిల్లలు ఎక్కువని తను లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా వుంటానని వ్యాఖ్యానించి నాలుక్కరుచుకున్నారు. అసమానతలు, ఆత్యాచారాల పురుషాధిక్య సమాజంలో, అందులోనూ రంగుల రంగమైన సినిమా లోకంలో ఈ సమస్యలు సత్యమేనని అందరికీ తెలుసు. అనుభవాలతో సహా ఎందరో అభినేత్రులు చెప్పారు కూడా. ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు పొమ్మని చెప్పడం వేరు, అసలు సమస్యే లేదని చెప్పడం వేరు కదా. సహజంగానే చిరంజీవిపై నటీమణులు నిరసన చెప్పాల్సి వచ్చింది. మరి ఏమైనా వివరణో సవరణో ఇస్తారో లేదో చూడాలిక.ఎ.ఆర్.రెహమాన్ అనగానే మనకు ఆస్కార్ తెచ్చిపెట్టిన జయహో గీతం, కొత్త బాణీతో వందేమాతరం స్వర కల్పన గుర్తుకు వస్తాయి. కాశ్మీర్ ఉగ్రవాదం నేపథ్యంలో తీసిన 'రోజా' నుంచి వరుసగా గొప్ప చిత్రాలు మదిలో మెదులుతాయి. బ్రిటన్‌లో మకాం వేసి ప్రపంచ సంగీత వేదికపై సగర్వంగా భారత పతాకం ఎగరేస్తున్న సంగీత దిగ్గజం తను. అసలు మన దరిదాపులకు రాని ఆస్కార్లు రెండుసార్లు తెచ్చిపెట్టిన ముద్దుబిడ్డ. అలాంటి అరుదైన అంతర్జాతీయ ప్రతిభాశాలిని కూడా సంఘ పరివార్ మత రాజకీయం వదలిపెట్టడం లేదు. రెహమాన్ ఎక్కడో మాట్లాడుతూ భారత దేశంలో అధికార రాజకీయం మారాక తనకు అవకాశాలు కొంత తగ్గాయనే అభిప్రాయం యథాలాపంగా చెప్పారు. ఇందులో మత కోణం కూడా వుంటే వుండవచ్చన్నారు. దేశంలో పరిస్థితులు గమనిస్తున్న వారెవరికైనా ఈ మాటలు అర్థమవుతాయి. ఒక దశలో తమకు సరైన ఇల్లు అద్దెకు దొరకలేదని షబానా అజ్మీ వంటి నటీమణి చెప్పడం ఎవరికి తెలియదు? కానీ రెహమాన్ ఈ మాట అనడం దేశానికి ద్రోహమైనట్టు విరుచుకు పడ్డారు హిందూత్వ వాదులు. రకరకాల రూపాల్లో దాడి చేశారు. ఎందుకైనా మంచిదని ఆయన కూడా ఒకడుగు తగ్గి తాను ఎవరినీ అనడం లేదనీ, కొన్నిసార్లు తన మాటలు అపార్థం చేసుకోవచ్చని వివరణ కూడా ఇచ్చారు. అయినా ఈ దాడి మాత్రం తగ్గలేదు. రెహమాన్ వివరణ తర్వాత బిజెపి కి సన్నిహితంగా వుండే పరేష్ రావల్ వంటి నటులు సమర్థిస్తూ ప్రకటన చేశారు. కానీ హిందూత్వ ప్రతినిధులు మాత్రం కారాలు, మిరియాలు నూరుతూనే వున్నారు. వారికి తెలిసింది అదొక్కటే మరి. కానీ ఈ దాడి మాత్రం కొనసాగుతూనే వుంది. ఏమంటే రెహమాన్‌ను తప్పు పట్టడం ద్వారా తమ దేశభక్తి నిరూపించుకోవాలని కొందరి హడావుడి. రేపు ఈ పెద్ద మనుషులను కూడా పరివార్ ఏదో ఒక పాయింట్‌పై పట్టి పీడించకపోదు. మనం చూడకపోము! తన జీవితంలో ఎదురైన దాన్ని అతడు చెప్పాడే గాని ఎవరినీ అవమానించలేదు. 'సర్' తతంగంలో భాగంగా బెంగాల్‌లో నోబెల్ గ్రహీత అమర్త్యసేన్‌కు నోటీసు ఇవ్వడం కన్నా ఇదేమన్నా ఎక్కువా, ఆలోచిస్తే?

# కమలానికి మున్సిపల్ పరీక్ష




**హైదరాబాద్, జనవరి 29, పెన్ పవర్:** ఈసారి పురపోరు బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారనుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అంతంత మాత్రంగానే సీట్లు దక్కించుకున్న బీజేపీకి ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష కానున్నాయి. అధికారంలోని కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయమని చెప్పుకునే కమలం పార్టీ ఇప్పు డు ఆశలన్నీ మున్సిపల్‌పైనే పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలంటే ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ గెలవాల్సిన పరిస్థితి. ఈ ఫలితాలను బట్టే ప్రజల్లోకి పాజిటివ్ సంకేతాలు వెళ్తాయి.మొదటి నుంచి తమకు అర్బన్ (పట్టణ) ప్రాంతాల్లోనే బలం ఉందని చెప్పుకుంటున్న బీజేపీ ఈ ఎన్నికల్లో అత్యధికంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, వార్డులను కైవసం చేసుకోవాల్సిఉంటుంది. ఇందులో భాగంగానే వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ నాయకులకు ఇన్‌చార్జీలు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే జాతీయ నాయకత్వం ముగ్గురు ఎన్నికల ఇన్‌చార్జ్‌లు, కోఇన్‌చార్జీలను నియమించగా త్వర లోనే జాతీయ అధ్యక్షుడితోపాటు పలువురు జాతీయ నాయకులకు ఏకంగా రంగంలోకి దింపబోతోందిరాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు, 2,996 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ ప్రక్రియకు రేపటితో ఆఖరు గడువు. అయితే గత మున్సిపల్ ఎన్నికల్లో 322 కౌన్సిలర్లు, కార్పొరేటర్లను బీజేపీ గెలుచుకుంది. వీటితోపాటు ఐదు మున్సిపల్ చైర్మన్లను బీజేపీతమ ఖాతాలో వేసుకుంది. మొన్న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 5000 మందిని బరిలోకి దింపి 800 నుంచి 1000 వరకు పంచాయతీలను గెలుచుకుంది.గ్రామీణంలో తమకు పెద్దగా బలం లేదని, పట్టణమే తమ బలమని కమలం పార్టీ ముందు నుంచి అంటోంది. ప్రజల్లోనూ బీజేపీ అంటే అర్బన్ పార్టీ అనే ముద్రనే ఉంది. ఇప్పుడిదే బీజేపీకి అగ్నిపరీక్షగా మారింది. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడాఅస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. రాజకీయ పార్టీల గుర్తుల మీద ఈ ఎన్నికలు జరుగనుండటంతో పురపోరులో ఏ పార్టీ బలమెంతో స్పష్టమవుతుంది. తమకున్న పేరును నిలుపుకోవాలన్నా...వచ్చే జీహెచ్ఎంసీ,అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలన్నా ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయబావుటా ఎగురవేయాల్సిందే.ఇందులో భాగంగానే బీజేపీ ఈసారి పెద్ద టార్గెట్‌ను పెట్టుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో 50 నుంచి 60 శాతంవరకు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏడు కార్పొరేషన్లలో నాలుగు నుంచి ఐదు వరకు గెలుచుకునేలా వ్యూహాలను అమలు చేస్తోంది. వీటితోపాటు పార్టీ తన ఉనికిని చాటుకునేలా ఎక్కువ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలుచుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో వారం రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు భేటీ అయ్యారు. ఢిల్లీ నుంచి ఆయన వచ్చిన వెంటనే అత్యవసరంగా పార్టీ పదాధికారుల మీటింగ్ నిర్వహించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ నాయకత్వం ఇప్పటికే ముగ్గురిని రంగంలోకి దింపిందని, వారికి మున్సిల్ ఎన్నికలఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ.. మహారాష్ట్ర మంత్రి ఆశిష్ శెలార్‌కు, కోఇన్‌చార్జ్‌లుగా రేఖా శర్మ, అశోక్‌కు బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారువీరు ముఖ్యనాయకులతో వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలనునిర్వహిస్తూ ఎన్నికల వ్యూహాలను రచిస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఆయా జిల్లాలు, నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల టాస్క్‌లను అప్పగించారు. వీటికితోడూఇప్పటికే జిల్లా, మున్సిపాలిటీల వారీగా మరికొంత మంది రాష్ట్ర నేతలను ఇన్‌చార్జీలుగా రాష్ట్ర నాయకత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లుతెలుస్తోంది.ఫిబ్రవరి 7, 9వ తేదీల్లో వీటిని నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ సభలను ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణలో నిర్వహించాలని నిర్ణయించారు. తొలుత ఐదు సభలను నిర్వహించాలని అనుకున్న పార్టీ నేతలు దాన్ని రెండుకు కుదించినట్లుగా తెలిసింది. ఈ సభల ద్వారా ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ జాతీయ స్థాయి దిగ్గజాలను రంగంలోకి దించుతోంది.పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హాతోపాటు కీలక నేత అమిత్‌షా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉండడంతో ఎన్ని సభలు నిర్వహిస్తారో...ఎంత మంది నేతలు వస్తారనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రాబోయేరోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే కమలనాథులకు ఈ పురపోరు ఎన్నికలు మాత్రం పరీక్షే అని చెప్పాలి.

# పీలా బ్రదర్స్ పొలిటికల్ వార్

**విశాఖపట్టణం, జనవరి 29, పెన్ పవర్:** ఉమ్మడి విశాఖ జిల్లాలో పీలా ఫ్యామిలీ టీడీపీకి నమ్మిన బంటు వంటిది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీనే నమ్ముకుని రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు. పీలా మహలక్ష్మీ నాయుడు దగ్గరి నుంచి టీడీపీ అధిష్టానం కూడా ఆ ఫ్యామిలీకి చాలా ఇంపార్టెన్స్ ఇస్తూ వస్తోంది. విశాఖ జిల్లాలో గవర సామాజికవర్గం నుంచి అత్యంత బలమైన నాయకత్వంగా ఉన్నారు పీలా ఫ్యామిలీ. మహలక్ష్మీ నాయుడు తర్వాత ఆయన కుమారులు రాజకీయాల్లోకి వచ్చారు. వ్యాపార వ్యవహారాలు సాగిస్తూ పాలిటిక్స్‌లో యాక్టీవ్‌గా ఉంటున్నారు. పీలా శ్రీనివాసరావు ప్రస్తుతం గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ మేయర్‌గా ఉన్నారు. పీలా గోవింద్ అనకాపల్లి ఎమ్మెల్యేగా గతంలో పని చేసి ప్రస్తుతం అర్బన్ ఫైనాన్స్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోస్ట్‌లో కొనసాగుతున్నారు. అయితే విశాఖ పాలిటిక్స్‌లో పీలా బ్రదర్స్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిపోయారు. క్యాడర్ మీద, కిందిస్థాయి నేతలపై చిర్రుబుర్రులాడుతూ.. పెద్ద పెద్ద బహిరంగ వేదికలపై రచ్చ చేస్తూ టాక్ ఆఫ్ ది కాంట్రవర్సీగా ఉంటున్నారట. ఈ మధ్యే హోంమంత్రి అనిత అనకాపల్లి జిల్లాలో పర్యటించారు. ఆమె తిరుగు ప్రయాణమైన సమయంలో తన అనుచరులుతో కలిసి అనితతో మాట్లాడేందుకు పీలా గోవింద్ ప్రయత్నాలు చేశారు. అయితే తన బిజీ షెడ్యూల్ కారణంగా పీలా గోవింద్‌ను గమనించకుండా హోంమంత్రి కారెక్కి వెళ్లిపోయారుతాను పిలిచినా సరే కనీసం ఖాతరు చేయకుండా కారెక్కి వెళ్లిపోవడమేంటని పీలా గోవింద్ హోంమంత్రి అనితకు నేరుగా ఫోన్ కాల్ చేశారు. తన క్యాడర్ ముందు స్పీకర్ పెట్టి మాట్లాడారు. తాను మాజీ ఎమ్మెల్యేనని, లెక్క చేయకుండా వెళ్లిపోవడం ఏంటని రుసరుసలాడారు. దీంతో అనిత పరిస్థితిని వివరించి సర్ది చెప్పుకోవాల్సి వచ్చింది. తన అనుచరుల ముందు తనకు అవమానం జరిగిందంటూ పీలా గోవింద్ నానా యాగీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇగో విషయంలో సోదరుడు పీలా గోవింద్‌కు తానేం తక్కువ కాదంటూ మేయర్ పీలా శ్రీనివాసరావు కూడా రెచ్చిపోయారు. విశాఖ ఉత్సవ్ ప్రారంభోత్సవ వేడుకలకు రాష్ట్ర మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అయితే ప్రారంభోత్సవ సమయంలో వేదికపై సీట్ల సర్దుబాటులో భాగంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్..జోక్యం చేసుకుని మేయర్ పీలా శ్రీనివాసరావును మరో చోటకు మారాలని సూచించారు. అంతే వెంటనే మేయర్ ఒంటికాలిపై లేచి కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ మేయర్ అంటే కనీసం గౌరవం లేదా.? నన్నే సీటు మారమంటారా.? ప్రొటోకాల్ తెలియదా.? నీ సంగతి చూస్తా అంటూ వార్నింగ్ ఇచ్చారు. కలెక్టర్ సర్ది చెప్పబోయినా సరే పీలా శ్రీనివాసారవు ఏమాత్రం పట్టించుకోలేదు. వేదికపై నుంచి కిందకు వెళ్లిపోయారు. ఉత్సవ్ ఓపెనింగ్‌కు వచ్చిన ప్రజలు, అటు ప్రజాప్రతినిధులు మేయర్ గారి దూకుడును చూసి విస్తుపోయారట. పీలా సోదరులు ఇలా చిందులేయడం ఇదేం కొత్త కాదంట. ఎన్నికల టైమ్‌లో టీడీపీ అధిష్టానం అనకాపల్లి ఎమ్మెల్యే సీటును జనసేనకు కేటాయించడంతో అప్పటి టికెట్ ఆశావహుడు పీలా గోవింద్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదంటున్నారు. ఏకంగా చంద్రబాబును వ్యతిరేకిస్తూ తన క్యాడర్‌ను రంగంలోకి దించి దిష్టిబొమ్మలు తగులపెట్టడం, ఫ్లెక్సీలు చించడం, చంద్రబాబు, లోకేశ్‌పై దూషణలకు దిగారంటూ గుర్తు చేస్తున్నారు. అలాగే పీలా శ్రీనివాసరావు కూడా గత కార్పొరేషన్ ఎన్నికలకు ముందు పలువురు కార్పొరేటర్లకు ఫండింగ్ చేసి చీటికి మాటికి రెచ్చిపోయేవారట. అప్పట్లో పార్టీ పరిస్థితుల దృష్ట్యా నేతలంతా సర్దుకుపోయారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా సరే పీలా సోదరులు ఏ మాత్రం మారడం లేదని తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారట. చీటికి..మాటికి అలక పాన్పు ఎక్కడం.. లేకుంటే, సహనం కొల్పోయి, కోపంతో పక్కవారిపై అరవడం వీళ్లకు అలవాటుగా మారిందని గుసగుసలు పెట్టుకుంటున్నారట. తండ్రి మహలక్ష్మీ నాయుడు పార్టీకి వీర విధేయుడని..కుమారులకు అవకాశాలు ఇస్తే ఇలా రోడ్ల మీద వీరంగం వేసి పార్టీని బజారుకు ఈడుస్తున్నారని మండిపడుతున్నారు పలువురు తెలుగు తమ్ముళ్లు. ఈ అన్నదమ్ముల వ్యవహార తీరు ఎప్పుడు మారుతుందో..తమకు ఎప్పుడు ఈ తలపోటు తప్పుతుందోనని రగిలిపోతున్నారట టీడీపీ లీడర్లు.

# నిధుల కోసం ఢిల్లీకి జనసేనాని



**కాకినాడ, జనవరి 29, పెన్ పవర్:** ఏపీ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కువగా రాష్ట్రంలోనే ఉండి తన శాఖల పనులను పర్యవేక్షిస్తున్న విషయం తెలిసిందే. దాదాపు గత ఇరవై నెలల కాలంలో ఒకటి రెండు సందర్భాలు తప్ప ఆయన ఢిల్లీ వెళ్లలేదు. పరిపాలనపై పూర్తి పట్టు సాధించాలనే ఉద్దేశంతో శాఖల పనితీరును దగ్గరుండి చూసుకుంటూ నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఇదిలా ఉండగా, మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో పాటు మంత్రి నారా లోకేష్ తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి అవసరమైన నిధుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి పవన్ కళ్యాణ్ కూడా ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారనే వార్త రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. కేంద్ర బడ్జెట్ సమావేశాల మధ్యలో ఆయన పర్యటన ఉండబోతుందని జనసేన లోక్‌సభాపక్ష నేత బాలశౌరి వెల్లడించారు. ఈ పర్యటనలో పవన్ కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల మంత్రులతో విడిగా భేటీ అయ్యి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన నిధులపై చర్చించనున్నారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర రాజధానిగా నిర్ణయించిన అమరావతి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేంద్రం నుంచి రాబట్టడం ఆయన ప్రధాన లక్ష్యంగా ఉండనుందని చెప్పారు. అమరావతితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అదనపు నిధులు అవసరమని పవన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారని జనసేన వర్గాలు పేర్కొంటున్నాయి. దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో పవన్‌కు ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం వినియోగించుకుంటారని పార్టీ నేతలు భావిస్తున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉన్నందున ఈ పర్యటన ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇటీవల కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా జనసేన తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేసింది. ఆ సమావేశంలో బాలశౌరి మాట్లాడుతూ అమరావతికి చట్టబద్ధత కల్పించేలా కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే యువతలో పెరుగుతున్న డ్రగ్స్ సమస్యపై తల్లిదండ్రుల్లో ఉన్న ఆందోళనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. డ్రగ్స్ నియంత్రణతో పాటు సోషల్ మీడియా దుర్వినియోగంపై కఠిన చట్టాలు అవసరమని, వీటిపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని జనసేన అభిప్రాయపడింది. అదేవిధంగా జల జీవన్ మిషన్ కింద ప్రతి గ్రామానికి తాగునీరు అందించే లక్ష్యంతో అన్ని జిల్లాలకు సరిపడా నిధులు కేటాయించాలని కోరింది. ఆక్వా కల్చర్ రంగంపై అమెరికా విధిస్తున్న పన్నుల ప్రభావం తీవ్రంగా ఉందని, ఆక్వా రైతుల సమస్యలపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ జరిపి పరిష్కారం చూపాలని జనసేన కేంద్రాన్ని అభ్యర్థిస్తోంది. ఈ అన్ని అంశాలతో పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన రాష్ట్ర భవిష్యత్తుకు కీలకంగా మారనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**పిఠాపురం స్టేషన్ కు మహర్దశ**

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాల గురించి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించిన పవన్ కళ్యాణ్ పిఠాపురంలో రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. రైల్ ఓవర్ బ్రిడ్జి లేని కారణంగా అనేక ఇబ్బందులు ప్రజలు పడుతున్నారని పవన్ కళ్యాణ్ కేంద్ర మంత్రికి తెలిపారు. మరొకవైపు పిఠాపురం రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేయాలని వినతి పత్రాన్ని అందచేశారు. కాకినాడ-పిఠాపురం మధ్య రైల్వే అనుసంధానం పెంచాలని కోరిన పవన్ కళ్యాణ్ దీనివల్ల పిఠాపురం నియోజకవర్గం కనెక్టివిటీ పెరుగుతుందని చెప్పారు. దీంతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టుల గురించి కూడా చర్చించారు. సేతు బంధన్ పథకం కింద మంజూరు చేసిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఇది 2030 జాతీయ రైల్ ప్రణాళికకు

అనుగుణంగా లెవల్ క్రాసింగులు తొలగించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తుందని తెలిపారు. పిఠాపురం ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణం అయినందున రైల్వే స్టేషన్ ను అమృత్ స్కీం కింద మోడల్ రైల్వే స్టేషన్ గా అభివృద్ధి చేయాలని కోరారు. అష్టాదశ శక్తిపీఠం, శ్రీ పాద శ్రీ వల్లభ స్వామి కొలువైన క్షేత్రం పిఠాపురంలో ఉన్నందున దర్శనం నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. వీటితోపాటు రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టుల గురించి పవన్ కళ్యాణ్ చర్చించారు. అశ్విని వైష్ణవ్ గారు సానుకూలంగా స్పందించినందుకుపవన్ కళ్యాణ్ గారు కృతజ్ఞతలు తెలిపారు.

# జూన్ 26న భోగాపురం ఎయిర్ పోర్ట్ రెడీ

**విజయనగరం, జనవరి 29, పెన్ పవర్:** ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్. ఏపీలో ఇప్పటికే చాలా ఎయిర్‌పోర్టులు అందుబాటలో ఉన్నాయి. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప, కర్నూలు, రాజమండ్రి వంటి జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. త్వరలో మరో కొత్త ఎయిర్‌పోర్ట్ ఏపీ ప్రజలకు అందుబాటులోకి రానుంది. దీని వల్ల ప్రధానంగా ఉత్తరాంధ్ర ప్రజలకు భారీ లబ్ది చేకూరనుంది. ప్రయాణ సౌకర్యంతో పాటు ఎయిర్‌పోర్ట్ వల్ల రవాణా సౌకర్యాలు పెరగడం వల్ల కొత్త కంపెనీలు రానున్నాయి. దీంతో హోటళ్లు, లాజిస్టిక్ వ్యాపారం పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే ఈ ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తవ్వగా.. ఏప్రిల్‌లో ప్రారంభించనున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్స్ పూర్తయ్యాయి. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఎప్పుడు ప్రారంభం అవుతుందనే దానిపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్లారిటీ ఇచ్చారు. జూన్ 26న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జనవరి 1వ తేదీన ట్రయల్ రన్ కింద తొలి విమానం ల్యాండ్ అయినట్లు తెలిపారు. ఈ ట్రయల్ రన్‌లో భాగంగా ఢిల్లీ నుంచి ఇండిగో విమానం భోగాపురంకు చేరుకుంది. ఈ విమానంలో రామ్మోహన్ నాయుడితో పాటు ఎంపీలు, విమానయాన సంస్థ ఉన్నతాధికారులు ప్రయాణించారు. ఈ ఎయిర్‌పోర్ట్ పనులు దాదాపు అన్నీ పూర్తయ్యాయని, ప్రారంభించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయని తాజాగా రాహ్మోహన్ నాయుడు అన్నారు. అటు భారత్‌లో



రిపేర్ అండ్ ఓవర్ హాల్, ఏరోస్పేస్ క్లస్టర్లు ఏర్పాటు చేసేలా ఏపీ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. భోగాపురంలో ఇది ఏర్పాటు చేస్తే మరింత ప్రయోజనం జరగనుంది. భారత్‌లో ఎంబ్రాయర్ సంస్థ విమాన తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుండంపై రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామమని తెలిపారు. భారత్ విమానయాన రంగంలో ఇదొక కీలక మైలురాయిగా పేర్కొన్నారు. ఈ భూముల్లో

విమానాల తయారీకి బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఏపీ, గుజరాత్‌లో తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. ఈ క్రమంలో భోగాపురంలో చేత యూనిట్‌ను ఎంబ్రాయ్ సంస్థ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. భూమి కేటాయించడంతో పాటు మౌలిక సదుపాయాల కోసం వసతులు కల్పిస్తామని ప్రభుత్వం ఆఫర్ ఇచ్చిందిఎంబ్రాయర్ సంస్థ చిన్న, మధ్యస్థ, సైనిక, ట్రాన్స్‌పోర్ట్ విమానాలను తయారు చేయనుంది. దీంతో భోగాపురంలో మెయింటనెన్స్

విమానాల తయారీ ప్రాజెక్టును కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ పారిశ్రామిక పార్కుకు భూములు చాలా అనుకూలమైన ప్రదేశంలో ఉన్నాయి. ఇవి జాతీయ రహదారికి దగ్గరగా ఉన్నాయి.. అలాగే బెంగళూరు దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా సమీపంలోనే ఉన్నాయి. ఈ కారణాల వల్ల రవాణా సౌకర్యం చాలా బాగుంటుందని చెబుతున్నారు. మొత్తం మీద విమానాల తయారీ కేంద్రాలు కనుక ఏర్పాటు చేస్తే.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు దశ తిరిగినట్లే.

# మూడేళ్ల ముందు నుంచే అభ్యర్థులు

**కడప, జనవరి 29, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టారు. ముందుగా కడప జిల్లాలో పట్టు మళ్లీ పెంచుకునే ప్రయత్నంలో పడ్డారు. గత ఎన్నికల్లో కడప జిల్లాలో కేవలం మూడు నియోజకవర్గాల్లో మాత్రమే వైసీపీ గెలిచింది. మొత్తం పది నియోజకవర్గాలుండగా అందులో మూడింటిలోనే విజయం సాధించడం జగన్ పై ఉన్న వ్యతిరేకతకు కారణమయింది. అయితే కడప జిల్లాలో ఓటమికి అనేక కారణాలున్నాయి. వాటిని ఒక్కొక్కటిగా తొలగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మైదుకూరు నియోజకవర్గంలో ఈసారి కొత్త ట్రెండ్ కు తెరలేపుతున్నారు. మైదుకూరు నియోజకవర్గం అంటే తొలి నుంచి కాంగ్రెస్ తర్వాత వైసీపీకి బలం ఉన్న ప్రాంతం. అక్కడ ఓటు బ్యాంకు ఎక్కువగా యాంటీ టీడీపీ ఉన్నట్లు అనేక ఫలితాలు వెల్లడించాయి. అయితే 2024 ఎన్నికల ఫలితాలు మాత్రం వైసీపీని దెబ్బతీశాయి. ఇందులో మరొక కోణం కూడా ఉంది. అదే సామాజికవర్గం కోణం. మైదుకూరు నియోజకవర్గంలో మొదటి నుంచి రెడ్డి సామాజికవర్గం నేతలే ఎన్నికవుతూ వస్తున్నారు. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం తొలిసారి యాదవ సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేత పుట్టాసుధాకర్ యాదవ్ కు మైదుకూరు ప్రజలు అండగా నిలిచారు. 1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ పదిహేను సార్లు ఎన్నికలు జరిగితే పధ్నాలుగు సార్లు రెడ్డి సామాజికవర్గం నేతలే ఎన్నికయ్యారు. అయితే మొన్నటి ఎన్నికల్లో రెడ్డి యేతర సామాజికవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయి రికార్డు బ్రేక్ చేశారు. బీసీల్లోనూ యాదవులు ఎక్కువగా ఉండటంతో అక్కడ గెలుపు సాధ్యమయిందిదీంతో వచ్చే ఎన్నికల్లోనూ జగన్ యాదవ సామాజికవర్గానికి చెందిన నేతకే టిక్కెట్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. కడప పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్క బీసీకి కూడా టిక్కెట్ ఇవ్వకపోడం ఓటమికి కారణంగా జగన్ గుర్తించారు. కడప పట్టణ నియోజకవర్గం మాత్రం ముస్లిం మైనారిటీలకు ఇస్తూ వస్తున్నారు. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గానికే కేటాయిస్తూ వస్తున్నారు. దీంతో ఈ సారి ఆ విధానాన్ని మార్చి మైదుకూరులో బీసీని పోటీ చేయించాలన్న ఉద్దేశ్యంతో జగన్ ఉన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న రమేష్ యాదవ్ ను ఈసారి మైదుకూరు నుంచి పోటీ చేయించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారని తెలిసింది. రమేష్ యాదవ్ సొంత గ్రామం కూడా అదే నియోజకవర్గం పరిధిలో ఉండటంతో ఈ సారి ముందుగానే అక్కడ అభ్యర్థిని జగన్ ఫిక్స్ చేశారని, రమేష్ యాదవ్ కు కూడా చెప్పడంతో ఆయన మైదుకూరు నియోజకవర్గంపై ఫోకస్ పెట్టారట.

# సిద్ధార్థాలూథ్రాకు కాసులే.. కాసులు

**విజయవాడ, జనవరి 29, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యున్నత స్థాయి చట్టపరమైన పోరాటాల కోసం భారీగా ఖర్చు చేస్తోంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రభుత్వం తరపున వాదించిన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రాకు తాజాగా రూ. 1,15,50,000 ఫీజుగా చెల్లిస్తూ హోం శాఖ రెండు వేర్వేరు జీవోలను విడుదల చేసింది. క్రైమ్ నెం. 21/2024 కు సంబంధించిన ఈ కేసులో నిందితులకు బెయిల్ రాకుండా అడ్డుకోవడంలో లూథ్రా కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 104 ప్రకారం, సెప్టెంబర్ 2025లో ఐదు రోజుల పాటు (19, 22, 23, 24, 26 తేదీల్లో) హైకోర్టులో జరిగిన విచారణకు సిద్ధార్థ్ లూథ్రా హాజరయ్యారు. ఈ ఐదు రోజులకు గానూ ఆయనకు కోటి రూపాయల ప్రొఫెషనల్ ఫీజును ప్రభుత్వం ఖరారు చేసింది. ఇందులో విశేషమేమిటంటే, సెప్టెంబర్ 24న ఒక్క రోజు హాజరీకే ఆయనకు రూ. 40 లక్షలు చెల్లించారు. మిగిలిన నాలుగు రోజులకు రోజుకు రూ. 10 లక్షల చొప్పున ఫీజు లెక్కించారు. దీనికి అదనంగా 10 శాతం క్లర్కేజీ (రూ. 10 లక్షలు) కలిపి మొత్తం రూ. 1.10 కోట్లు మంజూరు చేశారు. మరోవైపు, నవంబర్ 18, 2025న జరిగిన ఒకే ఒక్క విచారణ కోసం ప్రభుత్వం మరో రూ. 5.50 లక్షలను (రూ. 5 లక్షల ఫీజు + రూ. 50 వేల క్లర్కేజీ) జీవో నెం. 103 ద్వారా విడుదల చేసింది. సిద్ధార్థ్ లూథ్రా వంటి టాప్ రేటెడ్ లాయర్లను రంగంలోకి దించారంటేనే ఈ కేసు ఎంత సీరియస్సో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ వేదికగా వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం పాలసీని మార్చడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 3,500 కోట్ల నుండి రూ. 5,000 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని సీఐడీ అభియోగం మోపింది. కొన్ని ప్రత్యేక డిస్టిలరీలకే మేలు చేసేలా టెండర్లు కట్టబెట్టడం, ప్రముఖ బ్రాండ్లను రాష్ట్రం నుండి తప్పించి నాణ్యత లేని లోకల్ బ్రాండ్లను ప్రోత్సహించడం ద్వారా భారీగా ముడుపులు అందాయని కేసు నమోదైంది. ఈ కేసులో గత ప్రభుత్వంలోని కీలక నేతలు, కొందరు ఐఏఎస్ అధికారులు నిందితులుగా ఉండటంతో ఇది రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఈ కేసు కేవలం ఒక అవినీతి కేసు మాత్రమే కాదు, రాజకీయంగా కూడా ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకం. మద్యం కుంభకోణం ద్వారా సామాన్య ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, రాష్ట్ర ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడిందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కేసులో నిందితులు చాలా బలవంతులు కావడంతో, హైకోర్టులో వారికి బెయిల్ రాకుండా చూడటం, క్వాష్ పిటిషన్లను ఎదుర్కోవడానికి సిద్ధార్థ్ లూథ్రా వంటి నిపుణుల అవసరం ఏర్పడింది. సాధారణంగా ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు పరిమితుల కంటే సిద్ధార్థ్ లూథ్రా ఫీజు ఎక్కువగా ఉన్నప్పటికీ, కేసు ప్రాముఖ్యత దృష్ట్యా నిబంధనలను సడలించి మరీ ఈ నిధులను మంజూరు చేసింది. సిద్ధార్థ్ లూథ్రా గతంలోనూ రాష్ట్రానికి సంబంధించిన అనేక హై-ప్రొఫైల్ కేసులను డీల్ చేసిన అనుభవం ఉండటంతో, ప్రభుత్వం ఆయనపైనే పూర్తి నమ్మకం ఉంచింది. ఈ ఫీజులను చెల్లించడానికి ప్రభుత్వం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుండి ప్రత్యేక అనుమతులు తీసుకుంది.

# అనంతలో ఏరోస్పేస్ సెంటర్

**అనంతపురం, జనవరి 29, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్ సంస్థ అదానీ ఏరోస్పేస్‌తో కలిసి ఇక్కడ తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఆసక్తి చూపుతోంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో భారీ పారిశ్రామిక పార్కులు, భూసేకరణ ప్రక్రియలు వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్టుల రాకతో రాష్ట్రానికి రూ. వేల కోట్ల పెట్టుబడులను, వేలాది ఉద్యోగాలను తెచ్చే అవకాశం ఉంది అంటున్నారు.. అదానీ ఏరోస్పేస్‌తో బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఎంబ్రాయెర్‌కు వ్యాపార, వాణిజ్య, సైనిక విమానాలు, విడిభాగాల తయారీలో మంచి పేరుంది. ఈ సంస్థ దేశంలో విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్ రేసులో ఉన్నాయి. ఏపీ ప్రభుత్వం పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను అందించడానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ కొత్త పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి వచ్చే నెలలో ఈ ప్రాజెక్టుపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు. ఎంబ్రాయెర్ సంస్థ విమానాలు, విమానాల విడిభాగాల తయారీలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ఏపీలో ఈ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వస్తే కనుక.. అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందట. ఈ విమానాల తయారీ కేంద్రం కోసం అనంతపురం జిల్లాలో ఖాళీగా ఉన్న భూములను కేటాయించాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని విమానల తయారీ కేంద్రంగా మార్చాలని ప్లాన్ చేశారు. బెంగళూరుకు సమీపంలో ఉండటం ఈ ప్రాంతానికి ఒక పెద్ద ప్లస్ పాయింట్. సరళ ఏవియేషన్స్ సంస్థ ఎలక్ట్రికల్ వర్టికల్ టేకాఫ్‌కు ల్యాండింగ్ విమానాలను (రూ. 1,300 కోట్ల పెట్టుబడితో 500 ఎకరాల్లో 6 సీటర్ల విమానాలు) తయారు చేయనుంది. వీటిని 'స్కై ఫ్యాక్టరీ'గా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. 2029 నాటికి ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్లాన్ చేశారు. అదానీ గ్రూప్, బ్రెజిలియన్ ఏరోనాటిక్స్ మేజర్ ఎంబ్రేర్ మంగళవారం వ్యూహాత్మక సహకారాన్ని ప్రకటించాయి. భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో ఒకటి. ఈ భాగస్వామ్యం చిన్న, మధ్య తరహా నగరాలకు ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మంగళవారం దేశ రాజధానిలోని పౌర విమానయాన మంత్రిత్వ శాఖలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ భాగస్వామ్యాన్ని ప్రకటించారు. పౌర విమానయాన కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.. ఈ సహకారం కేవలం ప్రాంతీయ విమానాలను అసెంబుల్ చేయడానికి మాత్రమే పరిమితం కాదని అన్నారు. ప్రగతిశీల సాంకేతిక బదిలీ, నైపుణ్య అభివృద్ధి, బలమైన సప్లయ్ చైన, భారతదేశాన్ని ప్రాంతీయ విమానాలకు నమ్మకమైన తయారీ కేంద్రంగా మార్చడం కూడా ఇందులో ఉన్నాయి. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ మాట్లాడుతూ.. ఎంబ్రేర్ సహకారంతో భారతదేశంలో ప్రాంతీయ విమానాల తయారీ కర్మాగారం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంబ్రేర్ 150 సీట్ల వరకు వాణిజ్య జెట్‌లను తయారు చేస్తుంది. ఈ భాగస్వామ్యంతో భారత విమానయాన రంగంలో ఇప్పటికే బలమైన ఉనికిని కలిగి ఉన్న అదానీ గ్రూప్, భారతదేశంలో విమానాల తయారీ రంగంలోకి ప్రవేశిస్తోంది. దేశంలో ప్రాంతీయ రవాణా విమానాల కోసం రెండు కంపెనీలు తుది అసెంబ్లీ లైన్ ను కూడా ఏర్పాటు చేస్తాయి. అయితే ఈ సంస్థ తమ తయారీ యూనిట్‌లను ఆంధ్రప్రదేశ్, గుజరాత్ లలో పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భోగాపురంలో ఎంబ్రాయర్ ఫ్యాక్టరీ పెట్టాలని ఏపీ ప్రయత్నం చేస్తోంది. భూమి, మౌలికసదుపాయాలను కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంబ్రాయర్ కి ఆఫర్ ఇచ్చింది. భోగాపురంలో ఎంఆర్ ఓ, ఏరోస్పేస్ క్లస్టర్లను కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఏపీ ప్రభుత్వం శ్రీ సత్యసాయి జిల్లాలో ఒక భారీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ పార్కు కోసం మొత్తం 20 వేల ఎకరాల భూమిని కేటాయించనున్నారు. ఇందులో ఇప్పటికే లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు కేటాయించిన 8,844 ఎకరాల భూమి కూడా ఉంది. ఈ భూములను కొడికొండ చెక్‌పోస్టు దగ్గర అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పరిధిలో ఉన్న భూములను వెనక్కు తీసుకునే ప్రయత్నాలు విజయవంతమయ్యాయని తెలుస్తోంది.. ఈ భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇప్పటికే చుట్టుపక్కల మండలాల్లో భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## బంగారం ధర ఆల్‌టైమ్ రికార్డ్.. 10 గ్రాములు ఏ రూ.1,78,850



**హైదరాబాద్ పెన్ పవర్:**గోల్డ్ లవర్స్‌కు ఊహించని షాక్ తగులుతోంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా బంగారం ధరలు మునుపెన్నడూ లేని విధంగా భారీగా పెరిగి ఆల్ టైమ్ రికార్డుకు చేరాయి. తాజాగా హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఇవాళ బంగారం ధర భారీగా పెరిగి ఆల్ టైమ్ రికార్డుకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.11,770 పెరిగి రూ.1,78,850కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.10,800 ఎగబాకి రూ.1,63,950 పలుకుతోంది. మరోవైపు కేజీ వెండి ధర రూ.4,25,000 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా4 గ్లోబల్ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5,500 డాలర్ల మార్కును దాటింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితి వల్ల ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపడంతో బంగారం ధరలు విపరీతంగా పెరిగాయి. ఇక భారత్‌లో పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ స్థాయిలో ధరలు పెరగడం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. కేవలం బంగారం ధర మాత్రమే కాకుండా, అందుకు తోడు 3 శాతం జీఎస్టీ, షాపుల వారీగా తయారీ కూలి అదనంగా ఉండటంతో వినియోగదారులపై తీవ్ర భారం పడుతోంది.

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ



**హైదరాబాద్ పెన్ పవర్:**అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ ప్రభావంతో భారత కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇవాళ ఇంట్రాడే ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 92 స్థాయిని తాకి చరిత్రలోనే సరికొత్త రికార్డు పతనాన్ని నమోదు చేసింది. భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ నిధులను భారీగా వెనక్కి తీసుకుంటున్నారు. కేవలం ఈ నెలలోనే రూ.వేల కోట్ల విలువైన షేర్లను విక్రయించడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు బ్యారెల్‌కు 65-67 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి. చమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువ డాలర్లను ఖర్చు చేయాల్సి రావడంతో రూపాయి విలువ పడిపోతోంది. దిగుమతిదారులు, బ్యాంకుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం, అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలోపేతం కావడం రూపాయి పతనానికి కారణం అయ్యాయి. రూపాయి పతనం కేవలం సామాన్యులపై కూడా ప్రభావం చూపనుంది. మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ యంత్రాల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇంధన ధరలపై ప్రభావంతో రవాణా ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణానికి దారితీసే అవకాశం ఉంది. అదేవిధంగా విదేశాల్లో చదువుకునే విద్యార్థులు చెల్లించే ఫీజులు భారం కానున్నాయి. అలాగే విదేశీ పర్యటనలు ప్లాన్ చేసే వారికి ఖర్చులు పెరగనున్నాయి.

## యూఎస్ ఫెడ్ కీలక నిర్ణయం..




**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశం ముగిసింది. 2026 సంవత్సరానికి సంబంధించి కీలక వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథంగా కొనసాగించాలని ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ నిర్ణయించింది. గతేడాది చివరలో వరుసగా మూడు సార్లు రేట్లను తగ్గించిన ఫెడ్, ప్రస్తుతం బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 3.50 శాతం నుంచి నుండి 3.75 శాతంతో స్థిరంగా కొనసాగించింది. మెజారిటీ సభ్యులు ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వడ్డీ రేట్లలో మార్పులు చేయకూడదని ఓటు వేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మాట్లాడుతూ.. ఫెడ్ నిర్దేశించుకున్న 2 శాతం ద్రవ్యోల్బణ లక్ష్యం కంటే ప్రస్తుత గణాంకాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఇది పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వేచి చూడాలని ఫెడ్ నిర్ణయించిందని అన్నారు. అమెరికా ఫెడ్ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపనుంది. రేట్ల తగ్గింపు లేకపోవడంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లులు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి నిధులను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీలపై ఒత్తడి పడనుంది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవడంతో అమెరికా కంపెనీలు తమ టెక్నాలజీ ఖర్చులను నియంత్రిండంతో మన ఐటీ కంపెనీల ఆదాయంపై ప్రభావం చూపనుంది. ఇక బంగారం ధరలు స్థిరంగా కొనసాగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

## మరోసారి రిలయన్స్ గ్రూప్ ఆస్తులను జప్తు చేసిన ఈడీ

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానికి చెందిన రిలయన్స్ గ్రూప్, దాని కంపెనీలపై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా తాజాగా ఈడీ 1,885 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్టు బుధవారం ప్రకటాలో వెల్లడించింది. తాజా చర్యలతో, ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ ఇప్పుడు సుమారు రూ. 12,000 కోట్లకు చేరింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ నివారణ చట్టం (పీఎంఎల్ఏ) కింద నాలుగు వేర్వేరు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈడీ ఓ ప్రకటనలో తెలిపింది. జప్తు చేసిన ఆస్తులలో బ్యాంక్ బ్యాలెన్స్, రిసీవబుల్స్, అన్‌క్యూటెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, యెస్ బ్యాంక్ మోసంతో పాటు రిలయన్స్ కమ్యూనికేషన్ లిమిటెడ్‌కు సంబంధించిన ఆరోపణల కేసులలో ఈ జప్తులు జరిగాయి. తాజా జప్తులో బీఎస్ఈఎస్ యమునా పవర్, బీఎస్ఈఎస్ రాజధాని పవర్, ముంబై మెట్రో వన్ ప్రైవేట్‌లో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఉన్న వాటాలు కూడా ఉన్నాయని ఈడీ తెలిపింది. అలాగే, వాల్యూ కార్ప్ ఫైనాన్స్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్ వద్ద ఉన్న రూ. 148 కోట్ల బ్యాంకు డిపాజిట్లు, రూ. 143 కోట్ల వసూలు చేయాల్సిన మొత్తం, కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అంగరై సేతురామన్ పేరు మీద ఉన్న ఒక నివాస గృహం, మరో సీనియర్ ఉద్యోగి పునీత్ గార్గ్ భార్యకు చెందిన షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లను కూడా జప్తు చేసినట్లు ఈడీ పేర్కొంది.

# భారతీయ వాహనాలపై 50 శాతం సుంకం విధించే యోచనలో దక్షిణాఫ్రికా

**హైదరాబాద్ , జనవరి 28:** పెన్ పవర్:భారత్, చైనా నుంచి దిగుమతి చేసుకునే వాహనాలపై 50 శాతం వరకు సుంకాలను విధించే అంశాన్ని దక్షిణాఫ్రికా పరిశీలిస్తున్నట్లు సమాచారం. పెరుగుతున్న వాహనాల దిగుమతుల వల్ల స్థానిక ఆటో తయారీ పరిశ్రమపై పడుతున్న ప్రభావాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నిర్ణయం ఆ దేశ ట్రేడ్, ఇండస్ట్రీ, కాంపిటీషన్ డిపార్ట్‌మెంట్ సమీక్ష పరిధిలో ఉంది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, కీలక ఎగుమతి మార్కెట్లుగా ఉన్న భారత్, చైనా నుంచి వాహనాలను నిలువరించేలా మార్గాలను గుర్తించేందుకు ఒక అంతర్గత సమీక్ష జరిగింది. ఈ రెండు దేశాల నుంచి జరిగే దిగుమతులు దక్షిణాఫ్రికా వాహన పరిశ్రమ పోటీతత్వాన్ని దెబ్బతీస్తున్నాయని అక్కడి అధికారులు భావిస్తున్నారు. డిపార్ట్‌మెంట్ అధికారులు అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశాలైన భారత్, చైనాకు సంబంధించి ప్రపంచ వాణిజ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా దిగుమతి సుంకాలను పరిశీలిస్తోంది. ఇటీవలి డేటా ప్రకారం, భారత్, చైనా దక్షిణాఫ్రికాకు రెండు అతిపెద్ద వాహన ఎగుమతిదారులుగా అవతరించాయి. 2024లో మొత్తం వాహన దిగుమతులలో భారత్ 53 శాతం, చైనా 22 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈ స్థాయి దిగుమతుల వల్ల స్థానిక వాహన పరిశ్రమకు నష్టాలు ఎదురవుతాయని దక్షిణాఫ్రిక అభిప్రాయపడింది. అంతేకాకుండా, గత నాలుగేళ్ల కాలంలో చైనా నుంచి ఆ దేశానికి ఎగుమతులు 368 శాతం, భారత్



నుంచి 135 శాతం పెరిగాయి. ఇది ఆ దేశ వాహన పరిశ్రమలో ఎంట్రీ-లెవెల్ విభాగంలో అత్యధిక పోటీ ఏర్పడింది. అందుకే పన్నుల ద్వారా భారత్, చైనా వాహనాల దిగుమతులని నియంత్రించి, స్థానిక పరిశ్రమను

# మానవతామూర్తి మహాత్మ గాంధీ

**హైదరాబాద్ పెన్ పవర్:**20వ శతాబ్దపు ప్రపంచ మేటి ఘనుల్లో ప్రముఖమైన మహాశక్తిగా నేటికీ నిలుస్తున్నారు మహాత్మాగాంధీ. భారతీయులకే కాకుండా నెల్సన్ మండేలా, లూథర్ కింగ్ జూనియర్ లాంటి అనేక విశ్వ విఖ్యాత నాయకులకు సహితం ప్రేరణగా నిలిచిన మోహన్‌దాస్ కమర్‌చంద్ గాంధీ జీవితం నేటికీ మానవాళికి దారి దీపంగా నిలుస్తున్నది. భారతీయ లాయర్, రాజకీయ నాయకులు, భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు, సామాజిక కార్యకర్త, సాహితీవేత్త, అతి సాధారణ జీవనశైలిని పరిచయం చేసిన మహా నేత అయిన గాంధీ అహింస అనే పదునైన ఆయుధాన్ని ప్రయోగించి బ్రిటీష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించి భరతమాతకు స్వేచ్ఛను ప్రదానం చేశారు. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిందనే సంతోషంతో పాటు దేశ విభజన గాయాలనతో బాధ పడుతున్న వేళ 30 జనవరి 1948న హిందుత్వవాది నాథురామ్ వినాయక్ గాడ్సె తూటాలకు తుది శ్వాస విడిచారు. మహాత్మాగాంధీ వర్ధంతి 30 జనవరి రోజున దేశవ్యాప్తంగా "అమర వీరుల దినం (మార్టిర్స్ డే)" లేదా "గాంధీ పుణ్య తిథి" లేదా "షహీది దివస్"గా పాటించడం ఆనవాయితీగా మారింది. గాంధీ పట్ల అభిమానంతో రవీంద్రనాథ్ టాగూర్ తొలిసారి "మహాత్మా" అని పిలవడంతో వారి పేరు మహాత్మాగాంధీ అని, "జాతి పిత"అని, ప్రేమతో "బాపు" అని నోరారా పిలుచుకునే గాంధీ జీవితం భరతమాత సేవకు అర్పించారు. అహింస, ఏకత, మానవీయత లాంటి సమోన్నత విలువలను మానవాళికి పరిచయం చేసిన అసమాన మానవతీమూర్తి మన బాపు. గుజరాత్ రాష్ట్ర పోర్బందర్ పట్టణంలో 02 అక్టోబర్ 1869న జన్మించిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ లండన్‌లో బారిస్టర్ పట్టాను పొంది 21 ఏండ్ల పాటు దక్షిణ ఆఫ్రికాలో గడిపారు. అక్కడ నెలకొన్న జాతి వివక్ష, అసమానతలను చూసిన చలించారు. దక్షిణ ఆఫ్రికా నుంచి 1915లో భారత్‌కు తిరిగి వచ్చి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ ఆ ఉద్యమ స్వరూపాన్ని ఆసాంతం మార్చి వేసి బ్రిటీష్ తెల్ల దొరల గుండెల్లో ధడ పుట్టించారు. అహింస అనే అత్యంత పదునైన ఆయుధాన్ని ప్రయోగించి ఉద్యమాన్ని కొనసాగిస్తూనే, వలస పాలకులతో చర్చలు జరుపుతూ, చివరకు బ్రిటీష్ పాలనకు అంతం చూపగలిగారు. సత్యం, అహింస, క్షమాగుణం, నిస్వార్థ సేవ, సానుకూల భావనలు, మానసిక దృఢత్వం, త్యాగం, సత్యాగ్రహాలను పునాదులుగా చేసుకొని ఉద్యమాగ్నికి ఆజ్యం పోశారు. తన జీవిత చరిత్రను "మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రుథ్" అనే ఆత్మకథను రాసి భవిష్యత్తు తరాలకు సన్మార్గం చూపుతున్నారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగం, ఖాదీ ఉద్యమం, సహాయనిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా, దండి మార్చ్ లాంటి అనేక రకాలైన ఉద్యమాలను నడిపి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టారు. క్రమశిక్షణ, శాంతి, సమానత్వం, నైతికత, మానవీయ విలువలను శాశ్వత ఆభరణాలు ధరించి జీవితాన్ని కొనసాగించిన గాంధీ మనకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నారు. వారి ఆదర్శాల తరంగాలు భారత్‌లో మాత్రమే కాకుండా ప్రపంచమంతటా వ్యాపించడం వాస్తవం, అనుసరణీయం. మానవీయ విలువ నిలువెత్తు రూపం మహాత్మాగాంధీ. చొక్కా తొడగడం వదిలి విలువల వస్త్రాలను ధరించి సాదాసీదా జీవితాన్ని మహోన్నతంగా గడిపిన గాంధీ ఐన్‌స్టీన్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త చేత మహోన్నతుడిగా కొనియాడబడడం హర్షదాయకం, ఆశ్చర్యకరం. గాంధీ చూపిన బాటలో నడుస్తూ, సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని నిలుపుకుంటూ, విలువల పాటించి వ్యక్తిగతంగా ఎదుగుతూ, దేశాభివృద్ధికి సహకరిద్దాం, 'భారతమాతా కీ జై' అంటూ నినదిద్దాం.

# కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

**హైదరాబాద్ పెన్ పవర్:**కుష్టు వ్యాధి బారిన పడిన ప్రజల సంరక్షణ కోసం మహాత్మా గాంధీ చేసిన నిస్వార్థ ప్రయత్నాలు, పడిన శ్రమను గుర్తుగా ఆయన వర్ధంతి అయిన 30 జనవరిని కుష్టు వ్యాధి నివారణ దినోత్సవంగా జరుపు కుంటారు. కుష్ఠు వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స చేయించు కోకపోతే అది పెరిగి చర్మానికి, నరాలకు, కాళ్లు, చేతులు, కళ్లకు హాని కలిగిస్తుంది. ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుంది. చాలా నెమ్మదిగా వ్యాధి లక్షణాలు బహిర్గత మవుతాయి. ప్రారంభ దశలో గుర్తించి మల్టీ డ్రగ్ థెరపీ తీసుకుంటే వ్యాధి అంగ వైకల్యానికి దారి తీయదు. చికిత్స పూర్తయిన, చికిత్స తీసుకుంటున్న రోగుల్లో అంగవైకల్యం ఉంటే శస్త్ర చికిత్స ద్వారా సరిచేయవచ్చు. ఈ వ్యాధిని రెండు రకాలుగా గుర్తించి వాటికి వైద్యాన్ని అందిస్తారు. మొదటగా ఎంబీ (మల్టీ బ్యాచ్‌లరీ) అంటే మచ్చల సంఖ్య, స్పర్శ కోల్పోయిన వారికి ఏడాదిపాటు చికిత్స అందిస్తారు. రెండోది పీబీ (పాసి బ్యాచులరీ) ఇది కూడా మచ్చల సంఖ్య, స్పర్శ కోల్పోయిన వారికి ఆరు నెలలపాటు చికిత్స అందిస్తారు. 20శాతం మానవుడికి ఇది అంటువ్యాధి. ఈ వ్యాధి కేవలం బ్యాక్టీరియా ద్వారానే (దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు) మాత్రమే సోకుతుంది. ఈ వ్యాధి లక్షణాలు బయట పడటానికి 6 నెలల నుంచి 20ఏండ్ల సమయం పడుతుంది. ఈ సమయాన్ని ఇంక్‌పేషెంట్ పీరియడ్ అని అంటారు. వ్యాధి అభివృద్ధి లక్షణాలలో నరాల, శ్వాసనాళ, చర్మం, కళ్ళు క్షీణించడం ఉంటాయి, దీనివల్ల నొప్పి తెలుసుకునే సామర్థ్యం కోల్పోవడం, పునరావృత గాయాల కారణంగా అంత్య భాగాల పూర్తిగా దెబ్బతింటాయి. బలహీనత మరియు చూపు పేలవంగా ఉంటుంది. శరీరంపై పాలిపోయిన లేదా రాగి రంగు మచ్చలు, మచ్చలపై స్పర్శ లేక పోవడం , నొప్పి తెలియకుండా ఉండడం, పాదాలు, చేతులు, వేళ్ల తిమ్మిర్లు ఉన్నా, చర్మం దళసరిగా మారడం, చర్మం.. ముఖ్యంగా ముఖం నూనె రాసినట్లుగా నిగనిగలాడుతూ కనిపించడం ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి. కుష్టు వ్యాధి వంశపారంపర్యం కాదు. ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు, వయస్సు, లింగ భేదం లేదు. 1940లో కుష్టు వ్యాధి నివారణకు డప్సోన్ కనుగొనబడే వరకు కుష్టు వ్యాధి చికిత్స కోసం చౌల్మూగ్ర నూనెను వాడేవారు.1970లో కుష్టు వ్యాధి నయంచేయడానికి రిఫాంపిసిన్, చలోఫజీమైన్ మరియు డప్సోన్‌లతో కలసి ఉన్న బహుళ ఔషధ చికిత్స కనుగొన బడినప్పటికీ, 1982నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుల మేరకు విస్తృతంగా వాడుకలోకి వచ్చింది. 1995 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రెండునుంచి మూడు మిలియన్ల మంది ఈ వ్యాధికి గురై, వికలాంగులుగా మారినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు పేర్కొంటు న్నాయి. గత రెండున్నర దశాబ్దాల కాలంలో సుమారు 15 మిలియన్ల మంది వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసి వ్యాధిని తగ్గించారు. ముదిరిన స్థాయిలో ఉండే కుష్టు వ్యాధి గురించి ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా అనే రకాల అపోహలు ఉన్నాయి. వీటిని ఏజ్ ఓల్డ్ సోషల్ స్టిగ్మా అని కాని లెప్రసీ స్టిగ్మా అని కాని వ్యవహరిస్తుంటారు. ఈ స్టిగ్మా కారణంగానే బాధితులు తొలి దశలోనే స్వయంగా చికిత్సకు వైద్యుల వద్దకు రావడానికి జంకుతుంటారు. అందుకే ప్రజలలో కుష్టు వ్యాధిపై అవగాహన పెంపొందించాలి. వ్యాధి బారినపడ్డ వారికి అవసరమైన మేరకు సాధారణ మరియు ఉచిత చికిత్స అందించడానికి చర్యలు గైకొనాలి. వ్యాధి బారిన పడిన వ్యక్తికి చర్మంపై వచ్చే పుళ్ళు మరియు నరాల బలహీనత వల్ల భౌతిక లోపాల విషయంలో మానసిక ధైర్యం పెంపొందించడానికి కృషి చేయాలి. వ్యాధి బారిన పడిన వారందరికీ అవసరమైన శ్రద్ధ, చికిత్సతో పాటు పునరావాసం కల్పించే చర్యలు తీసుకోవాలి. కుష్టు వ్యాధి నివారణలో భారతదేశం విజయవంతమైన కృషి చేస్తున్నది. 1955లో జాతీయ కుష్టు వ్యాధి నియంత్రణ కార్యక్రమం, 1983లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమం ప్రారంభించింది. 1983 నుండి దశల వారీగా బహుళ ఔషధ చికిత్స నిర్వహిస్తూ, 2005లో 10000 మంది జనాభాకు 0.95 మంది చొప్పున మాత్రమే ఉండేట్టుగా 31 డిసెంబర్ 2005 నాటికి కుష్టు వ్యాధి నివారణ జరిగింది. కుష్టు వ్యాధిని, 10000 మంది జనాభాకు ఒకరి వరకు తగ్గించడం ప్రపంచ వ్యాప్తంగా అంగీకరించారు. మార్చి 2011లో ప్రాబల్యం రేటు 10000 జనాభాకు నుంచి 0.69 వద్ద నిలిచింది.

# బడ్జెట్‌లో దీర్ఘకాలిక ప్రణాళికపై దృష్టి పెట్టాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచం 'అత్యంత ప్రమాదకరమైన సందర్భం'లో ఉన్నందున, రాబోయే బడ్జెట్ భారత ఆర్థికవ్యవస్థను మరింత పటిష్టంగా, స్వయం సమృద్ధిగా మార్చేలా ఉండాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో వృద్ధిని వేగవంతం చేయడానికి దీర్ఘకాలిక ప్రణాళికతో అనుసంధానం చేయాలని రాజన్ సూచించారు. బుధవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. గతంలో దేశానికి పంచవర్ష ప్రణాళికలు ఉండేవి, అయినప్పటికీ దేశ బడ్జెట్ వాటితో సరిగ్గా అనుసంధానం కాలేదు. కాబట్టి ఈసారి 2026-27 కేంద్ర బడ్జెట్‌ను దీర్ఘకాలిక దార్శనికత, ప్రణాళికతో అనుసంధానం చేయాలని నేను భావిస్తున్నాను. ఒక ఆర్థికవ్యవస్థగా మరింత పటిష్టంగా, స్వయం సమృద్ధిగా మారాలి, అదే సమయంలో వేగంగా వృద్ధి చెందాలి, దానివల్ల ఇతర దేశాలన్నీ భారత్‌తో స్నేహం చేయాలనుకుంటాయి.

దీనికి చాలా కృషి చేయాల్సి ఉంది, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే తదుపరి బడ్జెట్ మనల్ని ఆ దిశగా తీసుకువెళ్తుందని నేను ఆశిస్తున్నానని ఆయన వివరించారు. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి అస్థిరంగా మారిన భౌగోళిక రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడానికి సంస్కరణ చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రఘురామ్ రాజన్ పైవ్యాఖ్యలు చేశారు. ప్రపంచంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థ రెండింటికీ ఇది 'అత్యంత ప్రమాదకరమైన సమయం' అని రాజన్ అన్నారు.

## అమెజాన్‌లో 16,000 ఉద్యోగాల కోత




**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా ఇకామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్, ప్రపంచవ్యాప్తంగా 16,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. గత అక్టోబరులో 14,000 మందిని తొలగించిన ఈ సంస్థ, రాబోయే మూడు నెలల్లో 16,000 మందిని తొలగించేందుకు సిద్ధమవుతోంది. కార్పొరేట్ ఉద్యోగులకు బదులు జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించడం వల్లే, ఈ తొలగింపులు చేపడుతున్నట్లు అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గాలెట్టీ తెలిపారు. కొవిడ్-19 పరిణామాల్లో నియమించుకున్న ఉద్యోగులనూ తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వెబ్ సర్వీసెస్, రిటెయిల్, ప్రైమ్ వీడియో, మానవ వనరుల వంటి వివిధ కార్పొరేట్ రోల్స్‌ల్లో ఉన్న 30,000 మంది ఉద్యోగులను తీసివేయాలన్నది సంస్థ లక్ష్యం. 2023లో సంస్థ 27,000 మంది ఉద్యోగులను తొలిగించాక, మళ్లీ అధికంగా కోత విధిస్తోంది ఇప్పుడే. సంస్థలోనే 90 రోజుల్లోపు కొత్త రోల్ కనుగొనడానికి అమెరికాలోని ఉద్యోగులకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. గడువులోపు కొత్త ఉద్యోగాన్ని ఎంచుకోలేకపోతే, పరిహారం చెల్లిస్తారు. కొత్త ఉద్యోగం పొందేందుకు సాయం చేయడంతో పాటు ఆరోగ్య బీమా ప్రయోజనాలను ఆఫర్ చేస్తామన్నారు.

## దక్షిణాసియాకు 3,300 విమానాలు అవసరం

**హైదరాబాద్ పెన్ పవర్:**రాబోయే రెండు దశాబ్దాల్లో భారతదేశంతో పాటు దక్షిణ ఆసియా ప్రాంతంలో విమాన ప్రయాణికుల రద్దీ అత్యంత వేగంగా పెరగనుందని అంతర్జాతీయ విమానయాన దిగ్గజం బోయింగ్ అంచనా వేసింది. బోయింగ్ తన ‘కమర్షియల్ మార్కెట్ అవుట్‌లుక్’ నివేదికను బుధవారం వింగ్స్ ఇండియా ప్రదర్శనలో విడుదల చేసింది. ఆ వివరాలు.. 2044 నాటికి దక్షిణాసియాలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి సుమారు 3,300 కొత్త విమానాలు అవసరమవుతాయని వెల్లడించింది. పెరుగుతున్న మధ్యతరగతి జనాభా, ఆర్థిక విస్తరణ, విమానాశ్రయాల మౌలిక సదుపాయాల కల్పనలో వస్తున్న మార్పులు విమానయాన రంగాన్ని ఏటా 7 శాతం పెరిగేలా చేస్తోందని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ నాయుడు అంచనా వేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 795 విమానాలు ఉండగా, ఇవి రాబోయే 20 ఏండ్లలో దాదాపు నాలుగు రెట్లు పెరిగి 2,925కు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో 90 శాతం విమానాలు స్వల్ప, మధ్యస్థ దూర ప్రయాణాలకు అనుకూలమైన సింగిల్-ఐసిల్ రకానికి చెందినవే ఉంటాయని తెలిపింది. ఈ భారీ విస్తరణకు తోడుగా విమానయాన రంగంలో మెయింటెనెన్స్, శిక్షణ వంటి సేవల కోసం 195 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయన్నారు. అలాగే సుమారు 1,41,000 మంది పైలట్లు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బందికి కొత్తగా ఉపాధి లభిస్తాయని అంచనా వేశారు.

## వెనిజులాకు అమెరికా కొత్త బెదిరింపులు



**హైదరాబాద్ పెన్ పవర్:**వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్భంధించి, ఆపహరించిన తరువాత కూడా ఆ దేశంపై అమెరికా బెదిరింపులను ఆపడం లేదు. వెనిజులాలోని నూతన నాయకత్వం తమ ఆదేశాల ప్రకారం నడుచుకోకపోతే ఆ దేశంపై కొత్తగా సైనిక చర్య తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని అమెరికా తాజాగా హెచ్చరించింది. ఈ హెచ్చరికలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చేశారు. మదురో నిర్భంధం తరువాత కూడా అవసరమైతే వెనిజులాలో అదనపు బలగాలను ప్రయోగించడానికి ట్రంప్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. వెనిజులా కొత్త నాయకత్వం తమ వినడం కోసం వినియోగించే ఇతర పద్ధతులు విఫలమైతే బలప్రయోగానికి అమెరికా సిద్ధంగా ఉందని రూబియో స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుతం వెనిజులాపై అమెరికా యుద్ధం చేయడం లేదని, అక్కడ అమెరికా సైనికులు లేరని అన్నారు. వెనిజులాలో శాంతిభద్రతలకు సహాయం చేయడానికి చేసిన ఆపరేషన్‌గా తమ దాడిని రూబియో సమర్థించుకున్నారు. వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌తో సంబంధాలను సాధారణ పరిస్థితికి తీసుకొనిరావడానికి అమెరికా అధికారులు కృషి చేస్తున్నారని, అలాగే, ట్రంప్ డిమాండ్లను ఆమోదించడం తప్ప రోడ్రిగ్జ్‌కు వేరే ఇతర మార్గంలేదని రూబియో హెచ్చరింపు ధోరణిలో తెలిపారు. మదురోకు పట్టిన గతి గురించి రోడ్రిగ్జ్‌కు బాగా తెలుసునని, అమెరికా లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ఆమె సహకరిస్తారని నమ్ముతున్నట్లు రూబియో చెప్పారు. అమెరికా డిమాండ్లల్లో వెనిజులా ఇంధన రంగాన్ని అమెరికా కంపెనీలకు అప్పగించడం, వెనిజులాకు వచ్చిన చమురు ఆదాయాన్ని అమెరికన్ వస్తువులను కొనుగోలు చేయడానికి ఉపయోగించడం, క్యూబాకు సబ్సిడీతో కూడిన చమురు ఎగుమతులను నిలిపి వేయడం..వంటివి ఉన్నాయని రూబియో తెలిపారు.

## అమెరికా ‘కలలు కల్లోలం’

**హైదరాబాద్ పెన్ పవర్:**వచ్చే సంవత్సరం వరకూ హెచ్-1బీ వీసా నియామ కాలను నిలిపివేయాలని అమెరికాలోని టెక్సాస్ రాష్ట్ర గవర్నర్ గ్రెగ్ అబ్బాట్ మంగళవారం యూనివర్సిటీలు, ప్రభుత్వ ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులను నియమించుకోవడానికి యాజమాన్యాలు హెచ్-1బీ వీసా పిటిషన్లను ఉపయోగించుకుంటాయి. టెక్సాస్ రాష్ట్రంలో వేలాది మంది హెచ్-1బీ వీసాదారులు నివసిస్తున్నారు. వీసా కార్యక్రమాన్ని ప్రక్షాళన చేయాలని డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు గవర్నర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తక్కువ వేతనాలతో పనిచేసేందుకు అంగీకరించే విదేశీ ఉద్యోగులు ఈ వీసా కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటూ అమెరికన్ల ఉద్యోగావకాశాలను దెబ్బ తీస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అయితే ప్రపంచంలోని వివిధ దేశాలలోని నిపుణులను ఆకర్షించేందుకు, వారికి నిర్దిష్ట విధులను అప్పగించేందుకు, ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ‘రాష్ట్ర ప్రభుత్వం ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. పన్ను చెల్లింపులదారుల డాలర్లతో కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను ముందుగా టెక్సాస్ వాసులతోనే భర్తీ చేయాలి’ అని అబ్బాట్ తన ఆదేశాలలో పేర్కొన్నారు. అబ్బాట్ తాజా ఆదేశాల నేపథ్యంలో?అమెరికాలో ఉద్యోగాలు చేయాలని ఉవ్విళ్లూరే విదేశీయులకు తీవ్ర ఆశాభంగం ఎదురైంది. విదేశీ ఉద్యోగుల నియామకాలపై విధించిన నిషేధం 2027 మార్చి 31 వరకూ అమలులో ఉంటుంది. అయితే టెక్సాస్ వర్క్‌ఫోర్స్ కమిషన్ అనుమతితో పరిమితంగా కొన్ని నియామకాలు చేపట్టవచ్చు. అమెరికా వీసా కార్యక్రమం దుర్వినియోగానికి గురవుతోందని, కాబట్టి కొత్త పిటిషన్లను అనుమతించవద్దని అబ్బాట్ తన ఆదేశాలలో స్పష్టం చేశారు. అమెరికా ఉద్యోగాలను అమెరికన్లే చేయాలన్నది తన అభిమతమని ఆయన తెలిపారు.

## అమెరికాలో మంచు తుపాను బీభత్సం



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలో మంచు తుపాను బీభత్సం సృష్టిస్తోంది. ఈ తుపాను ప్రభావంతో భారీగా మంచు కురువడం, గడ్డకట్టే ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ తుపాను కారణంగా అమెరికాలోని 14 రాష్ట్రాల్లో 38 మంది మృతి చెందారు. ఈ నెల 23 నుంచి మంచు తుపాను అమెరికాలో తన ప్రభావాన్ని చూపిస్తోంది. భారీగా కురుస్తున్న మంచుతో రాకపోకలు స్థంభించిపో యాయి. భారీ సంఖ్యలో విమానసర్వీసులు రద్దు చేశారు. విద్యుత్‌కు, మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనేక ఇళ్లు మంచులో కూరుకునిపోయాయి. అనేక మంది నిరాశ్రయులయ్యారు. టెన్నెస్సీలోని నాష్‌విల్లేలో సుమారు 7 లక్షల జనాభా ఉండగా, వీరిలో రెండు లక్షల మంది నిరాశ్రయులయ్యారని అంచనా. న్యూయార్క్ నగరంలోనే పది మంది మరణించారు. టెక్సాస్‌లో ముగ్గురు మంచు చెరువులో పడి మరణించారు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించేందుకు అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది విరామం లేకుండా పని చేస్తున్నారు. ఫిబ్రవరి 1 వరకూ మంచు తుపాను ప్రభావం చూపిస్తుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మంచు తుపాను గురించి న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ మాట్లాడుతూ నగరంలో గత ఎనిమిదేళ్లలో ఎన్నడూలేనంతగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెప్పారు.

# మహాత్ముని హత్యకు నేపథ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత జాతిపిత మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో సార్లు నిరాహార దీక్షలు చేపట్టారు. అయితే గాంధీజీ స్వతంత్రం వచ్చిన తరువాత నిరాహారదీక్ష కూడా చేసారు. ఆ నిరాహార దీక్షనే మహాత్ముని హత్యకు కారణం అవుతుందని ఎవరూ ఊహించి ఉండరు. స్వాతంత్ర్యానంతరం గాంధీ ప్రయత్నాలు హిందూ - ముస్లిం విద్వేషాలను నివారించడానికి పరిమిత మయ్యాయి. ముస్లిం నాయకుడైన మహమ్మద్ ఆలీ జిన్నాను ప్రధాని మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ - ముస్లింల మధ్య మరింత చిచ్చురాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌లు గాంధీ విధానాన్ని వ్యతిరేకించారు. విభజన జరిగితేనే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనో..అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఇరకాటంలో పడేసింది. 1947 ఆగస్టు 15న దేశమంతా సంబరాలు జరుపుకుంటుంటే...గాంధీ మాత్రం కలకత్తాలోని ఒక హరిజనవాడను శుభ్రం చేస్తూ గడపడం విశేషం. దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యమైన రీతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు.ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలులలో పెద్దఎత్తున సంభవించిన వలసల వల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ - పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది. దీనికి తోడు విభజన ఒప్పందం ప్రకారము పాకిస్తానుకు ఇవ్వవలసిని 55 కోట్లు రూపాయలను ఇవ్వడానికి భారత ప్రభుత్వం నిరాకరించింది. ఆ డబ్బు భారతదేశంపై పాకిస్తాన్ యుద్ధం చేస్తే యుద్ధానికి ఉపయోగ పడుతుందని సర్దార్ పటేల్ వంటి నాయకుల అభిప్రాయం. కాని అలా కాకుంటే పాకిస్తాన్ మరింత ఆందోళన చెందుతుందనీ, దేశాల మధ్య విరోధాలు ప్రబలి మత విద్వేషాలు సరిహద్దులు దాటుతాయనీ, అంతర్యుద్ధానికి దారితీస్తుందనీ గాంధీజీ అభిప్రాయం. జనవరి 12, 1948. ఆ రోజు సాయంత్రం తన రోజువారీ ప్రార్థన సమావేశంలో, మరుసటి రోజు ఉదయం నుండి ఆమరణ ఉపవాసం కూర్చుంటానని గాంధీ ప్రకటించారు. 1948 జనవరి 13న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు గాంధీజీ రెండు డిమాండ్లతో నిరాహార దీక్షలో కూర్చున్నారు. మొదటి డిమాండ్ పాకిస్తాన్‌కు భారత్ విభజన ఒప్పందంకు సంబంధించిన మిగిలిన రూ.55 కోట్లు ఇవ్వాలి. రెండోది దిల్లీలో ముస్లింలపై జరుగుతున్న దాడులు ఆగాలి. దీనికి ముందు గాంధీ తన రోజువారీ పనులను పూర్తి చేశారు. నెహ్రూ, పటేల్, ఆజాద్‌లతో ఆయన సుదీర్ఘ చర్చలు జరిపారు. కొంతమంది బిర్లా హౌస్ పచ్చిక బయళ్లలో గుమిగూడారు. ‘వైష్ణవ జన్‌తో తేనె కహియే తోపాటు, ఆయనకు ఎంతో ప్రియమైన భజన్లను, శ్లోకాలను పాడారు. తర్వాత ఖురాన్ మరియు గురు గ్రంథ్ సాహిబ్ నుండి శ్లోకాలు పఠించ బడ్డాయి. అలా ఆయన ఢిల్లీలో తన జీవితంలో చివరి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఎవరెంతగా ప్రాధేయపడినా ఆయన తన దీక్ష మానలేదు. చివరకు భారత ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తానుకు 55 కోట్ల డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది. 1948 జనవరి 18న ఒక శాంతి కమిటీ ఏర్పాటైంది. ముస్లింలు దిల్లీలోని తమ ఇళ్లలోకి వెళ్లవచ్చని, హిందువులు, సిక్కుల ఆక్రమణ నుంచి మసీదులను విడిపిస్తామని, అక్రమ కబ్జాల నుంచి ముస్లింల ప్రాంతాలను విడిపిస్తామని, ఇళ్ల నుంచి భయపడి వెళ్లిపోయిన ముస్లింలు తిరిగి రావడానికి హిందువుల నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆ కమిటీ మహాత్మా గాంధీకి హామీ ఇచ్చింది. హిందూ, ముస్లిమ్, సిక్కు వర్గాల నాయకులు సఖ్యంగా ఉండటానికి కట్టుబడి ఉన్నామని ఆయనవద్ద ప్రమాణం కూడా చేశారు. జనవరి 18న మధ్యాహ్నం 12.45కు మౌలానా ఆజాద్ ఇచ్చిన నారింజ రసం తాగిన మహాత్మా గాంధీ తన నిరాహార దీక్షను విరమించారు. కాని ఈ మొత్తం వ్యవహారంలో గాంధీ పట్ల మతోన్మాదుల ద్వేషం బలపడింది. మత ప్రాతిపదికన పాకిస్తాన్ ప్రత్యేక దేశం ఏర్పాటుకు గాంధీ వ్యతిరేకిస్తున్నారని ముస్లింలు భావించగా, ముస్లింల

వేధింపులపై ప్రతీకారం తీర్చుకునేందుకు గాంధీ తమకు అడ్డుపడుతున్నాడని హిందు తీవ్రవాదులు భావించారు. ఈ నేపథ్యంలో గాంధీ హత్యకు దారితీసింది హిందు- ముస్లింల మధ్య నెలకొన్న కలహాలే అనే వాదన బలంగా ఉంది. ఈ క్రమంలోనే నాథూరామ్ గాడ్సే పథకం ప్రకారం 1948 సంవత్సరం జనవరి 30వ తేదీ నాడు బిర్లా మందిర్ ప్రార్థన మందిరం మైదానంలో హత్య చేయడం జరిగిందని స్పష్టమయింది. “గాంధీ సమ్మతితో కాంగ్రెస్‌లోని అగ్రనేతలు అంతా కలిసి దేశాన్ని చీలికలు-పేలికలుగా మార్చారని, దేశవిభజనకు సమ్మతి తెలిపి పెద్ద కుమారుడు వంటి గాంధీ భారత దేశానికి ద్రోహం చేయడం ద్వారా ఆయన తన ధర్మాన్ని నెరవేర్చడంలో ఘోరంగా విఫలం అయ్యాడని, అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే నేను తుది నిర్ణయానికి వచ్చానని, అందుకే తానే గాంధీని కాల్చి చంపానని” గాడ్సే కోర్టులో వివరించాడు. స్వతంత్ర భారతదేశంలో ఉరితీయబడిన మొదటి వ్యక్తిగా గాంధీని చంపిన నాధురాం వినాయక్ గాడ్సే చరిత్రలో నిలిచిపోయాడు.

## జెప్టో, బ్లింకిట్ వల్ల కిరాణా షాపులు మూతపడుతున్నాయి..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈకామర్స్ ఫ్లాట్ ఫామ్‌లు బ్లింకిట్, జెప్టో లాంటి హైపర్ లోకల్ ఆన్ లైన్ డెలివరీ యాప్ ల వల్ల స్థానిక కిరాణ వ్యాపారులు నష్టపోతున్నారని వైసీపీ ఎంపీ గొల్లబాబు రావు రాజ్యసభలో వ్యాఖ్యానించారు. కిరాణా వ్యాపారులను కేంద్రం ఆదుకోవాలని అన్నారు. ఇప్పటికే ఆన్ లైన్ డెలివరీ కారణంగా లక్షలాది కిరాణా దుకాణాలు మూతపడ్డాయని చెప్పారు. పది నిమిషాల్లోనే డెలివరీ, ఆఫర్ల పేరుతో ఆనైన్ యాప్ తో కిరాణా వ్యాపారులు పోటీ పడలేకపోతున్నారని చెప్పారు. గతేడాది కనీసం 2 లక్షల దుకాణాలు మూతపడ్డాయన్నారు. అంతేకాకుండా స్థానికంగా వ్యాపారం ఘననీయంగా తగ్గిపోయిందని నివేదికలు చెబుతున్నాయన్నారు. ఇదిలా ఉంటే బ్లింకిట్, జెప్టోతో పాటు పలు ఆన్ లైన్ యాప్ లు ఇప్పటికే నగరాల్లో పదినిమిషాలలో కిరాణా వస్తువులు డెలివరీ చేస్తున్న సంగతి తెలిసిందే. కిరాణా వస్తులు మాత్రమే కాకుండా కూరగాయలు సైతం డెలివరీ చేస్తున్నాయి. దీంతో కిరాణా వ్యాపారులతో పాటు కూరగాయలు అమ్మే వాళ్లు సైతం వ్యాపారం లేక ఇబ్బందిపడుతున్నారు. త్వరలో గ్రామాలకు సైతం ఆన్ సేవలు విస్తరించే అవకాశం ఉండటంతో గ్రామాల్లోని వ్యాపారులు సైతం ఆందోళన చెందుతున్నారు.

## ఇరాన్‌పై యూఎస్ దాడి వేళ.. సౌదీ అరేబియా కీలక నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:**పశ్చిమాసియా యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న వేళ సౌదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియా యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న వేళ సౌదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశ గగనతలం, భూభాగం మీదగా ఎలాంటి మిలటరీ దాడులకు పాల్పడ్డకుండా నిషేధం విధించింది. సౌదీ ప్రెస్ ఏజెన్సీ (రాఖం) ఒక ప్రకటన ప్రకారం, క్రౌన్ ప్రిన్స్ ఇస్లామిక్ రిపబ్లిక్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.సౌదీ అరేబియా.. ఇరాన్ సార్వభౌమత్వాన్ని గౌరవిస్తుంది, ఏ పార్టీ నుండి అయినా, వారి మూలంతో సంబంధం లేకుండా, దేశంపై దాడులు లేదా సైనిక కార్యకలాపాలను అనుమతించదు. ఈ ప్రాంతంలో భద్రత, స్థిరత్వాన్ని ప్రోత్సహించడానికి చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించడానికి రాజ్యం మద్దతును కూడా ఆయన పునరుద్ఘాటించారు. ఇరాన్ అధ్యక్షుడు సౌదీ అరేబియా నిర్ణయం హర్షం వ్యక్తం చేశారు. ప్రాంతీయ భద్రత, స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి చేసిన కృషికి క్రౌన్ ప్రిన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఇరాన్ పై దాడులు చేయడానికి ట్రంప్ ముమ్మరం పావులుకదుపుతున్నారు.అయతే సౌదీ నిర్ణయంతో యూఎస్ ఇరకాటంలో పడింది.

## ఈయూతో ట్రేడ్ డీల్ వల్ల భారత్‌కే లాభం

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్- ఐరోపా సమాఖ్యల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం భారత్‌కే ఎక్కువ అనుకూలంగా ఉందని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో గ్రీర్ మాట్లాడుతూ.. ‘ఈ ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలు నేను పరిశీలించా. దీనిలో భారతదేశం పైచేయిగా నిలుస్తుందని భావిస్తున్నా. ఐరోపా మార్కెట్‌లో భారత ఉత్పత్తులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి’ అని పేర్కొన్నారు. భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దేశంలోకి దిగుమతయ్యే వస్తువులపై టారిఫ్‌లు విధిస్తుండటంతో.. పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఈయూ.. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

## భారత్- ఈయూ ట్రేడ్ డీల్.. మమ్మల్ని నిరాశపరిచింది

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్- ఐరోపా సమాఖ్యల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ డీల్ తమను తీవ్రంగా నిరాశపరిచిందని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ అన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌లో ఇంకా యుద్ధం కొనసాగుతున్నప్పటికీ.. ఈయూ వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిందంటూ ఆయన మండిపడ్డారు. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ బెసెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ‘వాళ్లకు ఏది ఉత్తమమైందో వారు అది చేయాలి. కానీ యూరోపియన్లు నన్ను చాలా నిరాశపరిచారు’ అని అన్నారు. గతేడాది భారత దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. తమలాగే భారత్‌పై అదనపు సుంకాలు విధించేందుకు అప్పుడు ఈయూ విముఖత వ్యక్తం చేసిందన్నారు. సొంత వాణిజ్య ఒప్పందం కోసం ముందుకువెళ్లాలనే ఉద్దేశంతోనే .. వారు ఆ పని చేసేందుకు ఇష్టపడలేదన్నారు. ఐరోపా ఉక్రెయిన్ ప్రజల కంటే వాణిజ్య ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు.

## మహానగరంలో దారుణం.. కలకలంగా మారిన ‘ట్రిపుల్ మర్డర్’



**హైదరాబాద్ పెన్ పవర్:**చెన్నై: బతుకుదెరువు కోసం వలస వచ్చిన కుటుంబాన్ని దుండగులు దారుణంగా హత్య చేసి గోనె సంచిలో పెట్టి వేరు వేరు ప్రాంతాల్లో విసిరేశారు. ఈ షాకింగ్ ఘటన తమిళనాడు రాజధాని చెన్నై నగరంలో చోటుచేసుకుంది. అత్యంత పాశవికమైన ‘ట్రిపుల్ మర్డర్’ బుధవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. ఉపాధి కోసం బీహార్ నుంచి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని వారి సన్నిహితులే దారుణంగా హతమార్చారు. ఈ ఘటనలో గౌరవ్ కుమార్ (24) అనే యువకుడి మృతదేహం సోమవారం ఉదయం అడయార్‌లోని ఒక బైక్ షోరూమ్ సమీపంలో గోనె సంచిలో కుక్కిన స్థితిలో లభ్యమైంది. తల, ముఖంపై తీవ్రమైన గాయాలతో ఉన్న గౌరవ్‌ను చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా, అతని భార్య మినుకుమారి, రెండేళ్ల కుమారుడు బీర్మణి కుమార్ కూడా అదృశ్యమైనట్లు గుర్తించారు. హత్యకు గురైన వారి కోసం గాలించిన పోలీసులకు బుధవారం మధ్య కైలాష్ సమీపంలోని కూవం నది (బకింగ్‌హామ్ కెనాల్) పొదల్లో రెండేళ్ల పసివాడి మృతదేహం లభించింది. నిందితులు చిన్నారిని కూడా కనికరం లేకుండా చంపి నదిలో పడేశారు. ఈ అమానుషానికి పాల్పడినట్లు అనుమానిస్తున్న బీహార్‌కే చెందిన సికందర్ (33), నరేందర్ కుమార్ (45) సహా ఐదుగురు వలస కార్మికులను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. మద్యం మత్తులో జరిగిన గొడవ కారణంగానే ఇనుప రాడ్లతో దాడి చేసి ఈ ముగ్గురిని చంపినట్టు సమాచారం. ప్రస్తుతం గౌరవ్ భార్య మృతదేహం కోసం పెరుంగుడి డంప్‌యార్డ్, నది పరివాహక ప్రాంతాల్లో పోలీసులు గాలిస్తున్నారు.

## అశేష జనవాహిని మధ్య అజిత్ ‘దాదా’ అంతిమయాత్ర..

**హైదరాబాద్ పెన్ పవర్:** బారామతి విమాన ప్రమాదంలో మహారాష్ట్ర రాజకీయ ధ్రువతార, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (66) ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ రోజు ఆయన అంత్యక్రియలు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో పూర్తి అధికారిక లాంఛనాలతో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఉదయం అశేష జనవాహిని మధ్య ఆయన అంతిమయాత్ర సాగింది. పూలతో అలంకరించిన ప్రత్యేక రథంపై ‘అజిత్ దాదా అమర్ రహే’ అనే నినాదాల మధ్య బారామతి పురవీధుల్లో ఆయన భౌతికకాయాన్ని ఊరేగించారు. తమ ప్రియతమ నేతను చివరిసారిగా చూసుకునేందుకు వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తల కన్నీటి వీడ్కోలు తో బారామతి నగరం శోకసంద్రమైంది. ఈ అంత్యక్రియలకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే సహా పలువురు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. అజిత్ పవార్ చిన్నాన్న, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ థాకరే, సుప్రియా సూలే, ఇతర కుటుంబ సభ్యులు అత్యంత భావోద్వేగంతో ఆయనకు తుది వీడ్కోలు పలికారు. మహారాష్ట్ర అభివృద్ధిలో అజిత్ పవార్ పోషించిన పాత్ర అద్వితీయమని, ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటని నేతలు కొనియాడారు. అంతిమ సంస్కారాల సమయంలో త్రివర్ణ పతాకాన్ని అజిత్ పవార్ కుమారుడు జయ్ పవార్‌కు అధికారులు అందజేశారు.



# పైనాపిల్‌ను తింటే.. అది మనల్ని తింటుందా..!




బరువు తగ్గాలనుకునే వారికి, జీర్ణక్రియ మెరుగుపడాలని కోరుకునే వారికి పైనాపిల్ ఒక అద్భుతమైన వరం. విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లతో నిండిన ఈ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కానీ చాలామంది దీనిని తినడానికి భయపడుతుంటారు.. కారణం నాలుక దురద. పైనాపిల్..చూడగానే నోరూరించే పండు.. తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు. కానీ పైనాపిల్‌ను ఒక్క ముక్క నోట్లో పెట్టుకోగానే నాలుకపై చిన్నపాటి మంట, దురద లేదా ఏదో గుచ్చుకున్నట్లు అనిపిస్తుంది. చాలామంది ఇది పండులో ఏదైనా లోపం ఏమో అని భయపడతారు. కా, దీని వెనుక ఒక ఆసక్తికరమైన జీవక్రియ దాగి ఉంది. పైనాపిల్‌లో బ్రోమెలైన్ అనే శక్తివంతమైన ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడం సిద్ధహస్తురాలు. సాధారణంగా మనం ఆహారాన్ని జీర్ణం చేసుకుంటాం.. కానీ పైనాపిల్ విషయంలో.. మనం దానిని నములుతున్నప్పుడు, అందులోని బ్రోమెలైన్ మన నోటిలోని సున్నితమైన కణజాలం, నాలుకపై ఉండే ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తుంది. అంటే సాంకేతికంగా చెప్పాలంటే.. మనం పైనాపిల్‌ను తింటుంటే, పైనాపిల్ మనల్ని తింటుందన్నమాట. అయితే ఈ దురదను చూసి కంగారు పడక్కర్లేదు. ఈ ఎంజైమ్ మన కడుపులోకి వెళ్లగానే అక్కడి జీర్ణ రసాల వల్ల అది జీర్ణమైపోతుంది. నిజానికి ఇది జీర్ణక్రియకు, శరీరంలో వాపులను తగ్గించడానికి ఎంతో మేలు చేస్తుంది. మన నోటిలోని కణాలు చాలా వేగంగా పునరుత్పత్తి చెందుతాయి. అందుకే పైనాపిల్ తిన్న తర్వాత కలిగే ఆ మొద్దుబారినట్లు ఉండే అనుభూతి కొద్దిసేపట్లోనే తగ్గిపోతుంది. పైనాపిల్ రుచిని ఆస్వాదిస్తూనే, ఆ దురద నుండి తప్పించుకోవడానికి ఇక్కడ కొన్ని చిట్కాలు ఉన్నాయి. ఉప్పు నీటి చిట్కా: పైనాపిల్ ముక్కలను కోసిన తర్వాత కొద్దిసేపు ఉప్పు నీటిలో నానబెట్టండి. ఉప్పు బ్రోమెలైన్ ప్రభావాన్ని తగ్గిస్తుంది. వేడి చేయడం: పైనాపిల్‌ను గ్రిల్ చేసినా లేదా ఉడికించినా అందులోని ఎంజైమ్లు నిర్వీర్యం అవుతాయి. అందుకే పైనాపిల్ పిజ్జా తిన్నప్పుడు నాలుక దురద పెట్టదు. పండిన పండునే ఎంచుకోండి: పచ్చి పైనాపిల్‌లో ఈ ఎంజైమ్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పండు బాగా పండిన తర్వాత తింటే ఈ సమస్య తక్కువగా ఉంటుంది. మధ్య భాగం వద్దు: పైనాపిల్ మధ్యలో ఉండే గట్టి భాగంలో బ్రోమెలైన్ ఎక్కువగా ఉంటుంది. దానిని పక్కన పెడితే దురద తగ్గుతుంది. ఇందులో క్యాలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉండడం వల్ల బరువు తగ్గాలనుకునేవారికి మంచిది. విటమిన్-సి పుష్కలంగా ఉండటం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యల నుండి కాపాడుతుంది. ఇందులో ఉండే మాంగనీస్ ఎముకలను బలంగా ఉంచుతుంది.

# చిన్న ముక్క అల్లం తింటే ఇన్ని లాభాలా!



అల్లం కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు జలుబు, నొప్పులను తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, కొలెస్ట్రాల్ నియంత్రణకు, రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడానికి అల్లం తోడ్పడుతుంది. మీ రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే మంచి ఆరోగ్యం సొంతం. అల్లం వంటలకు కేవలం మంచి రుచిని ఇవ్వడమే కాదు.. ఇంకా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అల్లంలో ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు అల్లంతో చెక్ పెట్టొచ్చు. జలుబు, దగ్గు, తలనొప్పి, మైగ్రేన్, నడుంనొప్పి, వెన్నుపూస నొప్పి, మోకాలి నొప్పులు, జాయింట్ పెయిన్స్ వంటి సమస్యలను తగ్గించడానికి అల్లం మంచి మెడిసిన్. ఆకలిని పెంచడంలో అల్లం బాగా సహాయ పడుతుంది. ముఖ్యంగా కీమోథెరపీ, రేడియోథెరపీ, క్యాన్సర్ బాధితులకు ఆకలి తగ్గిపోతుంది. అల్లం రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వ్యాధుల నుండి రక్షిస్తుంది. చర్మాన్ని మెరిసేలా చేసి, జుట్టును బలంగా, ఒత్తుగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గించి మనస్సును ప్రశాంతంగా ఉంచడంలో కూడా ఇది ఎంతో సహాయపడుతుంది. ఆరోగ్యాన్ని మెరుగుపరచే ఈ సహజ ఔషధాన్ని మీ రోజువారీ జీవనశైలిలో చేర్చుకోవడం మంచిది. అలాగే ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కొన్నిసార్లు ఆకలిగా అనిపించదు. ఇందులో నొప్పి, వాపును తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. రోజుకు 2 నుంచి 5 గ్రాముల అల్లంను రెండు వారాల పాటు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకం సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. అదనపు కొవ్వును కరిగించి బరువు తగ్గడంలో సహాయపడుతుందే కాకుండా, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం తినడం లేదా అల్లం నీరు తాగడం శరీర డిటాక్స్‌కు సహాయపడుతుంది. ఒక నెలపాటు ప్రతిరోజూ అల్లం తినడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అల్లంలోని పదార్థాల వల్ల రక్తంలో ట్రైగ్లిజరైడ్‌ల పరిమాణం తగ్గుతుంది

## బరువును తగ్గించే మ్యాజిక్ బ్రేక్‌ఫాస్ట్



బరువు తగ్గాలనే లక్ష్యంతో చాలామంది చేసే మొదటి పని బ్రేక్ ఫాస్ట్ మానేయడం. కానీ అది మీ ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుందని మీకు తెలుసా? బరువు తగ్గడానికి బ్రేక్‌ఫాస్ట్ మానేయడం కాదు.. అసలు ఏం తింటున్నామన్నదే ముఖ్యం. ఉదయం పూట మీరు తీసుకునే ఆహారమే మీ రోజంతటి వేగాన్ని, మీ జీవక్రియను నిర్ణయిస్తుంది.నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది చేసే అతిపెద్ద తప్పు బ్రేక్ ఫాస్ట్ విషయంలో అశ్రద్ధ చూపడం. మరికొందరు బరువు తగ్గాలనే ఉద్దేశంతో అసలు టిఫినే తినరు. అయితే బరువు తగ్గడానికి టిఫిన్ మానేయడం కాదు.. సరైన అల్పాహారం ఎంచుకోవడం ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరానికి రోజంతా అవసరమైన శక్తిని ఇచ్చేది, జీవక్రియను వేగవంతం చేసేది అల్పాహారమే. మరి బరువు తగ్గడానికి ఎలాంటి బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి? బరువు తగ్గాలనుకునే వారికి మొలకెత్తిన పప్పులు ఒక అద్భుతమైన ఎంపిక. ఇందులో ప్రోటీన్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. నానబెట్టిన పచ్చి పప్పు లేదా శనగలను మొలకలు వచ్చిన తర్వాత అందులో ఉల్లిపాయ, టమోటా, దోసకాయ ముక్కలు, కొంచెం నిమ్మరసం, చాట్ మసాలా కలిపి తీసుకోవాలి. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా అనిపిస్తుంది. తద్వారా అనవసరమైన చిరుతిళ్లు తినాలనే కోరిక తగ్గుతుంది. పీచు పదార్థం జీర్ణవ్యవస్థను శుభ్రం చేయడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఓట్స్, చియా గింజలు, తాజా పండ్లు, బెర్రీలు, మల్టీగ్రెయిన్ బ్రెడ్ వంటివి మీ అల్పాహారంలో భాగంగా ఉండాలి. ఫైబర్ వల్ల కేలరీలు త్వరగా ఖర్చవుతాయి. ఇది అతిగా తినకుండా మిమ్మల్ని నియంత్రిస్తుంది. ఆఫీసులకు వెళ్లే వారికి, విద్యార్థులకు ఇది బెస్ట్ ఆప్షన్. అల్పాహారానికి ముందే మీ శరీరాన్ని లోపలి నుండి శుభ్రం చేసుకోవడం ముఖ్యం. ఉదయం లేవగానే ఒకటి లేదా రెండు గ్లాసుల గోరువెచ్చని నీరు తాగాలి. ఇది శరీరంలోని విషపూరిత వ్యర్థాలను బయటకు పంపివేస్తుంది. సాధారణ టీ, కాఫీలకు బదులుగా గ్రీన్ టీ లేదా హెర్బల్ టీలను ఎంచుకోండి. ఇది మీ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతూనే బరువు తగ్గడానికి సహకరిస్తుంది. బరువు పెరగడానికి ప్రధాన కారణం అల్పాహారంలో మనం వాడే నూనె, చక్కెర, అధిక కార్బోహైడ్రేట్లు. ప్యాక్ చేసిన తృణధాన్యాలు, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండటం ఉత్తమం. సరైన సమయానికి, సరైన మోతాదులో పోషకమైన అల్పాహారం తీసుకోవడం వల్ల కేవలం బరువు తగ్గడమే కాకుండా రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. కాబట్టి రేపటి నుండి మీ బ్రేక్‌ఫాస్ట్ ప్లేట్‌ను ఆరోగ్యకరంగా మార్చుకోండి.

# ఆరోగ్యం కోసం పరగడుపున అదొక్కటి తింటే చాలు



చూడటానికి ఎంతో సుకుమారంగా కనిపించినా, వ్యాయామం విషయంలో మాత్రం ఆమె ఒక రోల్‌మోడల్. నిత్యం యోగా, జిమ్ వర్కవుట్లతో తన సోషల్ మీడియాలో స్ఫూర్తిని నింపే ఆ బాలీవుడ్ నటి, తాజాగా తన మార్నింగ్ రొటీన్‌కు సంబంధించిన ఒక వింత అలవాటును పంచుకుంది. సాధారణంగా ఉదయాన్నే నిమ్మరసం, తేనె లేదా గ్రీన్ టీ తాగుతుంటారు. కానీ ఈమె మాత్రం అందరికీ భిన్నంగా ఒక పచ్చి వెల్లుల్లి రెబ్బను నమిలి తింటోంది. ఆ ఘాటైన వాసన, మండే రుచిని సైతం భరిస్తూ ఆమె ఎందుకు వెల్లుల్లిని తీసుకుంటోంది? కేవలం కొన్ని వారాల నుంచి పాటిస్తున్న ఈ చిన్న మార్పు తన శరీరంలో ఎలాంటి మ్యాజిక్ చేసిందో ఆమె స్వయంగా వెల్లడించింది. ఇంతకీ సోహా అలీ ఖాన్ నమ్ముతున్న ఆ ప్రాచీన వైద్య రహస్యం ఏంటి? వెల్లుల్లి మంత్రం.. ప్రముఖ నటి సోహా అలీ ఖాన్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ఆసక్తికరమైన వీడియోను షేర్ చేశారు. గత కొన్ని వారాలుగా తను ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఒక చిన్న పచ్చి వెల్లుల్లి రెబ్బను తింటున్నట్లు ఆమె తెలిపారు. ఇది ప్రాచీన జ్ఞానం అని, ఇప్పటికీ ఇది అద్భుతంగా పనిచేస్తుందని ఆమె నమ్ముతున్నారు. ఈ అలవాటు వల్ల తన రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా, జీర్ణక్రియ మెరుగుపడిందని సోహా వివరించారు. వెల్లుల్లిని ఊరికే మింగేయడం కంటే నమిలి తినడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని సోహా చెబుతున్నారు. వెల్లుల్లిని నమిలినప్పుడు అందులో ఉన్న 'అల్లిసిన్' అనే సమ్మేళనం యాక్టివేట్ అవుతుంది. వెల్లుల్లిలో ఉండే శక్తివంతమైన ఆరోగ్య ప్రయోజనాలకు ఈ అల్లిసిన్ ప్రధాన కారణం. ఒకవేళ నమలడం కష్టంగా అనిపిస్తే, వెల్లుల్లిని ముక్కలుగా కోసి లేదా దంచి ఒక 10 నిమిషాల పాటు పక్కన పెట్టి, ఆ తర్వాత నీటితో కలిపి తీసుకోవాలని ఆమె సూచించారు.

## చలికాలంలో కొబ్బరి నీళ్లు తాగొచ్చా?




కొబ్బరి నీరు విటమిన్లు, ఖనిజాలు, ఎలక్ట్రోలైట్లతో నిండిన సహజ పానీయం. ఇది శీతాకాలంలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది, శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. చర్మానికి తేమను అందిస్తుంది. చలికాలంలో గది ఉష్ణోగ్రత వద్ద కొబ్బరి నీటిని మధ్యాహ్నం వేళ తీసుకోవడం మంచిది. కొబ్బరి నీరు విటమిన్లు, ఖనిజాలు, ఎలక్ట్రోలైట్లతో నిండిన సహజ పానీయం. ఇది మనలో ఉత్తేజాన్ని నింపడమే కాకుండా, శీతాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ముఖ్యమైన ఖనిజాలు ఈ చలికాలంలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. శీతాకాలంలో కొబ్బరి నీళ్లు తాగేటప్పుడు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి. ఉదయం కంటే మధ్యాహ్నం, సూర్యకాంతి ఉన్న సమయంలో తాగడం మంచిది. కొబ్బరి నీళ్లను ఫ్రిజ్‌లో పెట్టకుండా గది ఉష్ణోగ్రత వద్ద తాగాలి. ఇలా చేయడం వల్ల జలుబు, దగ్గు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. చలికాలంలో దాహం తక్కువగా ఉన్నప్పటికీ, కొబ్బరి నీళ్లు శరీరానికి అవసరమైన హైడ్రేషన్, ఎలక్ట్రోలైట్లు అందిస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది. కొబ్బరి నీరు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడి, శీతాకాలంలో కడుపు సమస్యలను నివారిస్తుంది. చల్లని వాతావరణంలో జీర్ణక్రియ నెమ్మదిగా ఉన్నప్పుడు, కొబ్బరి నీరు కడుపును తేలికగా ఉంచడంలో తోడ్పడుతుంది. చలికాలంలో చర్మం పొడిబారకుండా లోపల నుండి తేమగా ఉంచడంలో కూడా ఇది సహాయపడుతుంది. పొటాషియం, సోడియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్లు శరీరంలో ద్రవ సమతుల్యతను, గుండె పనితీరును,శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి.

## చలికాలంలో గుడ్డు తింటే..



చలికాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి, జలుబు, అలసట తగ్గించడానికి గుడ్లు అనువైన సూపర్ ఫుడ్ అని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు శరీరంలో వేడిని ఉత్పత్తి చేసి, జీవక్రియను చురుకుగా ఉంచుతాయి. రోగనిరోధక శక్తిని పెంచి, కండరాలను బలోపేతం చేస్తాయి. శీతాకాలం ప్రారంభం కాగానే చల్లదనం, జలుబు, అలసట వంటి సమస్యలు చాలామందిని ఇబ్బంది పెడతాయి. ఈ నేపథ్యంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడం, రోగనిరోధక శక్తిని పెంచుకోవడం అత్యవసరం. వైద్యులు, నిపుణుల అభిప్రాయం ప్రకారం, గుడ్లు చలికాలానికి అనువైన సూపర్ ఫుడ్‌గా పనిచేస్తాయి. గుడ్లలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, అధిక నాణ్యత గల ప్రోటీన్లు శరీరంలో వేడిని ఉత్పత్తి చేయడానికి సహాయపడతాయి. ఇవి శరీర జీవక్రియను చురుకుగా ఉంచి, చలి ప్రభావాన్ని తగ్గిస్తాయి. ఉదయాన్నే అల్పాహారంలో గుడ్లు తీసుకోవడం వల్ల రోజంతా శరీరం వెచ్చగా ఉండటమే కాకుండా, జలుబు వల్ల కలిగే బిగుతు కూడా తగ్గుతుంది. శీతాకాలంలో శరీరానికి అదనపు శక్తి అవసరం. గుడ్లు పోషకాహారంతో నిండిన సంపూర్ణ ఆహారంగా ఉపయోగపడతాయి. తక్కువ పరిమాణంలోనే ఎక్కువ పోషణ అందించడం వీటి ప్రత్యేకత. గుడ్లలోని ప్రోటీన్ కండరాలను బలోపేతం చేసి, అలసటను తగ్గిస్తుంది. విటమిన్ డి, విటమిన్ బి12, సెలీనియం వంటి పోషకాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తాయి. అలాగే, గుడ్లలోని ప్రోటీన్, కొవ్వు కడుపు నిండిన అనుభూతిని కలిగించి, అనారోగ్యకరమైన చిరుతిండ్లను తగ్గించి బరువు నియంత్రణకు తోడ్పడతాయి. చలికాలంలో గుడ్లు తినడం అనేది కేవలం రుచికరమైన ఆహారమే కాకుండా, శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి, శక్తిని అందించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, బరువును నియంత్రించడానికి ఒక గొప్ప మార్గం. ఆరోగ్యకరమైన శీతాకాలం కోసం గుడ్లను మీ ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

# బ్రెడ్ ఆమ్లెట్, మొలకలు టిఫిన్‌కి ఏది బెస్ట్..!



బరువు తగ్గేవారికి బ్రెడ్ ఆమ్లెట్, మొలకలు రెండూ ప్రయోజనకరమే. బ్రెడ్ ఆమ్లెట్‌లో అధిక ప్రొటీన్.. ఆకలిని తగ్గిస్తుంది. అయితే తక్కువ నూనెతో, వైట్ బ్రెడ్ లేకుండా తీసుకోవాలి. మొలకలలో అధిక ఫైబర్ ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచి, కొవ్వును కరిగిస్తుంది. నిపుణుల ప్రకారం, బరువు తగ్గడానికి మొలకలు మెరుగైన ఆప్షన్. మనం ఉదయం తీసుకునే అల్పాహారం ఆ రోజంతా శరీరాన్ని యాక్టివ్‌గా ఉంచేలా చేస్తుంది. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారు బ్రెడ్ ఆమ్లెట్ లేదా మొలకలు లాంటి అధిక ప్రోటీన్ ఆహారాలను తరచుగా తీసుకుంటూ ఉంటారు. ఈ రెండు ఆహారాలు బరువు తగ్గడానికి ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, ఏది ఎక్కువ బలాన్ని చేకూరుస్తుందనే సందేహం ఉంటుంది. పోషకాహార నిపుణుల ప్రకారం, బ్రెడ్ ఆమ్లెట్ బరువు తగ్గడానికి సహాయపడుతుంది, కానీ తక్కువ నూనెతో తయారు చేయాలి. రెండు గుడ్లు, రెండు బ్రెడ్ ముక్కల ఆమ్లెట్‌లో 250-350 క్యాలరీలు, 18-22 గ్రాముల ప్రోటీన్ ఉంటాయి. గుడ్లలోని ప్రోటీన్ ఆకలిని తగ్గిస్తుంది. అయితే, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉండే తెల్ల బ్రెడ్‌కు దూరంగా ఉండాలి. మొలకలు బరువు తగ్గేవారికి మరొక అద్భుతమైన ఆప్షన్. 100 గ్రాముల మొలకల్లో కేవలం 25-50 క్యాలరీలు, 3-9 గ్రాముల ప్రోటీన్, 1.5-2 గ్రాముల ఫైబర్ ఉంటాయి. మొలకలలోని అధిక ఫైబర్ ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, కొవ్వును కరిగిస్తుంది. వీటిలో విటమిన్ సి, ఎంజైములు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. బరువు తగ్గడానికి మొలకలు ఉత్తమమని నిపుణులు అంటున్నారు. అయితే వారానికి రెండు, మూడు సార్లు బ్రెడ్ ఆమ్లెట్ తీసుకోవడం కూడా ప్రయోజనకరమే. బ్రెడ్ ఆమ్లెట్ తయారుచేసేటప్పుడు, 10 గ్రాముల కంటే ఎక్కువ నూనెను వాడకూడదు. మీకు థైరాయిడ్ లేదా మూత్రపిండాల వంటి ఆరోగ్య సమస్యలు ఉంటే, ఈ ఆహారాలను తీసుకునే ముందు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించండి. మొత్తంగా, మొలకలు బరువు తగ్గడంలో మెరుగైన ఆప్షన్ అయినప్పటికీ, వారానికి రెండు లేదా మూడు సార్లు బ్రెడ్ ఆమ్లెట్ తినడం కూడా ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

# స్టార్ ప్లేయర్లకు బిగ్ షాక్.. మూడు ఫార్మాట్లకు ఒకే కెప్టెన్‌ను ప్రకటించిన క్రికెట్ ఆస్ట్రేలియా



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ లో ఊహించని నిర్ణయం తీసుకొని ఆశ్చర్యపరిచింది. అనుభవం లేని ఒక యువ ప్లేయర్ కు ఏకంగా మూడు ఫార్మాట్లకు కెప్టెన్ గా ఎంపిక చేసింది. 28 ఏళ్ల బౌలింగ్ ఆల్ రౌండర్ సోఫీ మోలినెక్స్ ఆస్ట్రేలియా మహిళల జట్టుకు కొత్త ఆల్-ఫార్మాట్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుందని ప్రకటించింది. అలిస్సా హీలీ స్థానంలో మోలినెక్స్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించనుంది. భారత మహిళల జట్టుతో జరగనున్న టీ20 సిరీస్ నుంచి మోలినెక్స్ కెప్టెన్సీ పగ్గాలు చేపట్టనుంది. తహ్లియా మెక్‌గ్రాత్, ఆల్ రౌండర్ ఆష్లీ గార్డ్నర్ లాంటి స్టార్ ప్లేయర్లు ఉన్నప్పటికీ మోలినెక్స్ సారధ్య బాధ్యతలు అప్పగించడం విశేషం.

ఫిబ్రవరి, మార్చి నెలలో భారత మహిళల జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈ టూర్ లో భాగంగా ఇరు జట్లు మూడు ఫార్మాట్ లు దతాయి. ఫిబ్రవరి 15 నుంచి 21 వరకు టీ20 సిరీస్.. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకు వన్డే సిరీస్ జరుగుతుంది. ఇరు జట్ల మధ్య ఏకైక టెస్ట్ మ్యాచ్ మార్చి 6న జరుగుతుంది. ఈ టూర్ లో మోలినెక్స్ కేవలం టీ20 జట్టుకు మాత్రమే కెప్టెన్సీ చేయనుంది. అలిస్సా హీలీ వన్డే, టెస్ట్ జట్టును నడిపిస్తుంది. హీలీ అంతర్జాతీయ క్రికెట్ లో ఇదే చివరి సిరీస్. ఈ సిరీస్ తర్వాత హీలీ నుంచి టెస్ట్, వన్డే, టీ20 పగ్గాలను మోలినెక్స్ చేపడుతుంది.

ఆస్ట్రేలియా మహిళల జట్టుకు కొత్త ఆల్-ఫార్మాట్ కెప్టెన్‌గా ప్రకటించిన తర్వాత సోఫీ మోలినెక్స్ సంతోషం వ్యక్తం చేశారు. "ఆస్ట్రేలియా కెప్టెన్‌గా ఎంపికవడం నిజంగా గౌరవం. నేను చాలా గర్వపడుతున్నాను. ముఖ్యంగా ఈ ఆస్ట్రేలియా మహిళా జట్టుపై జట్టుపై అలిస్సా ఎంతగానో ప్రభావం చూపించింది. మాకు చాలా పటిష్టమైన జట్టు ఉంది. జట్టులో ఎంతోమందికి నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. కలిసి పని చేసి జట్టును ముందుకు తీసుకెళ్లడానికి ఎంతగానో ఎదురు చూస్తున్నాను".మోలినెక్స్ చెప్పుకొచ్చారు.

**ఆస్ట్రేలియా కెప్టెన్సీకి హీలీ గుడ్ బై:**

ఆస్ట్రేలియా తరపున అత్యుత్తమ మహిళా క్రికెటర్లలో ఒకరైన అలిస్సా హీలీ తన అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం (జనవరి 13) హీలీ తన రిటైర్మెంట్ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. మార్చిలో టీమిండియాతో జరగబోయే వన్డే

సిరీస్ తన కెరీర్ లో చివరిదని ఈ ఆస్ట్రేలియా కెప్టెన్ కెప్టెన్ తెలిపింది. ఈ టూర్ లో భాగంగా పెర్త్‌లో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ తో పాటు ఒక టెస్ట్ మ్యాచ్ కు హీలీ చివరిసారిగా నాయకత్వం వహిస్తుంది. అయితే టీ20 సిరీస్ కు మాత్రం ఈ ఆసీస్ దిగ్గజం అందుబాటులో ఉండదు. ఎందుకంటే ఆమె 2026 ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ ఆడదు. కాబట్టి టీ20 సిరీస్ ఆడినా పెద్ద ప్రయోజనం ఉండదు.

# ఫుట్ వర్క్ లేకుండా వికెట్లు వదిలేసి నిలబడతావా.. శాంసన్ ఔటైన తీరుపై గవాస్కర్ విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ పేలవ ఫామ్ కొనసాగుతోంది. న్యూజిలాండ్ తో జరుగుతున్న టీ20 సిరీస్ లో భాగంగా ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్ ల్లో ఘోరంగా విఫలమయ్యాడు. ఈ సిరీస్‌లో తనకు ఇష్టమైన ఓపెనింగ్ ప్లేస్ అప్పగించినప్పటికీ శాంసన్ తాను ఆడిన తొలి 3 మ్యాచ్‌ల్లో 16 రన్స్ మాత్రమే చేసి నిరాశపరిచాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ప్రతి మ్యాచ్ లో ఆడే అవకాశం వచ్చినా ఉపయోగిచుకోవడంలో విఫలమయ్యాడు. బుధవారం (జనవరి 28) కివీస్ తో జరిగిన నాలుగో టీ20లో 24 పరుగులు చేయి మరోసారి నిరాశపరిచాడు.

వైజాగ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో శాంసన్ ఆరంభంలో మంచిగా ఆడినప్పటికే తన ఇన్నింగ్స్ ను భారీ స్కోర్ గా మలచడంలో విఫలమయ్యాడు. 24 పరుగుల వద్ద కివీస్ కెప్టెన్ సాంట్నర్ బౌలింగ్ లో క్లీన్ బౌల్డయ్యాడు. శాంసన్ ఔటైన తీరుపై టీమిండియా దిగ్గజం సునీల్ గవాస్కర్ విమర్శల వర్షం కురిపించాడు. కామెంట్రీ చేస్తూ గవాస్కర్ ఇలా అన్నాడు.. " శాంసన్ కు అసలు ఫుట్ వర్క్ లేదు. వికెట్లు వదిలేసి అలా నిలబడ్డాడు. రూమ్ తీసుకొని ఆఫ్ సైడ్ ఆది ఉండాల్సింది. లెగ్ స్టంప్ కు దూరంగా జరిగి మూడు స్టంప్స్ వదిలేస్తే ఏ బౌలర్ అయినా బౌల్డ్ చేయకుండా ఎలా ఉంటాడు. శాంసన్ ఔటైన విధానం చిరాకు తెప్పిస్తుంది". అని శాంసన్ పై గవాస్కర్ ఫైరయ్యాడు.

**50 పరుగులతో టీమిండియా ఓటమి:**

న్యూజిలాండ్ తో జరిగిన నాలుగో టీ20లో టీమిండియా ఓడిపోయింది. బుధవారం (జనవరి 28) విశాఖపట్నం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో 50 పరుగుల తేడాతో మన జట్టుకు పరాజయం తప్పలేదు. 216 పరుగుల భారీ ఛేజింగ్ లో టీమిండియా విజయం కోసం దూబే (23 బంతుల్లో 65: 3 ఫోర్లు, 5 సిక్సర్లు) అసాధారణంగా పోరాడినా మిగిలిన వారు విఫలం కావడంతో ఓటమి తప్పలేదు. మరోవైపు న్యూజిలాండ్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణించి సిరీస్ లో తొలి విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఇండియా 18.4 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది.

**వరల్డ్ కప్ లో ఓపెనర్ గా శాంసన్ కు చెక్:**

న్యూజిలాండ్ తో సిరీస్ ముందువరకు వరల్డ్ కప్ కు ఓపెనర్లు కన్ఫర్మ్ అయ్యారు. అభిషేక్ శర్మతో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ దిగడం ఖాయమనుకున్నారు. అయితే ప్రస్తుతం కివీస్ తో జరుగుతున్న టీ20 సిరీస్ చూస్తే శాంసన్ వరల్డ్ కప్ లో ఆడే అవకాశాలు కనిపించడం లేదు. శాంసన్ పేలవ ఫామ్ ఇందుకు కారణం. న్యూజిలాండ్ తో ఇప్పటివరకు జరిగిన నాలుగు టీ20 మ్యాచ్ ల్లో శాంసన్ ఘోరంగా విఫలమయ్యాడు. నాలుగు మ్యాచ్ ల్లో కలిపి 40 పరుగులే చేసి పూర్తిగా నిరాశపరిచాడు.మరోవైపు ఇషాన్ కిషాన్ మాత్రం తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నాడు. తొలి టీ20లో 8 పరుగులే చేసి విఫలమైనా రెండో టీ20 లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 32 బాల్స్‌లోనే 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 76 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఆదివారం (జనవరి 25) జరిగిన మూడో టీ20లోనూ 12 బంతుల్లోనే 28 పరుగులు చేయి జట్టుకు మెరుపు ఆరంభం ఇచ్చాడు. కిషాన్ దూకుడు చూస్తుంటే వరల్డ్ కప్ ప్లేయింగ్ 11లో స్థానం దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిలక్ వర్మ జట్టులోకి వస్తే కిషన్ లేదా శాంసన్ లలో ఒకరు తప్పుకోవాలి. దీని ప్రకారం ఫామ్ లో ఉన్న కిషాన్ ను అభిషేక్ శర్మతో ఓపెనింగ్ కు పంపొచ్చు.

# అభిషేక్, హెడ్, బట్లర్ కాదు.. అతడే వరల్డ్ కప్ టాప్ స్కోరర్: స్టెయిన్ జోస్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ ను భారత్, శ్రీలంకలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నమెంట్ లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న పాకిస్తాన్- నెదర్లాండ్ మధ్య జరగుతుంది. వరల్డ్ కప్ కు 10 రోజుల సమయం మాత్రమే ఉండడంతో ఫ్యాన్స్ ఈ మెగా టోర్నీ కోసం ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. సొంతగడ్డపై జరగనుండడంతో టీమిండియా ఈ టోర్నీలో టైటిల్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. టోర్నీకి ముందు సౌతాఫ్రికా దిగ్గజ క్రికెటర్ డేల్ స్టెయిన్ 2026 టీ20 వరల్డ్ కప్ లో అత్యధిక పరుగులు ఎవరు చేస్తారో అంచనా వేశాడు. 2026 ఎడిషన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిని అంచనా వేయమని ఒక యూజర్ స్టెయిన్‌ను అడిగినప్పుడు.. తన దేశానికే క్వింటన్ డి కాక్ పేరు చెప్పుకొచ్చాడు. 2025 అక్టోబర్ లో రిటైర్మెంట్ నిర్ణయం వెనక్కి తీసుకొని అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన డికాక్ అద్భుతంగా రాణించాడు. గత ఏడాది చివర్లో ఇండియాతో జరిగిన టీ20 సిరీస్ లో దుమ్ములేపాడు. చండీఘర్ వేదికగా జరిగిన రెండో టీ20లో కేవలం 46 బంతుల్లో 90 పరుగులు చేసి తన మార్క్ చూపించాడు. ఇదే సిరీస్ లో చివరి మ్యాచ్ లో 35 బంతుల్లో 65 పరుగులు చేశాడు. ఇదే సూపర్ ఫామ్ ను డికాక్ సౌతాఫ్రికా టీ20 లీగ్ లో చూపించాడు. 12 మ్యాచ్ ల్లో 390 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు.

**తొలిసారి 20 జట్లతో టీ20 వరల్డ్ కప్:**

క్రికెట్ ప్రపంచంలో అత్యంత రసవత్తరంగా, ఫ్యాన్స్ థ్రిల్లింగ్ గా ఫీలయ్యే ఇండియా-పాక్ జట్ల మధ్య మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగనుంది. ఇండియా, పాకిస్తాన్ , అమెరికా(ఖూూ), నమీబియా, నెదర్లాండ్స్ ఒకే గ్రూపులో ఉన్నాయి. ఈసారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, స్కాట్లాండ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి.

భారత్‌లో జరిగే మ్యాచ్ లు 5 స్టేడియాల్లో జరుగుతాయి. అహ్మదాబాద్, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక శ్రీలంక లో 3 వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు.

# డార్లింగ్ ని చూసి కింగ్ భయపడుతున్నాడా?



త్రిప్తి డిమ్రీ యొక్క టైమ్‌లెస్ వైట్ మ్యాజిక్



పాన్ ఇండియాలో ఒకేసారి ఇద్దరు అగ్ర హీరోల సినిమాలు రిలీజ్ అయిన సన్నివేశం ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. బాక్సాఫీస్ వద్ద నువ్వా? నేనా? అన్నట్లు తపలడాల్సి ఉంటుంది. ఏ సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ వస్తే ఆ సినిమాదే అప్పర్ హ్యాండ్. యావరేజ్ టాక్ వచ్చినా సినిమా సక్సస్ ఫుల్ చిత్రం ముందు నిలబడటం కష్టం. ఇలాంటి సన్నివేశాన్ని షారుక్ ఖాన్ ఓసారి చూసారు. ఓ ఏడాది షారుక్ ఖాన్ నటించిన -డంకీ-, ప్రభాస్ నటించిన -సలార్- చిత్రాలు ఒకేసారి రిలీజ్ అయ్యాయి. అప్పటికే షారుక్ ఖాన్ -పఠాన్-, -జవాన్- విజయాలతో మంచి ఫాంలో ఉన్నాడు.ఆ రెండు సినిమాలు 2000 కోట్లకు పైగా వసూళ్లను సాధించాయి. దీంతో రెట్టించిన నమ్మకంతో -డంకీ- చిత్రాన్ని 2023 డిసెంబర్ 21 న రిలీజ్ చేసాడు. ఆ మరుసటి రోజేనే ప్రభాస్ నటించిన -సలార్ సీజ్ ఫైర్- రిలీజ్ అయింది. అప్పటికే రెండు సినిమాల మధ్య టఫ్ ఫైట్ తప్పదని నెట్టింట మీడియా కథనాలు వెడెక్కించాయి. కానీ నిరిలీజ్ అనంతరం ప్రభాస్ వేగాన్ని షారుక్ ఖాన్ తట్టుకోలేకపోయాడు. -డంకీ- యావరేజ్ టాక్ రాగా, -సలార్- బ్లాక్ బస్టర్ టాక్ రావడంతో తేలిపోయింది. -డంకీ- 400 కోట్ల వసూళ్లను సాధించగా సలార్ 800 కోట్ల వసూళ్లతో టాప్ లో నిలిచింది.అదే -సలార్- రిలీజ్ లేని సమయంలో -డంకీ- రిలీజ్ అయి ఉంటే మంచి వసూళ్లను సాధించేదని ట్రేడ్ పండితలు అంచనా వేసారు. నార్త్ మార్కెట్ లోనే -డంకీ-పై ఆ రకంగా పంచ్ పడింది. ఈ నేపథ్యంలో తాజాగా 2027లోనూ ప్రభాస్-షారుక్ ఖాన్ తలపడే సన్నివేశం ఎదురైంది. ప్రభాస్ నటిస్తోన్న -స్పిరిట్- మార్చిలో రిలీజ్ డేట్ ను లాక్ చేసుకుంది. సరిగ్గా అదే సమయంలో షారుక్ ఖాన్ నటిస్తోన్న -కింగ్- చిత్రాన్ని కూడా రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ గత అనుభవం దృష్ట్యా కింగ్ చిత్రాన్ని ప్రీ పోన్ చేస్తున్నారు.ప్రభాస్ తో పోటీ పడటం కంటే ఇదే ఏడాది డిసెంబర్ లో క్రిస్మస్ కు రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారు. హాలీవుడ్ మూవీ -అవెంజర్స్ తో పోటీ పడటానికైనా షారుఖ్ సిద్ధపడ్డారు కానీ, ప్రభాస్ - సందీప్ వంగా మాస్ సునామీకి అడ్డంగా నిలబడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మరి క్రిస్మస్ రేసులో షారుఖ్ గెలుస్తాడా? లేదా? అన్నది చూడాలి. అయితే డిసెంబర్ నెల మాత్రం షారుక్ ఖాన్ కి బాగా కలిసొచ్చిన మాసం. సక్సెస్ సెంటిమెంట్ ను రిపీట్ చేస్తాడని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఇదే సినిమాతో షారుక్ ఖాన్ తనయ సుహాన్ ఖాన్ కూడా లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే.



ప్రియాంక జవాల్కర్ టాలెంట్, ఆకర్షణ

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965